

'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 169

శుక్రవారం 8-9-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అల్‌కరాజ్ అలవోకగా...

యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో సెమీస్‌లోకి డిఫెండింగ్ చాంపియన్. -13లో



భారత్‌లో ఫాక్స్‌కాన్ ఈవీ ప్లాంట్!

తైవాన్‌కు చెందిన చిప్ తయారీ సంస్థ యోచన. - 13లో



ఆ వ్యాఖ్యలను అంగీకరించం

సనాతన ధర్మంపై డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజా చేసిన వ్యాఖ్యలతో తాము ఏకీభవించబోమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది.
- వివరాలు 6లో



'సనాతన ధర్మం' ముసుగులో..

మణిపూర్ హింసపై విమర్శలను ఎదుర్కోలేని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాద్ధాంతం చేస్తున్నారని ఉదయనిధి అన్నారు.
- వివరాలు 6లో



మరింత సహకారానికి...

10 దేశాలతో కూడిన ఆసియాన్ కూటమి, భారత్ మధ్య మరింత సహకారానికి ప్రధాని మోదీ 12 సూత్రాల ప్రతిపాదనను తెచ్చారు.
- వివరాలు 6లో



నేడు పదాధికారుల సమావేశం..

కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న పదాధికారుల భేటీలో అమిత్ షా పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించనున్నారు.
- వివరాలు 2లో

న్యూస్‌రీల్


దేశ భద్రత కోసమే రాహుల్ పోరాటం



దేశ భద్రత, సమగ్రత కోసం రాహుల్ పోరాటం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీని ఆదర్శంగా తీసుకొని కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజులు, 4,183 కి.మీ. నడిచారని గుర్తు చేశారు.

- వివరాలు 2లో

దుర్గమ్మపై ఆన.. లంచం తీసుకోలేదు



ఏడుపాయల వనదుర్గ ఆలయం బీఆర్‌ఎస్ నాయకుల సవాళ్లు.. ప్రతి సవాళ్లు, ప్రమాణాలకు వేదికైంది. బీఆర్‌ఎస్‌లోని రెండు వర్గాలు తడి బట్టలతో ఒకరు.. పసుపు బట్టలతో మరొకరు అమ్మవారి వద్ద ప్రమాణాలు చేశారు.

- వివరాలు 2లో

ఆర్టీసీ విలీనం బిల్లు ఏమైంది?



ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశం మరోసారి గందరగోళంగా మారుతోంది. ఆగమేఘాల మీద శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఏమైందో స్పష్టత లేకపోవటం కార్మికుల్లో ఆందోళనకు, అయోమయానికి కారణమవుతోంది.

- వివరాలు 5లో

గైనిక్ సర్జరీల్లోనూ రోబోలు



వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొబోటిక్ సర్జరీలు హైదరాబాద్‌లోనూ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పేరొందిన దాదాపు ప్రతి ఆసుపత్రి ఈ శస్త్రచికిత్సా విధానాన్ని ఉపయోగిస్తోంది.

- వివరాలు 14లో

అద్భుత ఆతిథ్యానికి సిద్ధమైన భారత్..



అతిథులొస్తున్నారు

నేడు భారత్‌కు ప్రపంచ దేశాధినేతల ఆగమనం..

ప్రపంచంలోని ప్రధాన దేశాల అధినేతలు శుక్రవారం ఢిల్లీలో అడుగుపెట్టనున్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొని తమ వాణిని వినిపించనున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ మొదలు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ వరకు పలు దేశాల నాయక గణం నేడే హస్తినకు చేరుకోనుంది. మరో వైపు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2012లో అధికార పగ్గాలు చేపట్టాక తొలిసారిగా జీ20 సదస్సుకు హాజరుకావడం లేదు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైతం ఈ భేటీకి గైర్హాజరు అవుతున్నారు. ఏయే దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు శుక్రవారం ఏ సమయానికి విచ్చేస్తున్నారో ఓసారి చూద్దామా!

రేపు ఢిల్లీలో ప్రారంభంకానున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు

బ్రిటన్ :: రిషి సునాక్



జీ20 సదస్సు కోసం అందరికంటే ముందే భారత్‌కు చేరుకుంటున్న కీలక నేత రిషి సునాక్. భారతీయ మూలాలున్న బ్రిటన్ ప్రధాని అయిన సునాక్ శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట 40 నిమిషాలకు ఢిల్లీకి చేరుకుంటారు. కేంద్ర సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌదరి ఈయనకు సాదర స్వాగతం పలకనున్నారు. 'భారత్ జీ20కి సారథ్య బాధ్యతలు వహిస్తున్న ఈ ఏడాదికాలంలో భారత ప్రధాని మోదీ చేస్తున్న కృషి అమోఘం. ఆయన నాయకత్వంలో ప్రపంచ యవనికపై భారత్ సాధిస్తున్న విజయాలు అద్వితీయం' అని రిషి సునాక్ శ్లాఘించారు.

జపాన్ :: ఫుమియో కిషిదా



సునాక్ విమానం ల్యాండ్ అయిన కొద్దిసేపటికే పాలెం విమానాశ్రయంలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా విమానం ల్యాండ్ కానుంది. మధ్యాహ్నం 2.15 గంటలకు ఆయన భారత గడ్డపై అడుగుపెడతారు. ఈయనను మిగతా 3వ పేజీలో ▶

జిన్‌పింగ్ ఎందుకు రావట్లేదు ?

చుట్టుముట్టిన ఆర్థిక అనిశ్చితి ! సమస్యను మరింత పెంచిన హౌజింగ్ సంక్షోభం

- వివరాలు 6లో

చందాదారులకు మార్గదర్శి బెదిరింపులు

చెప్పింది చేయండి..

మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ ఆఫీసు నుంచే కాల్స్

- ఏపీ సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని హెచ్చరికలు
- రాష్ట్రంలో 3 వేల మందికి పైగా ఘోస్ట్ చందాదారులు
- అప్పుల ఊబిలోకి దించి ఆస్తులు రాయించుకుంటున్న వైనం
- బాధితుల ఫిర్యాదుతో శైలజా కిరణ్ సహా ఇతరులపై 3 కేసులు
- మార్గదర్శిలో రూ. కోటికిపైగా అక్రమ డిపాజిట్‌దారులు 800 మంది పైనే.. ఈ సొమ్ము ఎక్కడిదంటూ వీళ్లకు నోటీసులు
- మార్గదర్శి మోసాలను వెల్లడించిన సీఐడీ అదనపు డీజీ సంజయ్
- రూ. 9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్‌మెంట్



మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో సీఐడీ ఎస్పీ ఫకీరప్ప, బాధితురాలు అన్నపూర్ణ

సాక్షి, అమరావతి: ఏపీ సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని మార్గదర్శి చిట్ ఫండ్స్ చందాదారులను ఆ సంస్థ యాజమాన్యం బెదిరిస్తోందా? మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజా కిరణ్ ఆఫీసు నుంచే చందాదారులకు ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతోందా? ఇంతగా బరితెగించడం నిజమేనా? దీనిపై బాధితులు ఫిర్యాదు చేస్తున్నారా? తదితర ప్రశ్నలన్నింటికీ సీఐడీ విభాగం అవునని స్పష్టం చేస్తోంది. ఘోస్ట్ చందాదారుల పేరిట అక్రమాలకు పాల్పడుతుండటాన్ని సీఐడీ ఆధారాలతోసహా వెలికితీస్తుంటే బెంబేలెత్తిన మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా బెదిరింపులకు పాల్పడుతోందని కుండబద్దలు కొట్టింది. చందాదారులు, ఏజెంట్లను మోసగిస్తూ మార్గదర్శి భారీగా అక్రమాలకు పాల్పడుతోందని పలువురు బాధితుల ఫిర్యాదుతో విశాఖపట్నం, విజయవాడ, నరసరావుపేటలో తాజాగా ఆ సంస్థపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ ఫకీరప్పతో కలసి విలేకరుల సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఘోస్ట్ చందాదారుల పేరిట ఆర్థిక దందా

➤ మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రతి చిట్టీ గ్రూపులో కనీసం ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున మొత్తం మీద రాష్ట్రంలో 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల పేరిట భారీగా ఆర్థిక మోసానికి పాల్పడుతోంది. ఆ 3 వేల మందికి తెలియకుండానే వారిని చందాదారులుగా చూపిస్తూ వారి పేరిట అక్రమంగా ఆర్థిక వ్యవహారాలు మిగతా 10వ పేజీలో ▶

ఒకే రోజు 9 కొత్త మెడికల్ కాలేజీలు

ఈ నెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి..: మంత్రి హరీశ్‌రావు

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాం

ప్రభుత్వ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 3,915కు పెరుగుతున్నాయి

మరో వంద మహిళా ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు.. 12న ప్రారంభిస్తామని మంత్రి వెల్లడి

ప్రారంభానికి సిద్ధమైన నిర్మల్ వైద్య కళాశాల భవనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఈ నెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా ఒకేసారి వీటిని ప్రారంభించనున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. కాలేజీల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిలో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను వెంటనే సమకూర్చాలని సూచించారు. గురువారం ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

జిల్లాకో కాలేజీ ఏర్పాటులో భాగంగా..


రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంతోపాటు వైద్య విద్యను చేరువ చేసేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. గతేడాది ఒకే వేదిక నుంచి ఎనిమిది మెడికల్ కాలేజీలను ప్రారంభించిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కొత్త మెడికల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అందుబాటులో ఉండి, అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ అంశంపై శుక్రవారం మరోసారి సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షించాలని కాళోజీ వర్సిటీ వీసీ, వైద్య విద్య సంచాలకులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణలో కేవలం ఐదే మెడికల్ కాలేజీలు ఉండేవని, అందులోనూ మూడు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందే ఉన్నాయని హరీశ్ చెప్పారు. అదే ఇప్పుడు మిగతా 3వ పేజీలో ▶



నేనే నంబర్ వన్

- ఉన్నత విద్యా మండలి వీసీల మధ్య ఆధిపత్య పోరు
- తనను వీసీ-1గా చైర్మన్ చెప్పారంటున్న మహమూద్
- 60 ఫైళ్లపై ఆ హోదాలోనే సంతకాలు చేశానంటూ వివరణ
- వీసీ-2ను విద్యాశాఖ కార్యదర్శి వీసీ-1గా చేయడంతో రాజుకున్న వివాదం

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల (వీసీలు) మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఎవరు వీసీ-1 అనే దానిపై తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. అయితే ఈ వివాదానికి విద్యాశాఖ కార్యదర్శి కారణమనే ఆరోపణలు మండలి వర్గాల నుంచి వినిపిస్తుండగా, దీనిపై ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మండలి చైర్మన్ తలపట్టుకుంటున్నారు. ఉన్నత విద్యామండలిలో ఉన్నతస్థాయిలో చైర్మన్, రెండు వైస్‌చైర్మన్ పోస్టులున్నాయి. చైర్మన్‌గా ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి పదవీ కాలం ముగిసే నాటికి, ప్రస్తుత చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి వైస్ చాన్స్‌లర్-1గా ఉన్నారు. రెండో వీసీగా ప్రొఫెసర్ వెంకటరమణ కొనసాగుతున్నారు. పాపిరెడ్డి వైదొలగిన తర్వాత లింబాద్రి తాత్కాలిక చైర్మన్‌గా, వీసీ-1గా కొనసాగారు. అయితే ఈ ఏడాది లింబాద్రిని శాశ్వత చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఇదే సమయంలో మిగతా 3వ పేజీలో ▶



మనం.. మన మామ..

ఆదిత్య-ఎల్1 కెమెరా సెల్ఫీ..!

- సూర్యుడి దిశగా దూసుకుపోతున్న ఆదిత్య-ఎల్1 కెమెరా పని మొదలు పెట్టింది. తన సెల్ఫీతోపాటు భూమి, చంద్రుడిని కూడా క్లిక్‌మనిపించింది. ఈ మేరకు ఆదిత్య-ఎల్1 నుంచి అందుకున్న ఫొటోలను బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో విడుదల చేసింది. - 6లో

ఇదండీ సంగతి





ఆపరేషన్ 17!

హైదరాబాద్ స్టేట్ విమోచన దినోత్సవంపై మూడు ప్రధాన పార్టీల ఫోకస్

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజల్లోకి వెళ్లడంపై దృష్టి

- ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వ అధికారిక వేడుకలతో బీజేపీ ముందుకు..
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో సభ
- ఇదే రోజున ప్రత్యేక కార్యక్రమాలపై ఇప్పటికే కాంగ్రెస్ సిద్ధం
- సీడబ్ల్యూసీ సమావేశాలు, అగ్రనేతల బహిరంగ సభతో జనంలోకి..
- దీనికి ఒక రోజు ముందే 'పాలమూరు'ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- 17న దక్షిణ తెలంగాణ పల్లెల్లో సంబురాలు చేసుకోవాలంటూ పిలుపు
- దాదాపు ఒకే సమయంలో ప్రధాన పార్టీల కార్యక్రమాలతో హడావుడి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాలు హోరాహోరీ తలపడేందుకు శాయశక్తులా సిద్ధమవుతున్నాయి. గతంలో అనేకసార్లు రాజకీయ విమర్శలకు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు సాక్షీభూతంగా నిలిచిన సెప్టెంబర్ 17ను వేదికగా చేసుకుని రాజకీయ వేడి రగిలించేందుకు కార్యాచరణ రూపొందించుకున్నాయి. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలతో భారీ బహిరంగ సభలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేస్తే.. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అంతకు ఒకరోజు ముందే 'పాలమూరు-రంగారెడ్డి' ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమం, బహిరంగ సభతో జనం దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అధికారిక కార్యక్రమాల పేరిట ముందుకొస్తే.. కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)' సమావేశాలతో అగ్ర నాయకత్వాన్ని రంగంలోకి దించుతోంది. మొత్తంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా మూడు ప్రధాన పార్టీలు దూకుడు పెంచుతున్నాయి.

అధికారిక కార్యక్రమంతో 'బీజేపీ'

హైదరాబాద్ స్టేట్ భారత్‌లో భాగంగా మారిన సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలనే డిమాండ్ చాలా కాలం నుంచీ ఉంది. బీజేపీ ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ముందు నుంచీ ప్రయత్నాలు చేస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని విమర్శలు గుప్పించడంతో పాటు.. గత ఏడాది నేరుగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా ఉత్సవాలు నిర్వహించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దానికి హాజరయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈసారి ఉత్సవాలపై బీజేపీ మరింత ఫోకస్ పెట్టింది. అమిత్ షా ఆధ్వర్యంలోనే ఉత్సవాలు, భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమైంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా, ప్రజల్లోకి వెళ్లేలా బీజేపీ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది.

'సీడబ్ల్యూసీ' భేటీని ముందు పెట్టి..

సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి జనంలోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ముందుగానే ఆలోచనకు వచ్చింది. అగ్రనేతలతో పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను, వివిధ వర్గాలకు ఇచ్చే హామీలతో కూడిన డిక్లరేషన్లను ప్రకటించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ సమయంలో పార్టీ అధి ష్టానం సీడబ్ల్యూసీని పునర్వ్యవస్థీకరించడాన్ని రాష్ట్ర నేతలు సావకాశంగా మిగతా 3వ పేజీలో ▶

వచ్చే నెల్లో రాష్ట్రానికి సీఈసీ బృందం..

- అసెంబ్లీ ఎన్నికలకు సంసిద్ధతపై పరిశీలన
- వరుసగా 3 రోజుల పాటు విస్తృత సమీక్షలు
- తిరిగి వెళ్లిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ
- అక్టోబర్ రెండో వారంలో ప్రకటనకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ బృందం వచ్చే నెల తొలి వారంలో రాష్ట్ర పర్యటనకు రానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయానికి సమాచారం అందింది. అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ జారీ చేయడానికి ముందు ఎన్నికల కమిషనర్ల బృందం రాష్ట్రాల పర్యటనకు రావడం ఆనవాయితీ. తాజా పర్యటనలో భాగంగా ఎన్నికల కమిషనర్లు వరుసగా మూడురోజుల పాటు హైదరాబాద్‌లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించనున్నారు. ఈ బృందం రాష్ట్ర పర్యటన మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

కుటుంబ పాలనను గద్దె దించుదాం

తెలంగాణ ప్రవాసులారా కలసిరండి: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కుటుంబ పాలనను గద్దె దించేందుకు అమెరికాలోని తెలంగాణ ప్రవాసీలంతా కలసి రావాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. భారత్ ప్రపంచంలో నంబర్‌వన్ దేశంగా మారాలంటే మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడి మోదీ మూడోసారి ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం వర్జీనియాలోని లోటస్‌టెంపుల్‌లో ఓవర్‌సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్–గ్రీట్'లో సంజయ్ పాల్గొన్నారు. వాషింగ్టన్ డీసీలో దాదాపు 500 మంది బీజేపీ మద్దతుదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ 'భారత్, తెలంగాణలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల సమయంలో అమెరికాలో నివాసముంటున్న ప్రవాస భారతీయులు, తెలంగాణవాసులంతా ఇండియాకు తరలిరావాలి.. ఎన్నికల్లో మోదీ తరఫున ప్రచారం చేయండి. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోండి.' అని కోరారు. ఈ కార్యక్రమంలో ఓవర్‌సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అడపా ప్రసాద్, రాష్ట్రకార్యదర్శి బొమ్మ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, ఎంఐఎం స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తున్నాయి

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం




సాక్షి, హైదరాబాద్: సనాతన ధర్మాన్ని విమర్శించే వారికి బీఆర్ఎస్, ఎంఐఎం మద్దతు నిస్తూ, ఇలాంటి కార్యకలాపాలకు ఈ రెండు పార్టీలు స్లీపర్ సెల్స్‌గా పని చేస్తున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం ఆరోపించారు. ఈ పార్టీల కార్యక్రమాలు దేశ వ్యతిరేకమైనవే (యాంటీ నేషనల్)నని, అవి తమ కుటుంబ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలు అవినీతికి పాల్పడుతున్నాయని విమర్శించారు. గురువారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత అవినీతికి పాల్పడ్డారు.. అవినీతి, అక్రమాల్లో బాప్ ఏక్ నంబర్ అయి తే బేటీ దస్ నంబర్' అని ఆరోపణలు చేశారు. 'తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఇంట్లో గుడి ఉంది.. వాళ్ల అమ్మ పూజ లు చేస్తుంది, సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలతో ఆయన తన తల్లిని కూడా అవమానించారు'అని మండిపడ్డారు.

హైదరాబాద్, సికింద్రాబాద్ పేర్లను మార్చాలి

తెలంగాణలోని పట్టణాల పేర్లనూ మార్చాలి: శివసేన అధ్యక్షుడు శివాజీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బ్రిటిషర్లు, నిజాం నవాబులు పట్టణాలకు పెట్టిన పేర్లను మార్చి, వాటికి అసలు పేర్లతో తిరిగి చట్టం చేయాలని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు శింకారు శివాజీ డిమాండ్ చేశారు. ఇండియా పేరును భారత్‌గా మార్చనున్న మాదిరిగానే రాష్ట్రంలోని పట్టణాల పేర్ల మార్పును ఉద్యమంగా చేపట్టాలన్నారు. గురువారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పేరును భాగ్యనగర్‌గా, సికింద్రాబాద్ పేరును ఉజ్జయినీ మహంకాళీగా మార్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రాలైన నిజామాబాద్‌ను ఇందూరుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, కరీంనగర్‌ను కరినగరంగా మార్చాలన్నారు. తాను అందరికన్నా పెద్ద హిందువునని చెప్పుకున్న రాష్ట్ర సీఎం హిందూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఒక్క నిర్ణయం తీసుకోవడం లేదని శివాజీ విమర్శించారు. ఇక ఇండియా కూటమి పేరుతో ఏర్పాటైన పార్టీలు దేశం పేరును భారత్‌గా మార్చడాన్ని వ్యతిరేకించడం సిగ్గుచేటన్నారు. సనాతన ధర్మంపై పిచ్చిగా మాట్లాడితే బహిరంగదాడులకు కూడా తాము సిద్ధమని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 సవరణ తరువాత ఈ దేశాన్ని 'భారత్'గా మాత్రమే పిలవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

విద్యాసాగర్‌రావుతో కిరణ్‌కుమార్ రెడ్డి భేటీ



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర మాజీగవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావుతో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. విద్యాసాగర్‌రావు ఆహ్వానం మేరకు గురువారం ఆయన నివాసానికి వెళ్లిన కిరణ్ కుమార్ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, రాజకీయ అంశాలపై కొద్దిసేపు చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీని పటిష్టం చేసేందుకు పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు కిరణ్ పనిచేస్తున్నారని పార్టీనాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసిన విద్యాసాగర్ రావుతో అనేక అంశాలపై కిరణ్ చర్చలు జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి నాయకులను బీజేపీలో చేర్చుకునే విషయంలో చర్చలు సాగినట్లు తెలుస్తోంది.

దేశ భద్రత కోసమే రాహుల్ పోరాటం

సమగ్రత కోసమే భారత్ జోడో యాత్ర చేపట్టారు

- మోదీ పాలనలో దేశ భద్రతకు ముప్పు
- కల్వకుంట్ల కుటుంబాన్ని పొలిమేర దాటించాలి
- భారత్ జోడో యాత్ర ఏడాది ఉత్సవంలో రేవంత్‌రెడ్డి
- రాహుల్‌కు సంఘీభావంగా కాంగ్రెస్ జాతర



పాదయాత్ర అనంతరం మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో వీహెచ్, ఠాక్రే, అజారుద్దీన్, పొన్నాల, అంజన్ కుమార్ తదితరులు



ఎల్బీనగర్‌లో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో మధుయాష్కీ తదితరులు

సాక్షి, హైదరాబాద్ / ఖైరతాబాద్ / దిల్‌సుఖ్‌నగర్ / గచ్చిబౌలి: దేశాన్ని ఒక్కటి చేసేందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమాజిగూడ రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి ఇందిరాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాల వరకు నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఐమాక్స్ ఇందిరాగాంధీ రోటరీ చౌరస్తాలో మాట్లాడుతూ.. దేశ భద్రత, సమగ్రత కోసం రాహుల్ పోరాటం చేస్తున్నారని చెప్పారు. మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకొని అహింసా పోరాటాన్ని పునాదిగా వేసి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజులు, 4,183 కిలోమీటర్లు రాహుల్ గాంధీ నడిచారని గుర్తు చేశారు.

కల్వకుంట్ల కుటుంబాన్ని పొలిమేర దాటించాలి

రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న కల్వకుంట్ల కుటుంబాన్ని పొలిమేర దాటే వరకు తరమాల్సిన బాధ్యత ప్రజలందరిమీద ఉందని రేవంత్ అన్నారు. కేసీఆర్‌ను గెలిపించాలని ప్రతిసారీ అసదుద్దీన్ చెప్తున్నాడని, అసలు ఎందుకు గెలిపించాలని నిలదీశారు. ట్రిపుల్ తలాక్‌కు మోదీకి మద్దతుగా నిలిచినందుకా, 370 ఆర్టికల్‌కు ఓటు వేసినందుకా, నోట్ల రద్దు, జీఎస్టీలో మద్దతు తెలిపినందుకు గెలిపించాలా.. అని అసదుద్దీన్‌ను ప్రశ్నించారు. లక్ష కోట్లు లూటీ చేసిన కేసీఆర్ ఫ్యామిలీకి మద్దతు తెలుపుతున్నారంటే దాని ఆంతర్యమేంటన్నారు.

దేశ హోంమంత్రికి చిల్లర రాజకీయం తగునా

16,17,18 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాన్ని హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించాలని తలపెడితే అధికారం ఉంది కదా అని తాము బుక్ చేసుకున్న గ్రౌండ్‌ను రద్దు చేసి బీజేపీ వాళ్లు గుంజుకున్నారని రేవంత్ నిందించారు. ఇంత చిల్లర రాజకీయం హోంశాఖ మంత్రి చేయడం భావ్యమా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేశాయని, ఇందుకు ప్రతిగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలంతా కదలి వచ్చి మూడు రోజులపాటు హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టాలని, అత్యద్భుతంగా ఏఐసీసీ సమావేశాలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మాట్లాడుతూ... దేశాన్ని కలిపేందుకు ధర్మాలను ఒకటి చేసేందుకు రాహుల్ గాంధీ యాత్ర చేశారని ఇది ప్రపంచ రికార్డ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య, అజారుద్దీన్, అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, రోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో భట్టి.. కోదాడలో ఉత్తమ్.. ఎల్బీనగర్‌లో యాష్కీ

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర చేపట్టాయి. మహేశ్వరం నియోజకవర్గంలోని కొత్తపేటలో జరిగిన పాదయాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కోదాడలో జరిగిన యాత్రలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎల్బీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పాల్గొన్నారు.

రేపు భట్టి పాదయాత్ర 'డైరీ' విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర డైరీని శనివారం ఆవిష్కరించనున్నారు. సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సురేందర్ రచించిన ఈ డైరీని గాంధీభవన్‌లో విడుదల చేయనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హాజరుకానున్నారు.

మేకిన్ ఇండియా అని భారత్ పేరు పెడతారా..

మేకిన్ ఇండియా అన్న పీఎం మోదీ ఇప్పుడు ఇండియా పేరు తీసేసి భారత్ పేరు పెడతాననడం ఏంటని రేవంత్ ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రమాదకరంగా మారిన ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ నేతృత్వంలో 28 పార్టీలు కలిసి ఇండియా కూటమి కడితే.. దాన్ని ఎదుర్కోలేక ఇండియా పేరు మారుస్తానన్న భావదారిద్ర్యం ప్రధాన మంత్రికి, బీజేపీకి వచ్చిందంటే సిగ్గుపడాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలే గానీ ఈ దేశం పేరు మారిస్తే ఎవరి బతుకుల్లోనూ మార్పులు రావన్నారు. మోదీ పాలనలో దేశ భద్రతకే ముప్పు వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం: పొంగులేటి



రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని... అందరికీ ఇందిరమ్మ పథకాలు అందిస్తుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో–చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీనియర్ నేత రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. పొంగులేటి మాట్లాడుతూ జోడో యాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకున్న రాహుల్ ప్రధాని అయిన తరువాత పరిష్కరిస్తారని తెలిపారు.

మంత్రినైపోయా.. లేకుంటే కొట్టేవాడిని

ఎర్రబెల్లి వివాదాస్పద వ్యాఖ్యలు



సంగెం: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ జిల్లా సంగెం మండలంలో బుధవారం కాంగ్రెస్ నేతలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆయన మాట్లాడిన మాటలు గురువారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. గవిచర్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి ప్రతిపక్షాలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు దుర్మార్గపు అబద్ధపు మాటలు చెబుతుంటే.. ఈడ్చి కొట్టాలని ఉన్నా.. మంత్రి పదవి అడ్డు వస్తోందని పేర్కొన్నారు. తనకు టీడీపీని వీడాలని లేదని.. చంద్రబాబు ఇక్కడ దుకాణం ఎత్తివేసి ఆంధ్రాకు వెళ్లడంతో.. ఇక్కడ పార్టీని ఎంత లేపాలని చూసినా లేవదు కాబట్టి.. కార్యకర్తలను కాపాడుకోవడానికే బీఆర్ఎస్‌లో చేరానని స్పష్టం చేశారు. ఎర్రబెల్లి వ్యాఖ్యలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

వచ్చే నెల్లో రాష్ట్రానికి సీఈసీ బృందం

▶ మొదటి పేజీ తరువాయి

ముగించుకుని వెళ్లిన తర్వాత రెండో వారంలో షెడ్యూల్ జారీ చేసే అవకాశాలున్నాయి. నాటి నుంచి 40 రోజుల్లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుంది. ప్రస్తుత శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 16తో ముగియనుండగా, ఆలోగా ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉండటంతో డిసెంబర్‌లో పోలింగ్ జరిగే అవకాశాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఓటర్ల జాబితా రెండో సవరణ కార్యక్రమంలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 4న ప్రచురించనున్నారు.

కలెక్టర్లు, ఎస్పీలతో మొదలుపెట్టి..

కేంద్ర ఎన్నికల కమిషనర్ల బృందం తొలుత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఒక రోజంతా సమావేశమై జిల్లా స్థాయిలో ఏర్పాట్లను సమీక్షించనుంది. ఈవీఎంల సంసిద్ధత, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితాలు, బందోబస్తు, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించనుంది. ఒక్కో జిల్లా కలెక్టర్, ఎస్పీతో ముఖాముఖిగా మాట్లాడనుంది. రెండో రోజు పోలీసు, సీఐడీ, ఈడీ, ఐటీ, వాణిజ్య పన్నులు, రవాణా, సీఐఎస్ఎఫ్, ఎన్సీబీ, రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎక్సైజ్, కస్టమ్స్, అటవీ శాఖ వంటి దర్యాప్తు విభాగాలతో సమావేశమై ఎన్నికల్లో అక్రమాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షిస్తుంది. మద్యం, డబ్బులు, ఇతర ప్రలోభాలకు అడ్డుకట్టవేయడం, సామాజిక మాధ్యమాల్లో జరిగే దుష్ప్రచారాలను అడ్డుకోవడం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు, నగదు లావాదేవీలపై నిఘా, తనిఖీలు తదితర అంశాలను పర్యవేక్షించనుంది. చివరగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించనుంది. రాష్ట్ర సీఈఓ వికాస్‌రాజ్, ఆయన కార్యాలయ అధికారులతో కూడా భేటీ కానుంది.

నాలుగోరోజు 333 దరఖాస్తులు

బీజేపీ టికెట్ల కోసం మొత్తం వచ్చినవి 999



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ కోసం గురువారం 333 దరఖాస్తులు అందినట్లు పార్టీవర్గాల సమాచారం. ఎన్నికల్లో పోటీకి ఉత్సాహపడుతున్నవారి నుంచి బుధవారం వరకు 666 దరఖాస్తులు అందగా, నాలుగోరోజు కూడా కలిపి మొత్తంగా 999 దరఖాస్తులు కమిటీకి చేరినట్టు అయింది. గురువారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించినవారిలో మాజీ ఎమ్మెల్యే ఒంటేరు జైపాల్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, పాండు తదితరులు ఉన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వివిధ ప్రాంతాలు, నియోజకవర్గాలకు చెందిన నాయకులు దరఖాస్తులు సమర్పించి టికెట్ వస్తుందా లేదా అన్న దానిపై అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే వీరిలో మెజారిటీ 'నాన్ సీరియస్'అభ్యర్థులే ఉన్నారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోటీచేయాలని అనుకునే నేతలంతా వారి వారి సీనియారిటీ, స్థానికంగా బలం, పార్టీలో పేరు ప్రఖ్యాతులు, ప్రజల్లో పలుకుబడి వంటి వాటితో సంబంధం లేకుండా దరఖాస్తులు సమర్పించవచ్చని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ తాజాగా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్దా, చిన్నా అనే తేడా లేకుండా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావించే ముఖ్యనేతలంతా రాబోయే మూడురోజుల్లో మరీ ముఖ్యంగా, వచ్చే శని, ఆదివారాల్లో తాము పోటీచేసే స్థానాలకు దరఖాస్తులు అందజేయనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. దీంతో ఎవరెవరు ఎక్కడి నుంచి పోటీచేస్తారనే దానిపైనా స్పష్టత వస్తుందని నాయకులు అంచనా వేస్తున్నారు.

పొత్తు సరే.. సీట్ల మాటేంటి?

వామపక్షాలతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ సుముఖత

- చెరో ఐదు స్థానాలు కేటాయించాలంటున్న కమ్యూనిస్టులు
- ఏఐసీసీ నేతలతో సీపీఐ, సీపీఎం నేతల సంప్రదింపులు
- సీట్ల సంఖ్యపై స్పష్టత వచ్చాకే చర్చలకు వెళ్లే యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో కమ్యూనిస్టు పార్టీల పొత్తుకు మార్గం దాదాపుగా సుగమమైంది. మునుగోడులో వామపక్షాలతో జత గట్టినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకే బీఆర్ఎస్ మొగ్గుచూపింది. బీఆర్ఎస్‌తో బ్రేకప్ నేపథ్యంలో లెఫ్ట్ పార్టీలు ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేశాయి. కాంగ్రెస్ జాతీయ స్థాయి నేతలతో జరిపిన సంప్రదింపులు దాదాపు సక్సెస్ అయినట్లేననే సంకేతాలు వెలువడుతున్నాయి. ఏఐసీసీ నేతృత్వంలో జాతీయ స్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో వామపక్షాలు సైతం భాగస్వాములుగా ఉండడంతో రాష్ట్రంలో ఆ రెండు పార్టీల మధ్య పొత్తుపై సానుకూలతకు పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. అయితే తమకు కేటాయించే సీట్ల సంఖ్యపై స్పష్టత వచ్చిన తర్వాతే ఈ విషయంలో మరింత ముందుకెళ్లాలనే ఆలోచనలో లెఫ్ట్ పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. రెండ్రోజుల క్రితం రాష్ట్రానికి వచ్చిన ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొత్తు, సీట్లు చర్చకు వచ్చినట్లు సమాచారం.

చెరో ఐదు సీట్లు ఇవ్వండి

పొత్తుకు కాంగ్రెస్ ప్రాథమికంగా సమ్మతించినప్పటికీ సీట్ల విషయాన్ని తేల్చలేదు. అయితే సీపీఐ, సీపీఎంలు చెరో ఐదు సీట్లలో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ వద్ద ప్రతిపాదనలు ఉంచినట్లు సమాచారం. సీపీఐ నేత నారాయణ తాము ఐదు స్థానాల్లో పోటీ చేస్తామని, కొత్తగూడెం, వైరా, హుస్నాబాద్, బెల్లంపల్లి, మునుగోడు స్థానాల్లో తమ పార్టీ బలంగా ఉందని పేర్కొన్నట్లు సమాచారం. అయితే తాము అత్యంత బలంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు సీట్లను కేటాయించడాన్ని కాంగ్రెస్ కొంత ఇబ్బందికరంగా భావిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. సీపీఎం సైతం ఐదు సీట్లలో పోటీ చేస్తామంటోంది. భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడ, మధిర, ఇబ్రహీంపట్నం స్థానాలు కేటాయించాలని ప్రతిపాదించినట్లు, ఈ మేరకు ఠాక్రేతో ఫోన్‌లో సీపీఎం నేతలు మాట్లాడినట్లు తెలిసింది. కాగా సీట్ల విషయంలో స్పష్టత వచ్చిన తర్వాతే చర్చలు కొనసాగించాలని వామపక్ష పార్టీలు నిర్ణయానికి వచ్చాయని సమాచారం.

కాంగ్రెస్ తర్జనభర్జన!

వామపక్ష పార్టీల ప్రతిపాదనల నేపథ్యంలో.. వారికి ఎక్కడెక్కడ సీట్లు కేటాయించాలనే అంశంపై కాంగ్రెస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ పార్టీ అధిష్టానం మాత్రం క్షేత్రస్థాయిలో నాయకత్వం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు జిల్లాల వారీగా కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

నేడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సెప్టెంబర్ 17న కార్యక్రమాలు, అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణపై చర్చ



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం పార్టీ కార్యాలయంలో పదాధికారుల సమావేశం జరగనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్ విమోచన దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన, ఈ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యాచరణ, రాష్ట్ర పార్టీ సన్నద్ధమవుతున్న తీరు తదితర అంశాలు సమావేశంలో చర్చకు వచ్చే అవకాశాలున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఇతర నేతలు పాల్గొంటారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికపై చర్చించి అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యనేతలు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడ?

- ఇచ్చినట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- సర్కారుకు ఈటల రాజేందర్ సవాల్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్/కంటోన్మెంట్: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చినట్టు నిరూపిస్తే, తాను ముక్కు నేలకు రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. రైతాంగానికి నిరంతర విద్యుత్ ఇస్తున్నట్టు అబిడ్స్ చౌరస్తాలో, సచివాలయంలో నిరూపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తాను ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. గురువారం ఈటల మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌ది అబద్ధాల ప్రభుత్వమనీ, చెప్పేదానికి చేసేదానికి ఏమాత్రం సంబంధం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతిపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులను పోలీసులు విచక్షణారహితంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల రైతన్నలు అప్పులపాలయ్యారనీ, రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల బకాయిలు ఎగ్గొట్టే వారనే ముద్ర తెలంగాణ రైతుల పైన పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హోంగార్డులకు సీఎం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఈటల డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్ల మంజూరు, కొత్త కేటాయింపు అంశాల్లో సంబంధిత పీఆర్ మంత్రికే ప్రమేయం లేకుండా పోయిందని ఈటల ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌ను గద్దె దింపుతాం

40 నియోజకవర్గాల్లో కీలకంగా ఉన్న ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా వారిని అవమానించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సీఎం కేసీఆర్‌ను గద్దె దించుతామని ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ తొలిమేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపకుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 130 వ జయంతి సందర్భంగా జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కృష్ణస్వామి హైదరాబాద్ ప్లాన్ ఇచ్చిన మేధావి, రచయిత, కవి అని కొనియాడారు. ప్రొఫెసర్ గాలి వినోద్, బండ ప్రకాశ్ ముదిరాజ్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మపై ఆన.. లంచం తీసుకోలేదు

- నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- ఏడుపాయల ఆలయంలో మెదక్ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి ప్రమాణం
- ఆయనది అసత్య ప్రమాణం
- ఆలయంలో అసమ్మతి నేతల ప్రమాణం



తడి బట్టలతో ఆలయానికి వస్తున్న దేవేందర్‌రెడ్డి

పాపన్నపేట (మెదక్): ఏడుపాయల వనదుర్గ ఆలయం గురువారం బీఆర్ఎస్ నాయకుల సవాళ్లు.. ప్రతి సవాళ్లు, ప్రమాణాలకు వేదికైంది. బీఆర్ఎస్‌లోని రెండు వర్గాలు తడి బట్టలతో ఒకరు.. పసుపు బట్టలతో మరొకరు అమ్మవారి ఎదుట ప్రమాణాలు చేశారు. 'నా రాజకీయ జీవితంలో ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోలేదని వనదుర్గమ్మ మాత ఎదుట ప్రమాణం చేస్తున్నా. తప్పు చేసినట్లు నిరూపిస్తే మెదక్ రాందాస్ చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తా' అంటూ ఇఫ్కో డైరెక్టర్, మెదక్ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఎదుట గురువారం ప్రమాణం చేశారు. తాను ప్రకటించినట్లుగా 150 మంది కార్యకర్తలతో ఆలయానికి చేరుకున్నారు. మంజీరా నదిలో స్నానం చేసి రాజగోపురంలోని దుర్గమ్మ ఉత్సవ విగ్రహం వద్ద పూజలు చేసి ప్రమాణం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొనాపూర్ సొసైటీలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, భూకబ్జాలు, ఇసుక దందాలు, భూపంచాయితీలు, సెటిల్మెంట్లు చేయలేదన్నారు. సామాజికసేవ కోసం కాంట్రాక్టర్లు, అధికారుల సహాయం తీసుకున్నానే తప్ప ఎవరినీ బెదిరించలేదన్నారు. ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని చెప్పారు.

వందల ఎకరాల భూములు కొన్నారు...

దైవ సన్నిధిలో చేసిన అసత్య ప్రమాణాలతో దేవేందర్‌రెడ్డి పతనం ప్రారంభమైందని బీఆర్ఎస్ అసమ్మతి నేతలు అన్నారు. దేవేందర్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన అసమ్మతి నాయకులు మదూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, చిన్నశంకరంపేట మాజీ ఎంపీపీ అరుణ, సర్పంచ్ రాజారెడ్డి, అడ్వొకేట్ జీవన్‌రావు తదితరులు 100 మందితో కలిసి గురువారం ఏడుపాయలకు చేరుకున్నారు. పసుపు బట్టలతో ఆలయంలోకి వచ్చి పూజలు చేసి అమ్మవారి సన్నిధిలో ప్రమాణం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవేందర్‌రెడ్డి తన భూదందాలు, ఇసుక మాఫియా, లంచాలు, కొనాపూర్ సొసైటీ వ్యవహారం, అక్రమ సంపాదనపై జవాబు చెప్పకుండా అమ్మవారి ఎదుట అసత్య ప్రమాణం చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన అఫిడవిట్‌తో తాము వచ్చామని పేర్కొన్నారు. రూ.కోట్ల అవినీతిపై కాకుండా కేవలం ఏడుపాయల విషయంపై స్పందించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. శంకరంపేట, నర్సాపూర్, మెదక్‌తో పాటు కామారెడ్డి జిల్లాల్లో వందల ఎకరాల భూములు కొన్నారని ఆరోపించారు. ఏ హోదాలో కలెక్టర్ పక్కన కూర్చొని సమావేశాల్లో సమీక్షలు చేస్తున్నారని ప్రశ్నించారు. మెదక్ డెయిరీ పేరిట కార్యకర్తల నుంచి రూ. లక్ష చొప్పున వసూలు చేసిన రూ. కోటి సొమ్మును ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మెదక్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని మార్చకపోతే రెబల్ అభ్యర్థిని పోటీకి దింపక తప్పదని హెచ్చరించారు.

రాజయ్య సహకరిస్తారని నమ్ముతున్నా: కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: వచ్చే ఎన్నికల్లో తన గెలుపునకు సోదరుడు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సహకరిస్తారని నమ్ముతున్నట్లు ఎమ్మెల్సీ, స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్న, చిన్న విషయాలున్నాయని, త్వరలోనే సద్దుమణుగుతాయని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తామని అన్నారు. గతంలో 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీ నుంచి రెండుసార్లు డాక్టర్ రాజయ్యకు అవకాశం కల్పించారని, రాజయ్యకు మద్దతుగా తాను, తన అనుచరులు కలిసి పనిచేశామని చెప్పారు. ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, పార్టీ ప్రజాప్రతినిధుల సహకారంతో గులాబీ జెండా ఎగురవేసేలా కృషి చేస్తామన్నారు. తాను ఎవరో తెచ్చిన పనులను చెప్పుకోవడం లేదని, తన లెటర్ ప్యాడ్ మీద వచ్చిన పనులనే చెబుతున్నానని కడియం అన్నారు. 'అభివృద్ధి నేను చేస్తే, ఎవరో వచ్చి చెప్పుకుంటున్నారు'అని ఇటీవల ఎమ్మెల్యే రాజయ్య చేసిన వ్యాఖ్యలకు కడియం కౌంటర్ ఇచ్చినట్లుగా ఉందనే చర్చ జరుగుతోంది. ఔర్ ఏక్ దక్కా.. మూడోసారి కేసీఆర్ సీఎం పక్కా అని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' పూర్తికాకుండానే ప్రారంభోత్సవమా?

ట్విట్టర్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: 'సగం పనులు కూడా కాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలట. పూర్తే కాని రిజర్వాయర్లకు పూజలట' అని ఎద్దేవా చేస్తూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్వీట్ చేశారు. స్వరాష్ట్రంలో ప్రారంభించిన తొలి ప్రాజెక్టు పాలమూరు– రంగారెడ్డిని కేసీఆర్ సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం నామమాత్రం పనులు చేసి, ప్రాజెక్టు మొత్తం పూర్తయిందనే భ్రమను సృష్టిస్తున్నారన్నారు. వాస్తవానికి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 50% కూడా కాలేదని, అందులోని 4 రిజర్వాయర్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ ప్రాజెక్ట్ మొత్తం కట్టినట్లు కలరింగ్ ఇస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ కాలువలకు భూసేకరణ కూడా పూర్తి కాలేదంటే, పాలమూరు ప్రాజెక్టుపై కేసీఆర్ చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందన్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్‌తో మేఘాలయ ముఖ్యమంత్రి భేటీ



సాక్షి, హైదరాబాద్: సీఎం కె.చంద్రశేఖరరావుతో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె.సంగ్మా గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రగతిభవన్‌కు వచ్చిన సంగ్మాను ముఖ్యమంత్రి కేసీఆర్ సాదరంగా ఆహ్వానించి తేనీటి విందు ఇచ్చారు. అనంతరం ఇరువురు ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. సంగ్మాను శాలువాతో సత్కరించిన ముఖ్యమంత్రి కేసీఆర్ మెమెంటో బహూకరించారు. అనంతరం మేఘాలయ సీఎం తిరుగుపయనమయ్యారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కె.వంశీధర్‌రావు తదితరులు ప్రగతిభవన్‌లో సీఎంలను కలిసిన వారిలో ఉన్నారు.

21, 22న బీసీల చలో ఢిల్లీ

పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21, 22 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా బిల్లులో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే ఆ బిల్లుకు సార్థకత ఉండదని పేర్కొన్నారు. ఇప్పటికే మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని, లోక్‌సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. బీసీల తరపున సీఎం కేసీఆర్ కేంద్రంపై పోరాటం చేయాలని కోరారు. మహిళా బిల్లు కోసం మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత బీసీ మహిళలకు సబ్ కోటా విషయంపై కూడా మాట్లాడాలని కోరారు.

అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఎఫ్‌జీజీ లేఖ



సాక్షి, హైదరాబాద్: రానున్న శాసనసభ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని, ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంచినా కేసులు నమోదు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఈసీని కోరింది. ఈ మేరకు గురువారం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి లేఖ రాశారు. ఎన్నికల కోడ్ సమయంలో డబ్బు పట్టుబడినప్పుడు కేసు నమోదు చేసి, ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేయాలన్నారు. ఈ నిబంధన అమలు చేయడానికి రెండు నెలల ముందు నుంచే ప్రచారం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్నట్లు ఎన్నికలకు ఒక రోజు ముందు, అలాగే ఎన్నికల రోజు మాత్రమే మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేయకుండా, ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచే మద్యం అమ్మకాలు నిలిపేయాలన్నారు. మంత్రులు వారి అధికార పర్యటనను ఎన్నికల ప్రచారంలో కలపొద్దని, వాహనాలు, ఇతర సిబ్బందిని ఉపయోగించవద్దని కోరారు. ఈ విధివిధానాలు, సలహాలు, సూచనలు అమలు చేసేలా జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని పద్మనాభరెడ్డి తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల స్థాపనకు దళిత యువతను ప్రోత్సహించాలి

రేవంత్‌ను కోరిన సీఓడీఈ మునిస్వామి

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక విధానంలో భాగంగా దళిత యువత పరిశ్రమలు స్థాపించేందుకు పోత్సహించాలని, అందుకు కావాల్సిన రాయితీలు, భూమి కేటాయించాలని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ దళిత్ ఆంట్రప్రెన్యూర్స్ (సీఓడీఈ) కోరింది. ఈ మేరకు గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఓడీఈ అధ్యక్షుడు సీఆర్ మునిస్వామి, అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ ఉప ప్రణాళిక నిధుల నుంచి రాష్ట్రస్థాయి వెంచర్ కాపిటల్ ఫండ్ ఏర్పాటు చేయాలని కోరారు. దళిత కుటుంబాల ఆదాయ పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, ప్రతీ నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, శిక్షణ తీసుకున్న ప్రతీ ఒక్కరికి రూ.10లక్షల ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనలో, మార్కెట్ యార్డులలో దళితులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

గురుకులంపై గురి... లేకుంటే 'ప్రైవేటు' సరి

ఇంటర్ ప్రవేశాల తీరిది

గురుకులం, మోడల్, కేజీబీవీల్లో 98 వేల మంది విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: గురుకులంలో సీటొచ్చిందా... సరేసరి. లేకుంటే ప్రైవేటు కాలేజీనే బెస్ట్ అంటున్నారు ఇంటర్ విద్యార్థులు. 2023–24 ప్రవేశాలను పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. ఈ ఏడాది 4,92,873 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌లో చేరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 83,177 మంది చేరగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో 98,536 మంది చేరారు. ఇక రాష్ట్రంలోని 1,285 ప్రైవేటు కాలేజీల్లో ఏకంగా 3,11,160 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ లెక్క గమనిస్తే సాధారణ ప్రభుత్వ కాలేజీల కన్నా, గురుకులాల్లో చేరేందుకే విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కేజీబీవీలు, గురుకులాల్లో ప్రత్యేక హాస్టళ్లు ఉండటం, విద్యాబోధనలో ప్రమాణాలు పాటించడం వల్ల మంచి ఫలితాలొస్తున్నాయని, అందుకే గురుకులాలకు తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రాధాన్యతనిస్తున్నారని అధికారులు అంటున్నారు. గురుకులాల తర్వాత ప్రైవేటు కళాశాలలవైపే విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు.

గతేడాది కంటే ఇంటర్ ప్రవేశాలు తక్కువే

నిజానికి గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఇంటర్‌లో చేరిన వారి సంఖ్య తక్కువే. 2022–23లో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 4,98,699 మంది ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది 4,92,873 మంది విద్యార్థులు ఇంటర్‌లో చేరారు. అంటే, ఈ సంవత్సరం 5,826 మంది తగ్గిపోయారు. టెన్త్‌లో ఉత్తీర్ణత తగ్గడం దీనికి ఒక కారణమైతే, పాలిటెక్నిక్‌లో కొత్త కోర్సులు రావడంతో కొంతమంది అటు వైపు మొగ్గు చూపారు.

వీటిల్లో ఏయే సంస్థల్లో ఎంత మంది ఫస్టియర్ విద్యార్థులు చేరారంటే?

యాజమాన్యం	కాలేజీల సంఖ్య	2022-23 ప్రవేశాలు	2023-24 ప్రవేశాలు
బీసీ వెల్ఫేర్	260	8,677	14,077
కేంద్ర ప్రభుత్వ కాలేజీలు	1	152	160
కాంపోజిట్ కాలేజీలు	1	87	90
కో-ఆపరేటివ్ కాలేజీలు	14	1,948	1,673
ప్రభుత్వ కాలేజీలు	408	89,922	83,177
ఇన్సెంటివ్ కాలేజీలు	9	1,404	1,309
కేజీబీవీలు	279	11,881	13,312
మోడల్ స్కూల్స్	193	19,406	17,898
ఎయిడెడ్	37	6,149	5,646
ప్రైవేటు కాలేజీలు	1,285	3,16,495	3,11,160
సోషల్ వెల్ఫేర్	237	15,385	16,102
టీఎంఆర్‌జేసీ	204	8,757	10,506
ట్రైబల్ వెల్ఫేర్	122	8,255	8,416
గవర్నమెంట్ స్పోర్ట్స్	1	45	33
టీఎస్ఆర్‌జేసీ	35	2,581	2,560
టీఎస్ఆర్టీసీ	1	56	33
వొకేషనల్	91	7,499	6,721
మొత్తం	3,178	4,98,699	4,92,873

ఇంటరే కీలకం..

టెన్త్ వరకూ విద్యాభ్యాసం ఎలా ఉన్నా.. ఇంటర్ విద్యను కీలకంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులూ భావిస్తున్నారు. ఇంటర్‌తో పాటే జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని భావిస్తుంటారు. ఈ కారణంగా ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి అకడమిక్ విద్యతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన తర్ఫీదు తీసుకుంటున్నారు. ఇంటి వద్ద నుంచి కాలేజీకి వెళ్లి రావడం వల్ల మంచి ఫలితాలు రావని తల్లిదండ్రులు భావిస్తున్నారు. హాస్టల్ వసతి ఉన్న చోటే పిల్లలను చదివించాలనే ఆలోచన కొన్నేళ్లుగా పెరిగింది. ప్రభుత్వ గురుకులాల్లో సీట్లు వస్తే సరి... లేకుంటే వ్యయ ప్రయాసలు భరించైనా హాస్టల్ వసతి ఉన్న ప్రైవేటు కాలేజీల్లో చదువు చెప్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు 3,178 ఉన్నాయి.

హరీశ్ పరీక్ష ఫలితాలు వెల్లడించండి

విద్యార్థిపై డీబార్ ఎత్తివేత..

'వాట్సాప్‌లో టెన్త్ ప్రశ్నపత్రం' కేసులో విద్యార్థికి హైకోర్టులో ఊరట



విద్యార్థి హరీశ్‌తో బల్మూరి వెంకట్

సాక్షి, హైదరాబాద్/కమలాపూర్: పదోతరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో బాధ్యుడిని చేస్తూ హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న దండెబోయిన హరీశ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి చేసిన డీబార్‌ను హైకోర్టు ఎత్తివేసింది. అనంతరం ఇతర విద్యార్థులలాగానే హరీశ్‌కు అన్ని సర్టిఫికెట్లు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. కమలాపూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో పదో తరగతి పరీక్షల సందర్భంగా ఏప్రిల్ 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి రాగా విద్యార్థి దండెబోయిన హరీశ్‌ను బాధ్యుడిని చేస్తూ అప్పటి డీఈఓ ఐదేళ్లపాటు డీబార్ చేశారు. దీంతో విద్యార్థి హైకోర్టును ఆశ్రయించగా మధ్యంతర ఉత్తర్వులతో మిగిలిన పరీక్షలు రాశాడు. అయినప్పటికీ ఫలితాల్లో హరీశ్‌ది విత్‌హెల్డ్‌లో పెట్టి మాల్ ప్రాక్టీస్ కింద చూపారు. దీంతో హరీశ్ మరోసారి తన ఫలితాలు ప్రకటించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. హరీశ్ పరీక్ష ఫలితాలను అధికారులు వెల్లడించకుండా విత్ హెల్డ్‌లో పెట్టారని, దీంతో అతను పైతరగతులకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. హరీశ్ ఫలితాలు వెంటనే వెల్లడించడంతోపాటు సర్టిఫికెట్లన్నింటినీ అందజేయాలని అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఉత్తర్వుల పట్ల హరీశ్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కోర్టు చెప్పినా ఫలితాలు ప్రకటించడం లేదు: బల్మూరి

పేపర్ లీకేజీ కేసులో అకారణంగా డీబార్ చేసిన విద్యార్థి హరీశ్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పినా హరీశ్ ఫలితాలు విడుదల చేయడం లేదని, మరో రెండు, మూడు రోజుల్లో ఇంటర్ అడ్మిషన్లు పూర్తవుతున్న తరుణంలోనైనా ప్రభుత్వం ఫలితాలు విడుదల చేసి హరీశ్‌కు న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీలు తమ రాజకీయ డ్రామాల కోసం హరీశ్ జీవితంతో ఆడుకుంటున్నాయని గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. కనీసం పదో తరగతి పేపర్ లీకేజీతో సంబంధం ఉందని అరెస్టు చేసిన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కేసు ఏమైందో అయినా ప్రభుత్వం చెప్పాలని వెంకట్ ఎద్దేవా చేశారు.

ఎంబీబీఎస్ రెండో విడత అడ్మిషన్ రిపోర్టింగ్ గడువు పెంపు

ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు గడువు ఇచ్చిన కాళోజీ హెల్త్ వర్సిటీ

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ రెండో విడత అడ్మిషన్ రిపోర్టింగ్ గడువును కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం పొడిగించింది. క్షేత్రస్థాయిలో అభ్యర్థులు, తల్లిదండ్రుల నుంచి గడువు పెంచాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు పెద్దసంఖ్యలో వినతులు అందాయి. ఎంబీబీఎస్ రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులకు మూడోవిడత కౌన్సెలింగ్‌లోనూ అవకాశం కల్పించాలని, లేకుంటే మెరిట్ విద్యార్థులు నష్టపోతారని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. దీనిపై మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల వినతులను పరిగణనలోకి తీసుకున్న మంత్రి సెకండ్ ఫేజ్‌లో చేరినవారికి అప్‌గ్రేడేషన్‌కు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రెండోవిడతలో ఎంబీబీఎస్ సీట్లు పొందిన అభ్యర్థులకు రిపోర్టింగ్ గడువును ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు గడువు పొడిగించాలని మంత్రి వర్సిటీ అధికారులకు సూచించడంతో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రి హరీశ్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని కాళోజీ విశ్వవిద్యాలయం ప్రకటించింది.

ఐసెట్ కౌన్సెలింగ్ షురూ

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి టీఎస్ ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. గురువారం వరకూ 16,716 మంది స్లాట్స్ బుక్ చేసుకున్నారు. వీరికి శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని సాంకేతిక విద్య మండలి ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 12 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుంది. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ వరకూ ఆప్షన్లు ఇవ్వొచ్చు. సీట్లు కేటాయింపు ఈ నెల 18న ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఎంబీఏ కాలేజీలు 245 ఉన్నాయి వీటిల్లో కన్వీనర్ కోటా కింద 22,843 సీట్లున్నాయి. ఎంసీఏ కాలేజీలు 47 ఉన్నాయి. వీటిల్లో 3,042 సీట్లు కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్నాయి.

ఆపరేషన్ 17!

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో కొత్త కమిటీ తొలి సమావేశాలకు హైదరాబాద్‌ను వేదికగా చేసుకొనేలా అధిష్టానాన్ని ఒప్పించారు. ఇదే సమయంలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. పార్టీ అగ్రనాయకత్వమంతా పాల్గొనే ఈ సభలో వారితో హామీలు ఇప్పించి.. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలతను పెంచుకునేందుకు రంగం సిద్ధం చేశారు. హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో నిర్వహించే ఈ సభలో.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఇతర జాతీయ నేతలూ పాల్గొననున్నారు.

దూకుడుగా బీఆర్ఎస్, సీఎం కేసీఆర్..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ముందుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్.. అదే దూకుడును కొనసాగించేందుకు సన్నద్ధమయ్యారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పాలమూరు–రంగారెడ్డి' ఎత్తిపోతల ప్రాజెక్టును ఈ నెల 16వ తేదీనే ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అదే రోజున భారీ బహిరంగ సభ నిర్వహించి.. తమ ప్రభుత్వం హామీలు నిలబెట్టుకుందంటూ ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేగాకుండా ఆ మరుసటి రోజు అంటే 17వ తేదీన దక్షిణ తెలంగాణ జిల్లాల్లో కృష్ణా జలాలతో దేవుళ్లకు అభిషేకాలు, సంబురాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

అప్పుడే ఆరోపణల వేడి మొదలు

మూడు ప్రధాన పక్షాల పోటాపోటీ కార్యక్రమాలతో అప్పుడే రాష్ట్రంలో ఆరోపణల వేడి మొదలైంది. పరేడ్‌గ్రౌండ్స్‌లో తాము బహిరంగ సభ నిర్వహిస్తామని ముందుగానే లేఖ ఇచ్చినా.. బీజేపీ కావాలనే అధికారిక ఉత్సవాల పేరుతో అక్కడ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమవడం ఏమిటంటూ కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. బీజేపీ దిగజారి రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తున్నారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా మారిపోయి సహకరిస్తోందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీ టీమ్‌గా మారిందంటూ బీజేపీ ప్రత్యారోపణలకు దిగింది. కేంద్రంపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ మద్దతునివ్వడం ఇందుకు నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఈ రెండు పార్టీల విమర్శలను తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ నాయకులు, మంత్రులు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఈ జాతీయ పార్టీలతో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదంటూ విమర్శలు చేస్తున్నారు.

ఒకే రోజు 9 కొత్త మెడికల్ కాలేజీలు

▶ మొదటి పేజీ తరువాయి

కొత్తవి కలిపి మొత్తం 26 కాలేజీలకు చేరాయన్నారు. 2014లో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కలిపి 850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే.. ఇప్పుడు ఏకంగా 3,915 సీట్లకు పెరిగాయని వివరించారు.

మహిళల ఆరోగ్యం కోసం..: రాష్ట్రంలో మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం కొత్తగా మరో వంద ఆరోగ్య మహిళ కేంద్రాలను ఈ నెల 12వ తేదీన ప్రారంభిస్తున్నట్టు మంత్రి హరీశ్ తెలిపారు. వీటితో కలిపి రాష్ట్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాల సంఖ్య 372కు చేరుతోందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2,78,317 మందికి స్క్రీనింగ్ నిర్వహించి, వివిధ సమస్యలున్న 13,673 మంది మహిళలను ఆస్పత్రులకు రిఫర్ చేశామని చెప్పారు. 5,204 స్టాఫ్ నర్స్ రిక్రూట్ మెంట్ ఫలితాలను త్వరగా విడుదల చేయాలని.. ఏఎన్ఎంల పీఆర్సీ, ఎరియర్స్ వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అతిథులొస్తున్నారు...

▶ మొదటి పేజీ తరువాయి

సైతం కేంద్ర సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌదరి రిసీవ్ చేసుకోనున్నారు. కిషిదా భారత్‌కు రావడం ఇది రెండోసారి. ఇటీవల మార్చి నెలలో భారత్‌లో రెండు రోజులపాటు పర్యటించి ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అమెరికా :: జో బైడెన్



అగ్రరాజ్యాధినేత జో బైడెన్ రాకపైనే అందరి కళ్లు. ఈయన సాయంత్రం 6 గంటల 55 నిమిషాలకు ఢిల్లీ చేరుకుంటారు. కేంద్ర సహాయ మంత్రి జనరల్(రిటైర్డ్) వీకే సింగ్ బైడెన్‌కు సాదర ఆహ్వానం పలుకుతారు. బైడెన్ సతీమణి జిల్‌కు కరోనా పాజిటివ్ రావడంతో బైడెన్ జీ20 సదస్సుకు వస్తారో రారో అనే సందిగ్ధత నెలకొంది. బైడెన్‌కు చేసిన కరోనా టెస్ట్‌లో నెగటివ్ ఫలితం రావడంతో ఆయన పర్యటన ఖాయమైంది. అయినా సరే సదస్సు సందర్భంగా ఆయన మాస్క్ ధరించే పాల్గొంటారని అధికార వర్గాలు వెల్లడించాయి.

కెనడా :: జస్టిన్ ట్రూడో



అమెరికా తర్వాత ఆ దేశానికి ఉత్తరవైపు పొరుగు దేశం కెనడా తరపున ఆ దేశ ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో భారత్‌లో అడుగుపెడతారు. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న విమానం పాలెం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ జస్టిన్‌కు సాదర స్వాగతం పలుకుతారు. ఖలిస్తాన్ వేర్పాటువాదులకు చిరునామాగా నిలిచిన కెనడాలో ఇటీవల వేర్పాటువాద సంస్థలు రెచ్చిపోయాయి. భారత వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ కెనడా–భారత్ సత్సంబంధాలను క్షీణింపజేశాయి. ప్రతిపాదిత వాణిజ్య ఒడంబడికను కెనడా అర్ధంతరంగా ఆపేసింది. ఈ తరుణంలో జీ20 వేదికగా కెనడా అగ్రనేత భారత్‌లో పర్యటించడం ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

చైనా :: లీ కియాంగ్



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వాస్తవానికి ఈ సదస్సులో పాల్గొనాలి. కానీ ఈసారి ఆయన బదులు చైనా ప్రధాని లీ కియాంగ్ వస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల 45 నిమిషాల ప్రాంతంలో ఆయన ఢిల్లీకి చేరుకుంటారు. 'జిన్‌పింగ్ గైర్హాజరు ఊహించిందే. ఇది జీ20 కూటమి పరస్పర ఉమ్మడి నిర్ణయాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదు'అని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కుండబద్దలు కొట్టారు. మరోవైపు అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను తమవిగా పేర్కొంటూ తమ కొత్త భౌగోళిక పటాన్ని చైనా విడుదల చేయడంతో డ్రాగన్ మీద భారత్ ఆగ్రహంగా ఉంది.

జర్మనీ, ఫ్రాన్స్‌ల నేతలూ..

యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ రాత్రి ఏడున్నరకు ఢిల్లీలో దిగుతారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్ సైతం జీ20 సదస్సుకు వస్తున్నారు. సింగపూర్ ప్రధాని లూంగ్ లీని కేంద్ర సహాయ మంత్రి మురుగన్ రిసీవ్ చేసుకుంటారు. జర్మనీ చాన్స్‌లర్ స్కోల్జ్ శనివారం సాయంత్రం ఆరు గంటలకు వస్తున్నారు. ఈయనను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ రిసీవ్ చేసుకోనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ శనివారం మధ్యాహ్నం 12.35 నిమిషాలకు వస్తారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మహిళా మంత్రి అనుప్రియా సింగ్ పాటిల్ మేక్రాన్‌కు స్వాగతం పలుకుతారు.

క్యూ కట్టనున్న నేతలు

సౌదీ అరేబియా ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఢిల్లీకి చేరుకుంటారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు సుక్ ఇయోల్ యూన్ సాయంత్రం 5.10కి వస్తున్నారు. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో చేరుకుంటారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడొడొ రాత్రి సమయంలో రానున్నారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పది గంటలకు చేరుకుంటారు. స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో పెరెజ్ రాత్రి 10.15కు చేరుకుంటారు. – సాక్షి, నేషనల్ డెస్క్

'జీ20 సదస్సు'కు సిద్దిపేట గొల్లభామ చీరలు

సిద్దిపేట జోన్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సిద్దిపేట గొల్లభామ చీరలను ప్రదర్శించే అవకాశం దక్కింది. వివిధ దేశాల ప్రధానులు, అధ్యక్షులు, ఇతర ముఖ్య ప్రతినిధులు హాజరుకానున్న సదస్సు వేదిక వద్ద పలు స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. అందులో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సిద్దిపేట గొల్లభామ చీరలను కూడా ప్రత్యేక స్టాల్‌లో ప్రదర్శించనున్నారు. దీంతో సిద్దిపేట నేతన్నల నైపుణ్యం ప్రపంచానికి తెలియనుందని స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇలా రూపుదిద్దుకుంది..: కళాత్మకత ఉట్టిపడే గొల్లభామ చీరల ప్రస్థానం 70 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. సిద్దిపేటకు చెందిన చేనేత కార్మికులు వీరబత్తిని సోమయ్య, రచ్చ నర్సయ్య.. ఒకరోజు తమ ఇంటి ముందునుంచి తలమీద పాలకుండ, చేతిలో పెరుగు గురిగి పట్టుకొని నడిచివెళుతున్న ఓ మహిళ నీడను చూసి.. వారిలో 'గొల్లభామ'చీరల ఆలోచన పురుడు పోసుకుంది. ఆ దృశ్యాన్ని నేత పని ద్వారా చీరల మీద చిత్రించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆలోచనలకు పదును పెట్టి గొల్లభామ చీరలను నేసేందుకు ప్రత్యేకమైన సాంచాను తయారు చేసుకున్నారు. అలా ఆవిష్కృతమైన అద్భుతమే.. 'గొల్లభామ చీర'గా ప్రశస్తి పొందింది. పట్టు, కాటన్.. రెండు రకాల్లోనూ ఈ చీరలను నేస్తారు. చీర అంచుల్లో వయ్యారంగా నడిచే గొల్లభామ చిత్రం వచ్చేలా నేయడమే వీటి ప్రత్యేకత.



పెద్ద గొల్లభామ బొమ్మకు దాదాపు 400 దారపు పోగులు అవసరమైతే, చిన్న బొమ్మకు 30 నుంచి 40 పోగులు అవసరం అవుతాయి. ప్రస్తుతం ఇరవై రంగుల్లో గొల్లభామ చీరలను రూపొందిస్తున్నారు. ఒకప్పుడు గొల్లభామ చీర తయారీకి వారం నుంచి 10 రోజులు పట్టేది. ఇప్పుడు జాకార్డు మగ్గం వల్ల మూడు, నాలుగు రోజుల్లో గొల్లభామ చీర తయారు చేస్తున్నారు. మిగతా చీరలతో పోలిస్తే ఈ చీరలను నేయడం కష్టంతో కూడుకున్న పనిగా చెపుతారు. 2012లో ఈ చీరలకు జాగ్రఫికల్ ఇండికేషన్ ట్యాగ్ లభించింది.

నేనే నంబర్ వన్

▶ మొదటి పేజీ తరువాయి

వీసీగా మహమూద్‌ను ప్రభుత్వం నియమించింది. తనను వీసీ–1గా చైర్మన్ చెప్పారని, అప్పట్నుంచీ వీసీ–1గానే ఫైళ్లపై సంతకాలు చేస్తున్నానని మహమూద్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటరమణను వీసీ–1గా మారుస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ జూలై 24న ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వెలుగులోకి వచ్చిన తర్వాత ఇద్దరు వీసీల మధ్య వివాదం మొదలైంది. వీసీ–1గా 60 ఫైళ్లపై తాను సంతకాలు చేశానని, మండలి చైర్మన్‌ను సంప్రదించకుండానే వెంకటరమణను వీసీ–1గా నియమించడం అన్యాయమంటూ మహమూద్ అభ్యంతరం లేవనెత్తారు.

'దోస్త్'అజమాయిషీ అంతా వీసీ–1దే

నిబంధనల ప్రకారం వీసీ–1గా ఉండేవాళ్లే దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలు) కన్వీనర్‌గా కొనసాగుతారు. అయితే ప్రొఫెసర్ వెంకటరమణ బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా కూడా కొనసాగుతు న్నారు. ఈ పని ఒత్తిడి వల్ల కీలకమైన దోస్త్ బాధ్యతలను ఎవరికీ అప్పగించకుండా ఇప్పటివరకూ లింబాద్రే చూస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలపై దోస్త్ కన్వీనర్‌కు పూర్తి ఆజమాయిషీ ఉంటుంది. కాలేజీలకు అనుమతి మొదలు కొని, సీట్ల పెంపు, తగ్గింపు తదితర వ్యవహారాలు ఆయనే చూస్తారు. అందువల్లే వీసీ–1 పోస్టుకు పోటీ నెలకొంది.

ఇందులో వివాదానికి తావేలేదు: వాకాటి కరుణ



వీసీ–1గా వెంకటరమణను నియమించే విషయంలో మండలి చైర్మన్‌తో సంప్రదించా. ఇది ఇప్పుడు ఎందుకు వివాదమైందో తెలియడం లేదు. అన్నీ చర్చించాకే నిర్ణయం తీసుకున్నాం. ఇందులో ఎలాంటి వివాదానికి తావు లేదు.

మండలి ప్రతిష్టను కాపాడాలి: ప్రొఫెసర్ లింబాద్రి



ఎవరికి ఏ అభిప్రాయం ఉన్నా అందరూ కలిసి పనిచేయాల్సిందే. మండలి ప్రతిష్ట ముఖ్యం. ఇద్దరు వీసీలను కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. వెంకటరమణ సీనియర్ కాబట్టి వీసీ–1 ఇచ్చి ఉండొచ్చు. మహమూద్ నియామకంలో వీసీ–1 లేదా వీసీ–2 అనేది లేదు.

చైర్మన్‌దే నియామక అధికారం?

వాస్తవానికి ఇద్దరు వీసీలున్నప్పుడు ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది మండలి చైర్మన్ నిర్ణయించాల్సి ఉంటుంది. కాగా మహమూద్‌ను వీసీగా నియమించినా ఆయన వీసీ వన్నా, వీసీ టూనా అనేది నియామక పత్రంలో చెప్పలేదని, ఇదే సమస్యకు కారణమైందని చెబుతున్నారు. ఒకవేళ వీసీ–1గా వెంకటరమణకు బాధ్యతలు ఇచ్చేముందు కార్యదర్శి దీనిపై చర్చించినా సమస్య తలెత్తేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఈ విషయంపై స్పందించేందుకు వీసీ వెంకటరమణ నిరాకరించారు.

నాకు వీసీ–1 అని చెప్పారు : ప్రొఫెసర్ మహమూద్

నేను బాధ్యతలు తీసుకున్నప్పుడే వీసీ–1 అని మండలి చైర్మన్ తెలిపారు. ఈ హోదాలోనే 60 ఫైళ్లపై సంతకాలు చేశా. హోదా మార్చేటప్పుడు చైర్మన్ అనుమతి తీసుకోవాలి. విద్యామంత్రికి చెప్పాలి. గవర్నర్‌కు తెలియజేయాలి. ఇవేవీ లేకుండా విద్యాశాఖ కార్యదర్శి ఎవరో చెప్పిన మాట విని హోదా మార్చారు.

అపార్ట్‌మెంట్‌లోకి కొండచిలువ



నిజాంపేట్: ఓ అపార్ట్‌మెంట్‌లోకి కొండ చిలువ ప్రవేశించడంతో స్థానికంగా కలకలం రేపింది. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సాయి ఎలైట్ అపార్ట్‌లోని పార్కింగ్ ప్రదేశంలోకి కొండ చిలువ ప్రవేశించడంతో అపార్ట్‌మెంట్ వాసులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఫ్రెండ్స్ స్నేక్ సొసైటీ సభ్యుడు అంకిత్ శర్మకు ఫోన్ చేయడంతో వెంటనే అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నాడు. తన వెంట తెచ్చిన బ్యాగ్‌లో కొండ చిలువను తీసుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద నీటితో కొండ చిలువ కొట్టుకుని వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

పాప్‌కార్న్ యంత్రంలో బంగారం పట్టివేత



శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తరలించేందుకు తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా అందులో ఉన్న పాపకార్న్ యంత్రం బయటపడింది. దాన్ని విప్పి చూడగా అందులోనే ఓ భాగాన్ని పరిశీలించి బంగారంగా గుర్తించారు. 206 గ్రాములున్న బంగారం విలువ 12.57 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లితండ్రుల్లో ఏ ఒక్కరు గానీ, లేదా వారిరువురు గానీ, ముసలి వారైతే... వారితో విసుక్కుంటూ: 'ఛీ! (ఉఫ్)' అని కూడా అనకు. వారిని గద్దించకు. వారితో మర్యాదగా మాట్లాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 8 సెప్టెంబర్ 2023

పార్లమెంట్ 'ప్రత్యేక' రహస్యం

ప్రత్యేకం అంటేనే సాధారణమైన దానికి భిన్నమైనది, వేరైనది అని నిఘంటువుల అర్థం. మాటలోనే ఉన్నట్టుగా ఈ నెల 18 నుంచి 22 దాకా జరగనున్న పార్లమెంట్ ఉభయసభల ప్రత్యేక సమావేశాలు అనేక రకాలుగా ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ముగిసి, 3 వారాలైన కాక ముందే ప్రభుత్వం మళ్ళీ ప్రత్యేక భేటీ ప్రకటన చేయడం ఒక ప్రత్యేకతైతే... హఠాత్తుగా ఈ భేటీ ఎందుకు జరుపుతున్నదీ అజెండా చెప్పకపోవడం మరో ప్రత్యేకత. ఉమ్మడి పౌరస్మృతి, 'ఒకే దేశం – ఒకేసారి ఎన్నికల' చట్టం, దేశం పేరును 'ఇండియా' నుంచి 'భారత్'గా మార్చడం, మహిళా రిజర్వేషన్లు... ఇలా పలు ఊహాగానాలు వినిపిస్తున్నా పాలకపక్షం నోరు మెదపక ప్రతిపక్షాలను ఊహల్లో, అనుమానాల్లో పెట్టడం మరింత ప్రత్యేకత. ఇది అన్యాయమని విపక్షాలు ఆక్రోశిస్తున్నాయి. ఆగస్ట్ 31నే ప్రత్యేక భేటీ ప్రకటన చేసిన ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నేత తాజాగా లేఖ రాసినా, రాజకీయాలు చేస్తున్నారంటోంది. వెరసి ప్రత్యేక భేటీ దేనికనే ఉత్కంఠ పెరుగుతోంది.

గతంలో 2019 ఆగస్ట్‌లో వర్షాకాల సమావేశాల్లో అజెండాలో లేకుండానే హఠాత్తుగా ఆర్టికల్ 370 రద్దును సభలో తెర మీదకు తెచ్చి, ప్రతిపక్షాల చేష్టలుడిగేలా చేసిన చరిత మోదీ సర్కార్‌ది. మరి ఈ సారి ఎలాంటి రాజకీయ గుగ్లీ విసిరి, వచ్చే 2024 ఎన్నికలకు కొత్త కథనంతో ముందుకు వస్తారన్నది ఆసక్తి రేపుతోంది. సహజంగానే విపక్షాల్లో ఆందోళన పెంచుతోంది. ప్రత్యేక సమావేశాలనే మాటే రాజ్యాంగ నిబంధనల్లో లేదు గనక, వాటి అజెండా ఏమిటన్నది ముందుగా చెప్పాలన్న రూలూ కనిపించదు. కానీ, గతంలో పార్లమెంట్ ప్రత్యేక భేటీని ప్రకటించినప్పుడల్లా ఆ రోజునే సమావేశాల అజెండానూ ప్రకటించడం ప్రభుత్వాలు పాటిస్తూ వస్తున్న సంప్రదాయం. ఇప్పుడు దాన్ని కూడా పాలకపక్షం తుంగలో తొక్కుతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇలా జరగడం ఇదే తొలిసారని రాజ్యాంగ నిపుణులూ నిర్ధారించారు. అయితే, సమస్త పార్లమెంటరీ సంప్రదాయా లకూ తిలోదకాలిస్తున్న పాలకులు గద్దె మీదకు వస్తున్న కాలంలో విచారపడి ఉపయోగం లేదు.

ప్రత్యేక సమావేశాల్ని నిర్వహించే అధికారం ప్రభుత్వానికి లేదని ఎవరూ అనలేరు, అనరు. కానీ, ప్రజాస్వామ్య దేశంలో అందుకు అనుసరిస్తున్న విధానం మీదే రచ్చ. నిజానికి, నిర్ణీత తేదీల్లోనే పార్లమెంట్ సమావేశం కావాలంటూ మన దేశంలో కచ్చితమైన పార్లమెంటరీ క్యాలెండరంటూ ఏమీ లేదు. ఏటా 12 నెలల వ్యవధిలో కనీసం రెండుసార్లు పార్లమెంట్ భేటీ కావాలి. జనవరి చివర్నించి మే వరకు బడ్జెట్ సమావేశాలు, జూలై నుంచి ఆగస్ట్ దాకా వర్షాకాల భేటీ, నవంబర్ – డిసెంబర్లలో శీతకాల సమావేశాలంటూ ఏటా 3 సమావేశాలన్నది చిరకాల సంప్రదాయం. అయితే, తొలి రెండు దశాబ్దాల పార్లమెంట్ చరిత్రలో లోక్‌సభ ఏటా సగటున 120 రోజుల పైచిలుకు సమావేశమైతే, గత దశాబ్ద కాలంలో అది 70 రోజులకు పడిపోవడం విషాదం. సాధారణ సమావేశాల సంగతే అలా ఉంటే, అసాధారణ భేటీతో ఒరిగేదేంటో చెప్పలేం. ప్రశ్నోత్తరాల సమయం, ప్రైవేట్ సభ్యుల చర్చ లాంటివి లేని ఈ భేటీ మే 28న మోదీ ప్రారంభించిన కొత్త పార్లమెంట్ భవనంలో జరగనుందట.

చారిత్రక సంఘటనలు, మైలురాళ్ళ జ్ఞాపకార్థం భారత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడూ, ఆ తర్వాత క్విట్ ఇండియా ఉద్యమ స్వర్ణోత్సవం (1992), భారత స్వాతంత్ర్య రజతోత్సవం (1972), స్వర్ణోత్సవం (1997) వేళ అర్ధ రాత్రి భేటీలు జరిగాయి. ఒక చట్టం చేయడానికంటూ ప్రత్యేక సమావేశం జరిగింది మాత్రం 2017 లోనే! అదీ మోదీ హయాంలోనే! నాటి సర్కార్ ఉభయ సభల అర్ధరాత్రి భేటీలో జీఎస్టీ తెచ్చింది. మళ్ళీ ఇప్పుడు అజెండా వెల్లడించకుండా బుల్‌డోజర్ ధోరణిలో పార్లమెంట్ ప్రత్యేక భేటీ జరపాలనుకోవడమే రచ్చకు దారి తీస్తోంది. అజెండాను ప్రతిపక్షాలకు చెప్పడం ప్రోటోకాలన్నది పక్కన పెడితే, చివరకు అధికారపక్ష నేతలకూ అజెండా అస్పష్టం, దేవరహస్యంగానే మిగలడం విడ్డూరం.

ప్రజాస్వామ్యంలో పాలకులు సర్వంసహా చక్రవర్తులు కాదని గుర్తించాలి. అలా ప్రవర్తించడాన్ని ప్రజలూ హర్షించరని గ్రహించాలి. అదే సమయంలో 'వీటిపై చర్చించండి' అంటూ నిన్న గాక మొన్న వర్షాకాల సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలపైనే లేఖలో రాయడమూ కాంగ్రెస్ తదితర విపక్షాల మేధాశూన్యతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఎలాంటి అంశాన్ని తెరపైకి తెచ్చినా, దాన్ని సమర్థంగా చర్చించగల సన్నద్ధత లేకుంటే అది ప్రతిపక్షాల అసమర్థతే. మొన్నటి అవిశ్వాస తీర్మానంపై చర్చలోనూ విపక్షాల్లో ఆ బలహీనత బయటపడిందన్నది నిష్ఠురసత్యం. అయితే, శాసన నిర్మాణంలో అధికార, విపక్షాలు సమన్వయంతో సాగితేనే ప్రజాస్వామ్య రథం సజావుగా సాగుతుంది. ఒకరిపై మరొకరు అపనమ్మకంతో, అన్నిటికీ అనుమానంతో ఉంటే అది ఎన్నటికీ ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ఆ వాస్తవాన్ని ఇరుపక్షాలూ గౌరవించాలి.

ఇప్పటికే ప్రస్తుత 17వ లోక్‌సభ చరిత్రలో మునుపెన్నడూ లేనట్టు అతి తక్కువ రోజులు సమావేశమై, అధిక భాగం వాయిదాలకే పరిమితమైన అపకీర్తిని మూటగట్టుకుంది. ఈ ప్రత్యేక సమావేశాలు అయినా అందుకు మినహాయింపు కావాలని ఆశిద్దాం. అత్యాశ అనుకున్నా అది అభిలషణీయమే. అదే జరిగితే ఇవి అక్షరాలా 'ప్రత్యేక సమావేశాలు'గా గుర్తుండిపోతాయి. అయితే అందుకు రహస్య అజెండాలు, దాపరికాలు మాత్రం ఉపకరించవు. ఈ లోక్‌సభకు ఇవే ఆఖరి సమావేశాలు కావచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ... కనీసం ఇప్పుడైనా అధికార, విపక్షాల్లో ఉన్న పార్టీలు ఆపాటి హుందాతనం చూపుతాయా అన్నది ప్రధానమైన పశ్న.

కొత్త విశ్వ వ్యవస్థకు ఆశాదీపం

సందర్భం



ధర్మేంద్ర ప్రధాన్

భారతదేశం సహజంగానే తన డీఎన్ఏలో ప్రతిభా భాండాగారాన్ని కలిగి ఉంది. ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుల అద్భుతమైన కృషి ఆధునిక పరిశోధనలను కూడా ప్రభావితం చేస్తోంది. ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. భారతదేశ పురోగమనం, ఎదుగుదల కేవలం దాని సొంత ప్రజల కోసమే కాకుండా, మనం 'ప్రపంచ కల్యాణం' అని దేన్నయితే పిలుస్తామో అటువంటి ప్రయోజనాల కోసం కూడా ఉపయోగపడాలి. భారతదేశ అధ్యక్షతన జి–20 ఇతివృత్తం అయిన 'ఒక భూమి – ఒక కుటుంబం – ఒక భవిష్యత్తు', మన ప్రాచీన విలువ 'వసుధైవ కుటుంబం'తో ముడిపడి ఉంది.

జ్ఞాన నాగరికతగా, భారతదేశం సహజంగానే తన డీఎన్ఏలో ప్రతిభ భాండాగారాన్ని కలిగి ఉంది. భారతదేశ చరిత్ర చూస్తే– గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యం, తత్వశాస్త్రం, సాహిత్యంతో సహా వివిధ విజ్ఞాన రంగాల్లో గణనీయమైన కృషి చేసిన ప్రస్థానమే గోచరిస్తుంది. ప్రాచీన భారతీయ గణిత శాస్త్రజ్ఞుల సంఖ్యా సిద్ధాంతం, గణిత విశ్లేషణలో అద్భుతమైన కృషి ఆధునిక పరిశోధనలను కూడా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. జ్ఞాన నాగరికతగా భారతదేశ చరిత్ర దాని సమకాలీన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. ఇది ప్రపంచ శ్రేయస్సుకు గణనీయమైన సహకారిగా నిలిచింది.

విశ్వ శ్రేయస్సుకు జి–20


జి–20 అధ్యక్షతలో భారతదేశం మొత్తం వర్కింగ్ గ్రూపులు లేదా మంత్రుల సమావేశాలలో జరిగిన అన్ని చర్చలను కూడా గొప్ప ప్రపంచ శ్రేయస్సు అనే బంధంతో అనుసంధానం చేసింది. ''ఒక భూమి – ఒక కుటుంబం – ఒక భవిష్యత్తు'' అనే జి–20 ఇతివృత్తం, మన ప్రాచీన విలువలైన 'వసుధైవ కుటుంబం'తో ముడిపడి ఉంది. భారతదేశ పురోగమనం, ఎదుగుదల కేవలం దాని సొంత ప్రజల కోసమే కాకుండా, మనం 'ప్రపంచ కల్యాణం' అని దేన్నయితే పిలుస్తామో అటువంటి ప్రపంచ ప్రయోజనాల కోసం కూడా ఉపయోగపడాలి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, దాని సహజసిద్ధమైన బలం, సామర్థ్యాలను ప్రపంచం స్పష్టంగా విశ్లేషించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశాన్ని 'ప్రకాశవంతమైన ప్రదేశం'గా గుర్తించింది. భారతదేశ స్థూల ఆర్థిక మూలాధారాలు చాలా బలంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పవనాలు ఎదురవుతున్నప్పటికీ , భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అతి తక్కువ సమయంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం సుస్పష్టంగా కనిపిస్తోంది.

ఆదర్శాలతో కూడిన విద్య

విజ్ఞానం, నైపుణ్యం ద్వారా మానవ మూలధనాన్ని పెంచడం అనేది భారతదేశ సామర్థ్యానికి కీలకం. విద్య అనేది వృద్ధి, ప్రేరణలను నడిపించే, నిలబెట్టే 'మదర్–షిప్'(కేంద్రం). విద్య అనేది పౌరులను శక్తిమంతం చేసే మాతృశక్తి. దానికి అనుగుణంగా రూపొందించిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) అన్నింటికీ మూల పత్రం. సమగ్ర జాతీయ విద్యా విధానం–2020, భారత్‌లో విద్యను సమగ్రంగా, భవిష్యత్తు మార్గదర్శకంగా, ప్రగతి శీలంగా ఒక ముందు చూపు ఉండేలా సంపూర్ణంగా రూపొందించడం జరిగింది.

బలమైన విషయ అవగాహన, స్పష్టతను నిర్ధారించడం కోసం



మాతృభాషలో నేర్చుకోవడానికి నూతన విద్యా విధానంలో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అయితే మాతృభాషలో విద్య అనుసంధాన భాషలను భర్తీ చేయదు, కానీ వాటికి అనుబంధంగా ఉంటుంది. ఇది జ్ఞానపరంగా తక్కువ సమస్యలను అధిగమించే విద్యార్థులతోపాటు సజావుగా చదువుకొనే విద్యార్థులకు కూడా చక్కటి విద్యా మార్గాలను అందిస్తుంది.

ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎన్ఈపీ–2020, భారతదేశాన్ని అత్యుత్తమ అధ్యయన గమ్యస్థానంగా మార్చడానికిగానూ, అధ్యాపకులు/ విద్యార్థుల మార్పిడి, పరిశోధన, బోధనా భాగస్వామ్యాలు, విదేశాలతో పరస్పర ప్రయోజనకరమైన ఎంఓయూలపై సంతకాలు చేయడానికి వీలు కల్పిస్తుంది. ఐఐటీ– మద్రాస్, ఐఐటీ– ఢిల్లీ ఇప్పటికే తమ విదేశీ క్యాంపస్‌లను వరుసగా జాంజిబార్–టాంజానియా, అబుదాబి–యూఏఈలలో ఏర్పాటు చేయడానికి అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

విదేశాలతో విద్యా భాగస్వామ్యం

పరిశోధనను ప్రోత్సహించడానికి పరిశ్రమ–అకాడెమియా సహకారం అనేది ఎన్ఈపీలో చేర్చిన మరొక ప్రాధాన్యత అంశం. అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో తొలి అడుగు నుండి పరిశోధనల వరకు సులభతరం చేయడానికి నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు అవుతోంది. భారతదేశాన్ని పరిశోధన–అభివృద్ధి హబ్‌గా మార్చడంపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. సులభతర వ్యాపారం మాత్రమే కాకుండా సులభతర పరిశోధన కూడా ఉండేలా ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

అంతేకాకుండా, ప్రధాన దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, ఇంకా యూరప్ దేశాలతో భారతదేశం విద్యా భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. ఇక్కడ భారతదేశ ప్రతిభను గుర్తించి, దృష్టిలో ఉంచుకుంటారు. ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ (ఐసెట్), క్వాడ్ ఫెలోషిప్ కింద హై–టెక్నాలజీ రంగాలలో మెరుగైన సహకారాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది. భారతీయ విద్యను ప్రపంచ విద్యతో సమలేఖనం చేయడంలో ప్రామాణీకరణ సహాయపడుతుంది. జాతీయ విద్యా విదానం కింద, పాఠశాల విద్య కోసం నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ విడుదల చేయడమైనది. ఇది నిర్దిష్ట అభ్యాస ప్రమాణాలు, కంటెంట్, బోధనాశాస్త్రం, మూల్యాంకనాలకు ప్రమాణాలను ఏర్పరుస్తుంది. అదేవిధంగా, విభిన్న విద్యావేత్తల అభ్యాసాన్ని అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ పరిధిలోకి తీసుకు రావడానికి నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ పనిచేస్తుంది.

గొప్ప శ్రామిక శక్తి

భారతదేశంలో ఇప్పుడు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల 60 కోట్ల జనాభా ఉంది. 65 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు గలవారు. బహుళ–క్రమశిక్షణ, బహుళ–నైపుణ్యం కలిగిన, విమర్శనాత్మకంగా ఆలోచించే, యువకులు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం.

భారతదేశం ఇప్పుడు మూడవ అతిపెద్ద స్టార్ట్–అప్ పర్యావరణ వ్యవస్థ. 100 కంటే ఎక్కువ యునికార్న్‌లతో నైపుణ్యం, వ్యవస్థాపకతకు ప్రతీకగా నిలిచింది. మెట్రో నగరాల్లో మాత్రమే కాదు, భారతదేశ ఆవిష్కరణలు, స్టార్టప్‌లు టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల ద్వారా కూడా ఆవిష్కారం అవుతున్నాయి.

6వ తరగతి నుండి పాఠశాల విద్యలో నైపుణ్యం ఏకీకృతం అయింది. సాంకేతికతతో నడిచే పారిశ్రామిక వాతావరణంలో నిలదొక్కుకోవడానికిగానూ పాఠశాల స్థాయి నుండే నైపుణ్యం కలిగిన మానవ శక్తిని రూపొందించడానికి సింగపూర్ స్కిల్ ఫ్రేమ్‌వర్క్ అనుసరించదగినది.

అభివృద్ధి చెందుతున్న కొత్త క్రమంలో మానవ మూలవనరుల ప్రధాన పాత్రను భారతదేశం గుర్తించింది. విద్య, నైపుణ్యంతో కూడిన వ్యక్తులు నేటి జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తారు. వారు మాత్రమే విజ్ఞాన సరిహద్దును విస్తరించడం, ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతో పాటు, అద్భుతమైన ఆవిష్కరణలు అందించగలరు; శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా దేశ నిర్మాణానికి అసాధారణమైన సహకారాన్ని అందించగలరు.

ప్రపంచ ప్రయోజనాల కోసం ఇప్పుడు భారత దేశం ఒక పెద్ద ప్రయోగశాల. జ్ఞాన శతాబ్దం అయిన 21వ శతాబ్దంలో కొత్త సాంకేతికతలు కొత్త క్రమానికి నాంది పలుకుతాయి. భారతదేశం తన విస్తారమైన నైపుణ్య గనిని ఏర్పరచడంలో, కొత్త క్రమాన్ని రూపొందించడంలో ముందంజలో ఉంది.

వ్యాసకర్త కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి – వ్యవస్థాపకత మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీకేం తెలుసు?



మణిపూర్‌లోని అంతర్గత అంశాలన్నీ ఎరిగినట్టుగా మాట్లాడకుండా, కేవలం అక్కడి తప్పుడు కథనాల మీద మాత్రమే 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' దృష్టి పెట్టవలసింది!

– ప్రదీప్ ఫన్‌జౌబామ్ మణిపూర్ సంపాదకుడు

ఎంత ఓర్పు!



ఈమె నా పేషెంట్ (ఫొటో షేర్ చేశారు). ఆమె, శ్రీకృష్ణుడి పట్ల ఆమె భక్తి నాకు గర్వం కలిగిస్తాయి. ఇంతకు ముందటి రికార్డును ఆమె మళ్లీ బద్దలుకొట్టింది. గోకులాష్టమి కోసం ఒక్క రోజులో 88 నైవేద్యాలు సిద్ధం చేసింది.

– పి. కామత్, కార్డియాలజిస్ట్

ఎంపిక ముఖ్యం



బాగా రాసినవి (గుడ్ రైటింగ్) చదవడం, మంచి సంగీతం వినడం... మన జీవితాలకు చాలా ముఖ్యమైనవి. ఇంకో రకంగా చెప్పాలంటే... చెడ్డ సంగీతం, చెడ్డ రాతలను పూర్తిగా విస్మరించడం మంచిది.

– హరూకీ మురకామి, రచయిత

హవ్వ!



జాతి వివక్ష, ముస్లింల మీద ద్వేషం చూపుతోందని స్వీడన్‌ను 57 ముస్లిం దేశాలు నిందిస్తున్నాయి. ఈ దేశాలే నాస్తికులను, మత విమర్శకులను, పాత్రికేయులను చంపుతాయి. ఇవే దేశాలు ముస్లింలు అక్కడి నుంచి పారిపోయేలా చేస్తాయి. ఈ దేశాల రాజ్యాంగం 7వ శతాబ్దం నాటిది. కానీ ప్రపంచంలోనే అత్యంత ప్రగతిశీల దేశమైన స్వీడన్ చట్టాలు మారాలంటాయి.

– ఉవాయి అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

అదే శిక్ష



పని చేయవనీ, రోగికి ప్రమాదం పెంచుతాయనీ తెలిసినా – ఉద్దేశపూర్వకంగా ఔషధాలు, చికిత్సలు, ఇంజెక్షన్లను వాడమని ఒత్తిడి చేసే వైద్యవృత్తిలోని వాళ్ల కోసం నరకంలో ప్రత్యేక స్థానాలు రిజర్వు చేసివుంటాయని నిజాయతీగా నమ్ముతాను.

– సునీల్ ధండ్, ఫిజీషియన్

లోటు పూరించిన విమర్శకుడు

'అద్దేపల్లి' అనే పేరు కేవలం కవిత్వానికో, సాహిత్య విమర్శకో చిరునామా మాత్రమే కాదు. వర్ధమాన కవుల పాలిట పచ్చని భుజం. నవ కవి లతలకు చేవైన ఆధారం. అప్పుడప్పుడే కలం పట్టిన రచయితలకు వెన్నుదన్ను.

కవిత్వమన్నా, కవులన్నా ఆయనకు ఎంత ప్రేమ! సాహిత్య బీజాలను దశదిశలా వెదజల్లాలని ఎంత తపన! వేల మంది ఉన్న మహాసభ అయినా... నలుగురు అంటే నలుగురే చేరిన ఓ చిన్నపాటి పిచ్చాపాటి మాటల కలబోతే కానీ... ఒకటే ధోరణి. కవిత్వం, విమర్శ, గజల్...

కవిత్వమే తానైనవాడూ తానే కవిత్వమైన వాడూ అద్దేపల్లి రామ్మోహన రావు మాస్టారు. తెలుగు కవిత్వం, విమర్శ, గజల్స్, పద్యాలు... ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలలో గొప్ప కృషి చేసిన వారు. 'నిత్య సాహిత్య సంచారి' అని ఆయన మిత్రులు అభిమానంగా పిలుచుకుంటారు. ఏటా ఆయన పేర ఇచ్చే పురస్కారాన్ని ఈ ఏడు ఆచార్య మేడిపల్లి రవి కుమార్ అందుకోనున్నారు.

ప్రకాశం జిల్లా అద్దంకిలో జన్మించిన రవికుమార్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో పనిచేసి గత ఏడాది పదవీ విరమణ చేశారు. వివిధ సాహిత్య విషయాల మీద అనేక వ్యాసాలు రాశారు. వందలాది ఉపన్యాసాలు ఇచ్చారు.



మేడిపల్లి రవికుమార్



అద్దేపల్లి రామ్మోహన రావు

మనం ఏం తినాలి, ఏం బట్ట కట్టాలి అని నిర్ణయించే స్థితికి మార్కెట్ చేరుకున్న ప్రస్తుత తరుణంలో వీరు రాసిన 'ప్రపంచీకరణ – కవిత్వం – ప్రజా జీవితం' అనే పరిశోధక వ్యాసం అమూల్యమైనదే కాక అత్యంత కీలకమైనది కూడా. భిన్న సందర్భాలలో విభిన్నమైన భావోద్వేగాలతో స్పందించి అనేకమంది కవులు రాసిన కవితలన్నింటినీ సేకరించి సునిశితంగా అధ్యయనం చేసి ప్రపంచీకరణ ప్రజా జీవితాలను ఎలా ప్రభావితం చేస్తూ శాసిస్తోందో సాకల్యంగా పట్టి చూపింది ఈ వ్యాసం.

'వచన కవిత్వంలో వర్తమాన రైతు' వ్యాసంలో ఎందరెందరో కవులు రాసిన కవితలను పరిశోధించి వాటిలోని అంతః సారాన్ని గుదిగుచ్చి వర్తమాన రైతుల స్థితిగతులనూ, ఆ స్థితిగతులు మార్చాలంటే వారు చేయాల్సిన పోరాటాన్నీ, వారి ముందున్న కర్తవ్యాన్నీ సూచించారు.

ప్రపంచీకరణ నేర్పుగా పన్నిన ఉచ్చులో చిక్కి బయట పడలేక విలవిలలాడుతున్న సంపద అసలైన సృష్టికర్త లయిన మట్టి మనుషులు, కష్టజీవుల వెతలను దృశ్యమానం చేసిన జాతశ్రీ 'కుట్ర' కథా సంకలనంపై చేసిన లోతైన విశ్లేషణ, దశాబ్దాల కాలంగా కవిత్వమే ఊపిరిగా జీవిస్తున్న 'అడిగోపుల వెంకటరత్నం' కవితా సంకలనం 'ముందడుగు'కు రాసిన ముందు మాట, తొలి దళిత కవి 'కుసుమ ధర్మన్న' సంస్మరణగా వారి కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాసిన 'దొరతనాలపై ధర్మన్న ఆగ్రహం', వడ్డెర చండీదాస్ 'అనుక్షణికం'పై రాసిన విమర్శనాత్మక పరామర్శ... ఇలా వారి ఏ రచన పరిశీలించినా సుస్పష్టంగా తేలేది ఒక్కటే. వీరు ఎప్పుడూ ప్రజా పక్షం. ప్రజా పీడకులకు ప్రతిపక్షం.

వర్తమాన సామాజిక జీవితాన్ని మానవీయత అనే కొలబద్దతో అంచనా వేసి లోతుగా పరిశీలించి అనుసరించదగ్గ తత్వాన్ని వినిపించే మొహమాటం లేని విమర్శకులు ఇప్పుడు కావాలి. అటువంటివారు అరుదు. విశ్వ మానవ కల్యాణం అనే తూనిక రాళ్ళతో సాహిత్యాన్నీ, కళలనూ, జరుగుతున్న పోరాటాలనూ తూయగలిగిన సద్విమర్శకులైన మేడిపల్లి రవికుమార్ ఆ లోటును, కొరతను పూరించగలరు. వారికి అద్దేపల్లి రామమోహనరావు పేరిట నెలకొల్పిన అవార్డు రావడం ముదావహం.

– రత్నాజియ్, పెద్దాపురం

(రేపు కాకినాడలో అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శ పురస్కార ప్రదానం)

ఆత్మహత్యలను ఆపలేమా?

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రపంచంలో జరిగే మొత్తం ఆత్మహత్యలలో 20 శాతం మన దేశంలోనే జరుగుతున్నాయి. ప్రతి ఏటా సుమారు 2 లక్షల మంది మన దేశంలో ఆత్మహత్యలతో మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 10 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒకప్పుడు మన దేశంలో మధ్య వయస్కులు, వృద్ధులు ఆత్మహత్యలు చేసుకొంటే, ఇటీవలి కాలంలో యువత, విద్యార్థులు ఈ దారుణానికి పాల్పడుతున్నారు.

కారణాల విషయానికి వస్తే, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మనస్పర్థలు, బలహీన పడుతున్న కుటుంబ బంధాలు మూడింట ఒక వంతు కారణమైతే, డిప్రెషన్, మద్యానికి బానిస కావడం, స్కిజోఫ్రీనియా, దూకుడు, ఆవేశ మనస్తత్వాలు, కేన్సర్, ఎయిడ్స్ లాంటి శారీరక, మానసిక సమస్యలు కూడా ఆత్మహత్యలకు కారణ భూత మవుతున్నాయి. స్త్రీల కంటే పురుషులే అధికంగా (4:1) ఆత్మహత్యలతో మరణిస్తుంటే, ఆత్మహత్యా ప్రయత్నాలు చేయడంలో మాత్రం స్త్రీలదే పైచేయిగా ఉంది. ఎక్కువ ఆత్మహత్యలు ఉదయం 5 గంటల నుండి 10 గంటల మధ్యే ఎక్కువగా జరగడానికి ముఖ్య కారణం మన శరీరంలో 'కార్టిసాల్' అనే స్ట్రెస్ హార్మోన్ ఆ సమయంలో అధికంగా ఉత్పత్తి కావడమే! వారసత్వంగా జీన్స్ ప్రభావం వల్ల కూడా కొన్ని కుటుంబాల్లో పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం శాస్త్రీయంగా కూడా రుజువైంది.



కోవిడ్ సమయంలో మునుపటి కంటే 10 శాతం ఆత్మహత్యలు పెరిగాయి. అయితే ఇదే సమయంలో పరీక్షలు లేకపోవడం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు 25 శాతం తగ్గిపోవడమనేది ఆలోచించదగ్గ విషయం!

మూడీగా, డల్‌గా, దిగులుగా ఉండటం; కన్నీళ్ళు పెట్టుకోవడం, తిండి, నిద్ర లేకపోవడం, డైరీలో సూసైడ్ నోట్ రాయడం, అప్పగింతలు పెట్టడం, వేదాంత ధోరణితో మాట్లాడటం, విషాద గీతాలు ఎక్కువగా వినడం, వీలునామా రాయడం, మద్యం, మత్తు మందులు అధికంగా తీసుకోవడం వంటి లక్షణాలు ఆత్మహత్య ఆలోచనను మనకు పట్టిస్తాయి.

నివారణ చర్యలకొస్తే, ప్రాణాంతకమైన పురుగు మందులను నిషేధించడం, మద్యాన్ని సాధ్యమైనంత తక్కువ అందుబాటులో ఉండేలా చూడటం కాకుండా 20 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయాలు నిషేధించడం, హాస్టళ్లలో సీలింగ్ ఫ్యాన్ల బదులు, గోడ ఫ్యాన్లు వాడటం వల్ల కూడా ఆత్మహత్యలను చాలా వరకు నియంత్రించవచ్చు. అలాగే పేదలకు నగదు బదిలీ చేయడం ద్వారానూ ఆత్మహత్యలను నివారించవచ్చు. బ్రెజిల్‌లో 60 శాతం, ఇండోనేషియాలో 20 శాతం ఆత్మహత్యలు ఈ నగదు బదిలీ వల్ల తగ్గుముఖం పట్టినట్లు నిర్ధారణ అయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇటీవల ఆత్మహత్యల శాతం తగ్గడానికి ఒక ముఖ్య కారణం 'నగదు బదిలీ' పథకాలేనని కూడా చెప్పవచ్చు.

మనదేశంలో మొట్టమొదటిసారిగా తమిళనాడు ప్రభుత్వం 18 ఏళ్ల కిందట ప్రవేశపెట్టిన పరీక్షల ఫలితాలు వెలువడిన నెల లోపలే సప్లిమెంటరీ పరీక్షలు పెట్టడమనే విధానం వల్ల విద్యార్థుల ఆత్మహత్యలు ఆ రాష్ట్రంలో గణనీయంగా తగ్గిపోయాయి. ఈ విధానాన్ని ఇప్పుడు పలు రాష్ట్రాలు అమలు చేయడం ఒక మంచి పరిణామం.

ఆత్మహత్యకు పాల్పడే వారికి 'ఎమోషనల్ ఫస్ట్ ఎయిడ్' ఇవ్వాలి. అంటే, వారి బాధలను ఓపిగ్గా వినడం, సానుభూతి చూపించడం, ధైర్యం చెప్పడం, ఓదార్చడం, నీకు మేమున్నాం అనే భరోసా కల్పించడం ద్వారా ఆత్మహత్య ప్రయత్నాలను చాలా వరకు తగ్గించవచ్చు. ప్రభుత్వం 'జాతీయ ఆత్మహత్య నివారణ' పథకాన్ని తీసుకురావాలి. ఇందులో మానసిక నిపుణులనూ, ఉపాధ్యాయులనూ, స్వచ్ఛంద సంస్థలనూ భాగస్వాములను చేసి సమాజంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి పట్టణంలో ఒక 'సూసైడ్ హెల్ప్‌లైన్' ఏర్పాటు చేసి అలాంటి తలంపులున్న వారికి తక్షణ సాంత్వన కల్పించే ఏర్పాటు చేయగల్గితే ఈ ఆత్మహత్యా నివారణ దినోత్సవానికి సార్థకత లభించినట్లవుతుంది.

వ్యాసకర్త ప్రముఖ మానసిక వైద్యులు, రచయిత
మొబైల్: 93481 14948

(సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం)

చినమాయకు పెనుమాయ

వృకుడనే అసురుడికి ఒకనాడు నారదముని కనిపించగా, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఎవరు భక్తులకు సులభసాధ్యుడై తొందరగా వరములిచ్చి కోరికలు తీరుస్తాడో చెప్పమని వేడుకుంటాడు. బాణుడు, రావణుడు వంటి మీ జాతివారే అయిన వీరులకు అతి సులభంగా కోరిన వరములిచ్చిన మహేశ్వరుడినే నీవు కూడా ఆరాధించి, కావలసిన వరమేదో కోరుకొమ్మని సలహాయిచ్చి, తన దారిన తాను వెళ్ళిపోతాడు నారదుడు. ఘోరమైన తపస్సు చేస్తాడు వృకుడు. మెచ్చి ప్రత్యక్షమైన శంకరుడిని 'తాను ఎవడి తలపై చేయి పెడతాడో వాడి తల వేయి ఖండములై ధరపై పడాలని' వరముగా వేడుకుంటాడు. అమాయకంగా 'అలాగే!' అంటాడు పరమశివుడు. మహదానందపడిన వృకుడు 'మరింకేమి? స్వామివారి వరప్రభావం ఎంతటిదో ఒకసారి పరీక్షించుకుంటాను!' అని శివుని శిరస్సు మీదే తన కరము ంచబోతాడు. అప్పటికిగాని అపాయం అవగతం కాని పరమశివుడు, చేసేది లేక, ముందుగా వృకుడి ముందునుంచి వెళ్ళిపోవడం ఒక్కటే మార్గం అనిపించి, పరుగెట్టిపోయి హరి చెంతన చేరి, ఏదో ఒకటి చేసి ప్రమాదం నుండి తప్పించమని అడుగుతాడు. తప్పదు కదా హరికి! అయితే, అప్పుడు వృకుడిని దేహబలంతో ఎదుర్కోవడం వల్ల ఉపయోగం లేదని గ్రహించినవాడై, బుద్ధిబలంతో మాటలతోనూ, ఆ పైన మాయతోనూ ఎదుర్కొని ఆపద నుండి బయటపడాలని నిర్ణయించుకుంటాడు విష్ణువు. ముందుగా వృకుడిని మాటలలోకి దించి, ఇలా అంటాడని సందర్భానికి తగిన చమత్కారం నిండిన కందపద్యంలో చెప్పాడు అల్లాడు నరసింహకవి తన రచనయైన 'నారదీయ పురాణము' కావ్యంలో.



జ్యోతిర్మయం

'శిరమంటివి కరమంటివి
వరమంటివి హరుడు పల్కు వచనంబులకున్
ధరలో నిల్కడగలదే
పరులవలె న్నేడు నిన్ను భ్రమయించె గదా.'

'శిరస్సన్నావు, చెయ్యన్నావు, చెయ్యి తలపై పెట్టగానే తలవెయ్యి ముక్కలై నేలపై పడుతుందని వరమిచ్చాడన్నావు, నమ్మగలిగే మాటలేనా ఇవి? ఈ భూమి మీద శివుడి మాటలకు స్థిరత్వం ఉన్నదా? నిన్ను కూడా మోసం చేశాడు చూశావా!' అని వృకుడి మదిలో సందేహం కలిగించి, కోపం తెప్పించడం ఈ పద్య భావం. అలా కోపంలో మతి తప్పి ఉన్న వృకుడిని' కావాలంటే నువ్వే పరీక్ష చేసుకో!' అని పురికొలిపి,'శాంబరీ విభ్రమం' అనే మాయ కల్పించి, ఆ మాయలో వృకుడు తన తలపై తానే చెయ్యి పెట్టుకునేలా చేసి , కథను ముగిస్తాడు హరి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.నవమి రా.8.18 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: మృగశిర సా.4.04 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.12.55 నుండి 2.36 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.11 వరకు, అమృతఘడియలు: ఉ.6.54 నుండి 8.32 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.07.

'పాలమూరు ప్రాజెక్టు'తో ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



పంప్‌హౌస్ వద్ద కార్మికులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: 'పాలమూరు- రంగారెడ్డి' ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరబోతోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పక్కనే కృష్ణానది ఉన్నా తాగునీటికి నోచుకోని వందేళ్ల పాలమూరు గోస ఈ ప్రాజెక్టుతో తీరనుందని చెప్పారు. ఈనెల 16న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద ప్రాజెక్టు పంప్‌హౌస్ పనులతోపాటు ఎల్లూరు సమీపంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. కృష్ణానది దిగువన ఉందని...గడ్డమీద ఉన్న పాలమూరుకు నీరెలా ఇస్తారని ఆనాటి పాలకులు అన్నార ని...ఇప్పుడెలా వస్తున్నాయో ప్రజలు గుర్తించాలని కోరారు. సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నంతో ప్రపంచంలోనే అతిపెద్ద మోటార్లతో ప్రాజెక్టును ప్రారంభించుకోబోతున్నామన్నారు. వలసల జిల్లాగా పేరొందిన పాలమూరుకు ఇతర ప్రాంతాల ప్రజలు బతుకు దెరువు కోసం వచ్చే స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

శాస్త్రవేత్తలు, రైతుల అనుసంధానంతో పచ్చదనం

- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం



మాట్లాడుతున్న వెదిరె శ్రీరాం

చౌటుప్పల్: నీటి కరువున్న ప్రాంతాన్ని పచ్చని భూమిగా మార్చేందుకు శాస్త్రవేత్తలు, రైతులను అనుసంధానించడం ఎంతో అవసరమని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం అభిప్రాయపడ్డారు. స్థిరమైన భూగర్భజలాల నిర్వహణ కోసం శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ చేపట్టిన 'ఒక వారం-ఒక ప్రయోగశాల'లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని మంద్రోళ్లగూడెం ఎన్‌జీఆర్ఐలో గురువారం నిర్వహించిన 'సమాజంతో అనుసంధానం' కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పలువురు శాస్త్రవేత్తలతో కలిసి ఎన్‌జీఆర్ఐ (నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) ప్రాంగణంలోని చెరువు, సమీపంలోని బోరుబావులు, రైతుల పంటపొలాలను సందర్శించి నీటి లభ్యత, వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ, కర్ణాటక, తెలంగాణ, హరియాణా, మహారాష్ట్ర నుంచి హాజరైన 150మంది రైతులతో పాటు విద్యార్థులు, స్థానిక రైతులతో లింగారెడ్డిగూడెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూపీ భూగర్భ జల శాఖ డైరెక్టర్ వీకే ఉపాధ్యాయ్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుభాష్‌చంద్ర లు మాట్లాడుతూ.. మంద్రోళ్లగూడెంలోని ఎన్‌జీ ఆర్ఐ ప్రాంగణంలో 2015లో నిర్మించిన చెరువు సత్ఫలితాలు ఇస్తోందన్నారు. 238 ఎకరాల భూమి సాగులోకి వచ్చిందన్నారు.

బెయిల్ కోసం పాత గాయాలు చూపించారు

- సీపీ ఏవీ రంగనాథ్



వరంగల్ క్రైం: కాకతీయ యూనివర్సిటీ వీసీ కళ్లలో ఆనందం చూడటానికి విద్యార్థులను గన్‌తో బెదిరించినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, క్రిమినల్ కేసుల్లో ఉన్న విద్యార్థులు కొంత మంది గొడవల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్‌తో కలిసి సీపీ విలేకరులతో మాట్లాడారు. కాకతీయ వర్సిటీలో కొంతకాలంగా అనేక విద్యార్థి సంఘాలు వివిధ అంశాలపై ఆందోళన చేస్తున్నాయని, ఏబీవీపీ సంఘం నుంచి కొద్దిమంది మాత్రం తమ స్వార్థం కోసం నిబంధనలను పట్టించుకోకుండా.. పీహెచ్‌డీ సీట్ల కోసం వర్సిటీ అధికారులపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నాస్తికుడు బైరి నరేశ్‌పై ఈ విద్యార్థులే భౌతిక దాడికి పాల్పడ్డారని, అయితే వీరి జీవితం నాశనం కావొద్దన్న ఉద్దేశంతో చిన్నచిన్న సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి వదిలివేసినట్లు చెప్పారు. 2 రోజులక్రితం పీహెచ్‌డీ అడ్మిషన్ల సందర్భంగా జరిగిన గొడవలో అరెస్ట్ చేశామే తప్ప వారిని కొట్టలేదన్నారు. కానీ విద్యార్థులు పాత గాయాలను చూపించి బెయిల్ కోసం న్యాయమూర్తిని సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. వీసీ రమేశ్ మాట్లాడుతూ, పీహెచ్‌డీ అడ్మిషన్లను పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. మెరిట్‌లో వెనక ఉన్న విద్యార్థులు 'ఉద్యమాలు చేశాం... మాకు సీట్లు ఇవ్వాలి' అని అసభ్య పదజాలంతో అడగడం ఎంత వరకు సరైందని ప్రశ్నించారు.

ఆర్టీసీ విలీనం బిల్లు ఏమైంది?

గత నెల ఆరో తేదీనే రాజ్‌భవన్‌కు

కొన్ని అంశాల్లో స్పష్టత కోసం తిరిగి లా సెక్రెటరీ కార్యాలయానికి..

శాసనసభ ఆమోదించి నెల గడిచినా కొనసాగుతున్న అయోమయం

మరోసారి ఆందోళనకు సిద్ధమంటున్న కార్మిక నేతలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశం మరోసారి గందరగోళంగా మారుతోంది. ఆగమేఘాల మీద శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఏమైందో స్పష్టత లేకపోవటం కార్మికుల్లో ఆందోళనకు, అయోమయానికి కారణమవుతోంది. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలపడంలో జాప్యం జరిగినప్పుడు ఆర్టీసీ కార్మికులు ఏకంగా రెండు గంటలపాటు బస్సులు దిగ్బంధం చేసి రాజ్‌భవన్‌ను ముట్టడించారు. ఆ సమయంలో పుదుచ్చేరిలో ఉన్న గవర్నర్ మరుసటి రోజు హైదరాబాద్ వచ్చిమరీ ఆమోదం తెలిపారు. అంత వేగంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో.. ఇక బిల్లు ఆమోదం, ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనానికి వీలుగా కమిటీ ఏర్పాటు కావటం, మార్గదర్శకాలు రూపొందటం, విలీన ప్రక్రియ పూర్తి కావటం కూడా అంతే వేగంగా జరుగుతుందని భావించారు. కానీ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి సరిగ్గా నెల గడిచింది. గత నెల ఆరో తేదీన శాసనసభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అది గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు చేరింది. అయితే కొన్ని సందేహాల నివృత్తి కోసం దానిని న్యాయశాఖ కార్యదర్శికి పంపినట్టు తర్వాత గవర్నర్ ప్రకటించారు. ఇక ఆ తర్వాత ఏం జరిగిందన్న విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

183 మంది ఉద్యోగుల కుటుంబాలకు నిరాశ

గత నెలలో పదవీ విరమణ పొందిన 183 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలు నెలాఖరు వరకు ఉత్కంఠగా ఎదురుచూసి నిరాశ చెందాల్సి వచ్చింది. ఇప్పుడు మరో 200 కుటుంబాలు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. న్యాయశాఖ కార్యదర్శి కార్యాలయానికి వచ్చిన బిల్లు అప్పటినుంచి తెలంగాణ సచివాలయంలోనే ఉండిపోయిందంటూ కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. దీనిపై రాజ్‌భవన్ వర్గాలను 'సాక్షి'వివరణ కోరగా, ఆర్టీసీ బిల్లు ఇంకా రాజ్‌భవన్‌కు చేరుకోలేదని పేర్కొన్నాయి. వేరే 3 బిల్లులు మాత్రం వచ్చాయని వివరించాయి.

ఆ రెండు వేతన సవరణలు చేయాలి: కార్మిక సంఘాలు

బిల్లును తిరిగి రాజ్‌భవన్‌కు పంపటంలో జాప్యం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు, ఇప్పుడు మరో అంశంపై పట్టు పడుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగులకు 2017, 2021 వేతన సవరణలు పెండింగులో ఉన్నందున, వాటిని క్లియర్ చేయకుండా ప్రభుత్వంలో విలీనం చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని పేర్కొంటున్నాయి. విలీన ప్రక్రియ లోపే ఆ రెండు వేతన సవరణలు చేస్తే, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలను కొంత ఉన్నత స్థాయిలో స్థిరీకరించేందుకు వీలుంటుందని, లేకుంటే తక్కువ వేతన స్థాయిలోనే ఫిక్స్ అవుతాయని, ఇది కార్మికులను తీవ్రంగా నష్టపరుస్తుందని వివరిస్తున్నాయి. ఆయా అంశాలపై మరోసారి ఆందోళనకు సిద్ధమని అంటున్నాయి.

ఇప్పుడు ఏ కార్యాలయాన్ని ముట్టడించాలి



అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేందుకు గవర్నర్ ఆమోదం తెలియజేయడంలో జాప్యం జరిగిందంటూ రాజ్‌భవన్‌ను ముట్టడించేలా చేశారు. మరి ఇప్పుడు ప్రభుత్వమే జాప్యం చేస్తోంది. ఇప్పుడు ఏ కార్యాలయాన్ని ఆర్టీసీ కార్మికులు ముట్టడించాలి. బిల్లును ఇప్పటికీ రాజ్‌భవన్‌కు పంపకుంటే వెంటనే పంపాలి. ఈలోపు కార్మికులకు బకాయి ఉన్న వేతన సవరణలు చేయాలి.

- అశ్వత్థామరెడ్డి, ఉద్యోగుల జేఏసీ చైర్మన్

వెంటనే రాజ్‌భవన్‌కు పంపాలి



ఆర్టీసీ విలీనం బిల్లును గవర్నర్ సంతకం కోసం వెంటనే రాజ్‌భవన్‌కు పంపాలి. జాప్యం చేయకుండా రెండు వేతన సవరణలు జరిపి, సీసీఎస్ బకాయిలు చెల్లించి, ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేయాలి.

- రాజిరెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్

4 నెలల్లో నాలుగో వంతు రాబడి

2.58 లక్షల కోట్ల బడ్జెట్ అంచనాలో జూలై నాటికి రూ.67 వేల కోట్ల రాబడులు

- పన్ను ఆదాయం రూ.42 వేల కోట్లు
- జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయం 30 శాతం పైమాటే
- నాలుగు నెలలకే 50 శాతం దాటిన అప్పులు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి నాలుగు నెలల్లో నాలుగో వంతు రాబడులు వచ్చాయి. ఈ ఏడాదికి మొత్తం రూ.2.58 లక్షల కోట్లతో బడ్జెట్ అంచనాలు రూపొందించగా జూలై నెల ముగిసే నాటికి రూ.67,494.73 కోట్ల మేర ఖజానాకు ఆదాయం సమకూరిందని గణాంకాలు చెబుతున్నాయి. అంటే మొత్తం బడ్జెట్ ప్రతిపాదనల్లో ఇది 26 శాతం అన్నమాట. ఇందులో పన్నుల వాటా కింద రూ.42,712.27 కోట్లు వచ్చింది. ఆ తర్వాత అప్పుల పద్దు కింద కూడా ఎక్కువ సమకూరింది. ఈ ఏడాది బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా రూ.38,234 కోట్లు సేకరించాలన్నది అంచనా కాగా, అందులో దాదాపు 54 శాతం ఇప్పటికే సమకూరింది. 2023 జూలై నాటికి రూ.20,637.23 కోట్లు అప్పుల ద్వారా సేకరించినట్టు రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు పంపిన నివేదికలో వెల్లడించింది. మొత్తం రాబడుల్లో అప్పులే 30 శాతం ఉండడం గమనార్హం. ఇక పన్నుల ఆదాయంలో ఎక్కువగా జీఎస్టీ నుంచి రూ.15 వేల కోట్లకు పైగా వచ్చింది. మొత్తం అంచనాల్లో ఇది కూడా 30 శాతం దాటింది. ఎక్సైజ్ రాబడులు కూడా 30 శాతం దాటాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్, పన్నుల్లో వాటా కలిపి రూ.6,300 కోట్లకు పైగా సమకూరాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలై నాటికి రాబడులు 3 శాతానికి పైగా పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

జూలై నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయ వివరాలివి

రాక:	
ఆదాయ వనరు	సమకూరిన మొత్తం రూ.కోట్లలో)
జీఎస్టీ	15224.52
రిజిస్ట్రేషన్లు	4686.86
అమ్మకపు పన్ను	10171.47
ఎక్సైజ్	6074.12
పన్నుల్లో వాటా	4026.62
ఇతర పన్నులు	2528.55
పన్నేతర ఆదాయం	1815.45
గ్రాంట్ ఇన్ ఎయిడ్	2317.82
(వీటితో పాటు రూ. 20,637.23 కోట్లను రుణాల ద్వారా సేకరించారు)	
పోక:	
వ్యయ పద్దు	మొత్తం
రెవెన్యూ పద్దు	20,556.11
వడ్డీల చెల్లింపు	7174.70
వేతనాలు	13686.99
పింఛన్లు	5461.89
సబ్సిడీలు	3424.08
ప్రణాళిక వ్యయం	13073.95

భువనగిరి కలెక్టరేట్‌కు 'రావి' పేరు పెట్టాలి



భువనగిరి జిల్లా నాగిరెడ్డిపల్లిలోని రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రావి ప్రతిభ తదితరులు

- నారాయణరెడ్డి వర్ధంతిసభలో వక్తల డిమాండ్

సాక్షి, యాదాద్రి: భువనగిరి కలెక్టర్ కార్యాలయ భవన సముదాయానికి తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి స్తూపం వద్ద రావి 33వ వర్ధంతి సభ జరిగింది. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరిలో రావి నారాయణరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడానికి మున్సిపాలిటీలో తీర్మానం చేయిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి, బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, గోదా శ్రీరాములు మాట్లాడుతూ.. భూమికోసం భుక్తి కోసం, కుల నిర్మూలన కోసం భూస్వాముల అరాచకాలను అంతం చేసేందుకు ఆంధ్ర మహాసభ ద్వారా ప్రజా పోరాటాలు నడిపిన గొప్ప వ్యక్తి రావి అన్నారు. హైదరాబాద్‌లోని ఏదైనా ఒక ప్రధాన కూడలిలో రావి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మిస్తున్న ప్రాజెక్టులు, జిల్లా కలెక్టర్ భవనానికి రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని కోరా రు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రావి కుటుంబ సభ్యులు రావి ప్రతిభ, రావి రిషికేశ్ రెడ్డి, రావి వేణుగోపాల్‌రెడ్డి, రావి సురేందర్‌రెడ్డితో పాటు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులూ..ఆత్మహత్యలు చేసుకోకండి

- పోరాడుదాం.. హక్కులు సాధించుకుందాం
- బీజేపీ తెలంగాణ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భరోసా
- రవీందర్‌కు పరామర్శ



రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి

సంతోష్‌నగర్: హోంగార్డులు ఆత్మహత్యలు చేసుకోవద్దని..పోరాడి హక్కులు సాధించుకుందామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రాణాపాయస్థితిలో అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు రవీందర్‌ను ఆయన గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హోంగార్డుల విషయంలో శ్రమదోపిడీ జరుగుతోందని..వారికి కనీస హక్కులు ఇవ్వడం లేదన్నారు. హోంగార్డు వ్యవస్థను ప్రభుత్వం అవమానిస్తుందన్నారు. ఈ ఘటనపై విచారణ జరగాలన్నారు. ఆయన కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.

ధర్నాకు కిషన్‌రెడ్డి మద్దతు: అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రి ఆవరణలో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న హోంగార్డులకు కిషన్‌రెడ్డి మద్దతు తెలిపారు. 17 సంవత్సరాలుగా హోంగార్డుగా సేవలు అందిస్తున్న రవీందర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. మనం అవసరమైతే పోరాటం చేద్దాం కానీ.., ప్రాణాలు తీసుకోవద్దన్నారు. కాగా, హోంగార్డులను ఇలాంటి పరిస్థితిలో తాను ఎప్పుడూ చూడలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంతకు ముందు ఆయన రవీందర్‌ను పరామర్శించారు.

సీఎం సారూ... హోంగార్డులను పర్మినెంట్ చేయండి

- బాన్సువాడ పీఎస్ హోంగార్డు నాగమణి వీడియో వైరల్



ఖలీల్‌వాడి: సీఎం సారూ.. హోంగార్డులను పర్మినెంట్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలంటూ కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీస్‌స్టేషన్ హోంగార్డు నాగమణి చేసిన వీడియో వైరల్ అయ్యింది. గురువారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. హైదరాబాద్‌లో హోంగార్డు రవీందర్ భార్య అనుభవిస్తున్న బాధను తాను కూడా అనుభవిస్తున్నట్లు చెప్పారు. "నా భర్త సాయికుమార్ లాస్ట్‌స్టేజీలో ఉన్నారని డాక్టర్లు చెప్పారు. పిల్లలను హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాం.. చాలా ఇబ్బందులు పడుతున్నాం. నాలా చాలా మంది హోంగార్డులు తమ వ్యక్తిగత బాధలను చెప్పుకోలేక పోతున్నారు. చాలీచాలని జీతాలతో బతకలేకపోతున్నాం, హాస్పిటల్ ఖర్చులు, స్కూల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం.. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నామే గాని మావి విలువ లేని బతుకులు.. సీఎం సారు హోంగార్డులను పర్మినెంట్ చేస్తామని గతంలో చెప్పారు అందుకే అడుగుతున్నాం..హోంగార్డు యూనియన్ నేతలైన ఏడుకొండలు, ప్రేమ్, రాజేందర్, ఇబ్రహీం, వెంకటేశ్, శివన్న సీఎం సార్‌కు ఈ వీడియోను చేరే వరకు పంపండి"అని ఆ వీడియోలో కోరారు. తామూ తెలంగాణ బిడ్డలమేనని హోంగార్డులకు న్యాయం చేస్తే సీఎం కేసీఆర్ ఫొటో పెట్టుకొని బతుకుతామని ఆ వీడియోలో ఆమె వ్యాఖ్యానించారు.

రాష్ట్ర క్రిస్టియన్ కమ్యూనిటీ అధ్యక్షునిగా విల్సన్ సింగం



ఉప్పల్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ కమ్యూనిటీ అధ్యక్షునిగా తెలంగాణ చీఫ్ బిషప్ విల్సన్ సింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిషప్ విల్సన్ సింగం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్రైస్తవుల గొంతుకగా క్రైస్తవ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడతానని పేర్కొన్నారు.

ఇద్దరు చిన్నారులను మింగిన పిల్లర్ గుంత

- ఇటీవలి వర్షాలకు భవనం పిల్లర్ల కోసం తీసిన గోతిలో చేరిన నీరు
- ఆడుకుంటూ వెళ్లి అందులో జారిపడ్డ పిల్లలు



బాల్కొండ: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్ గ్రామంలో గురువారం భవన నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ గుంతలో పడి వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. గ్రామానికి చెందిన మెట్టు నాస్తిక్ (4), నిషాంత్ చరణ్ (4) ఆడుకో వడానికి ఉదయం ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. ఇటీవల గ్రామంలో వీడీసీ భవన నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో పిల్లర్ల కోసం గుంతలను తవ్వారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో నీరు నిలిచింది. ఆడుకుంటూ అటువైపు వెళ్లిన చిన్నారులు గుంత పక్కనున్న మట్టి కుప్పపైకి చేరుకున్నారు. అక్కడి నుంచి జారి గుంతలో పడిపోయారు. మధ్యాహ్నం దాటినా పిల్లలు ఇంటికి రాకపోవడం, ఎక్కడా కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు సమీపంలో ఉన్న చెరువు వైపు, గ్రామంలోనూ వెతికారు. మధ్యాహ్నం దాటాక భవన నిర్మాణం పక్కనుంచి వెళ్తున్న ఓ వ్యక్తికి గుంతలో ఓ చిన్నారి వీపు భాగం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. దీంతో గ్రామస్తులు కర్ర సాయంతో ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. ఎస్సై గోపి సిబ్బందితో కలసి ఘటనాస్థలిని పరిశీలించారు. కాంట్రాక్టర్ పిల్లర్లు తవ్వి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేయడం వల్లే ఈ ఘోరం జరిగిందని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వలస వచ్చి రెండు నెలలు..

మృతుల్లో నిషాంత్ చరణ్ తల్లిదండ్రులు గ్రామానికి బతుకుదెరువు కోసం చిట్టాపూర్ నుంచి వలస వచ్చారు. చరణ్ తండ్రి శ్రీకాంత్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బతుకు దెరువు కోసం వస్తే బతుకునే కాటేసిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మరోవైపు చిన్నారి నాస్తిక్ తండ్రి దేవాదాస్ 2 నెలల క్రితం ఉపాధి కోసం మాల్దీవులకు వెళ్లాడు. వారికి కూమార్తె, కుమారుడు ఉండగా అందులో నాస్తిక్ మృతిచెందాడు. కాగా, మృతుల కుటుంబాలకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

కూర్చున్న వారిని కబళించేసింది



సాయికుమార్

జన్నారం: స్వగ్రామానికి వెళ్దామని బస్టాప్‌లో కూర్చున్న తండ్రీకొడుకులను లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామంలో గురువారం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అంతారం మండలం అనంతారానికి చెందిన జోగు సాయికుమార్ (36) రేండ్లగూడ గ్రామానికి చెందిన కుతుబొద్దీన్ డెయిరీఫాంలో పని చేస్తున్నాడు. ఆయనకు భార్య మంజుల, కుమారుడు లక్ష్మణ్ (7) ఉన్నారు. స్వగ్రామానికి వెళ్లేందుకు రేండ్లగూడలో ఆటో ఎక్కి కలమడుగులో దిగారు. అక్కడి నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సు కోసం బస్టాప్ ప్రాంతంలోని సిమెంటు బెంచిపై కూర్చున్నారు. ఇంతలో అతివేగంగా దూసుకొచ్చి, అదుపు తప్పిన లారీ బెంచిపై కూర్చున్న సాయి కుమార్, లక్ష్మణ్‌లపై బోల్తా పడింది. స్థానికులు వెంటనే లారీ కింద చిక్కుకున్న ఇద్దరిని బయటకు తీశారు. కానీ అప్పటికే వారు మృతి చెందారు.

గద్దర్ కుటుంబాన్ని పరామర్శించిన అంబేడ్కర్ముని మనుమడు



గద్దర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న భీమ్‌రావు తదితరులు

అల్వాల్: గద్దర్ కుటుంబాన్ని అంబేడ్కర్ ముని మనుమడు భీమ్‌రావు అంబేడ్కర్ పరామర్శించారు. గురువారం భూదేవినగర్‌లోని నివాసానికి వెళ్లి గద్దర్ సతీమణి విమల, కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్, కుమార్తె డాక్టర్ వెన్నెలతో సమావేశమయ్యారు. వారికి మనోధైర్యం చెప్పారు. మహాబోధి విద్యాలయంలో గద్దర్ సమాధి వద్ద నివాళులర్పించారు. భీమ్‌రావు అంబేడ్కర్‌తో ప్రవీణ్ అకాడియా, చిన్న కృష్ణారెడ్డి, గొల్లపల్లి దయానంద్, హైకోర్టు అడ్వొకేట్ స్వామి, మేజర్ చంద్రకాంత్, సీఎల్ యాదగిరి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

కృష్ణా ప్రాజెక్టులపై గెజిట్‌ను రద్దు చేయాలి

- కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ సర్కారు లేఖ
- ఏపీలోని నాలుగు ప్రాజెక్టులకు మినహాయింపు తగదు
- బేసిన్ వెలుపల ఉన్న వాటికి కేటాయింపులు లేవు
- ఆ అధికారం కేవలం ట్రిబ్యునల్‌కే ఉంది
- గెజిట్ ద్వారా మినహాయింపు ఇవ్వడం చెల్లుబాటు కాదని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన ఆరు ప్రాజెక్టులకు రక్షణ కల్పిస్తూ గత ఏడాది జూలై 27న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు చట్టబద్ధత లేదని, దానిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. బేసిన్ వెలుపల ఉన్న ఏపీలోని నాలుగు ప్రాజెక్టులకు ఎలాంటి నీటి కేటాయింపులు లేకున్నా.. అనుమతుల నుంచి మినహాయింపు కల్పించడం సరికాదని స్పష్టం చేసింది. నీటి కేటాయింపులు జరిపే అధికారం కేవలం ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉందని పేర్కొంది. పునర్విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రాజెక్టుల జాబితా అసంపూర్తిగా ఉందని.. 2002 నుంచే వినియోగంలో ఉన్న ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును అందులో చేర్చలేదని వివరించింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాలను ప్రభావితం చేసేలా ఉన్న ఈ గెజిట్‌ను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

తెలంగాణకు అన్యాయం..

కృష్ణా జలాల వినియోగంలో ఇరు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు విభజన చట్టం కింద కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటు చేసింది. ఆ బోర్డుకు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కృష్ణానదిపై తెలంగాణలోని కల్వకుర్తి (అదనపు 15 టీఎంసీల సామర్థ్యం పెంపు), నెట్టెంపాడు (సామర్థ్యం పెంచనిది)తోపాటు ఏపీలోని తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ఎత్తిపోతల పథకాలను అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో చేర్చింది. వీటికి ఏడాదిలోగా అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాలని పేర్కొంది. కానీ కేంద్రం వీటిని విభజన చట్టంలో 11వ షెడ్యూల్‌లో పొందుపరిచి, పూర్తి చేసుకోవడానికి అనుమతి ఇచ్చిన నేపథ్యంలో.. మళ్లీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదంటూ గత ఏడాది జూలై 27న సవరణ గెజిట్ జారీ చేసింది. అయితే.. ఇలా మినహాయింపు పొందిన ప్రాజెక్టుల్లో తెలంగాణలోని రెండే ప్రాజెక్టులు ఉండగా, ఏపీలోని 4 ప్రాజెక్టులు ఉండటంపై తెలంగాణ తాజాగా అభ్యంతరం తెలిపింది. కృష్ణా బేసిన్ పరిధిలో ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను కోరుతూ కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపిస్తున్నామని.. ఈ సమయంలో బేసిన్ వెలుపల ఉన్న ఏపీలోని 4 ప్రాజెక్టులకు మినహాయింపు ఇస్తే తెలంగాణకు తీవ్ర అన్యాయమని ఆందోళన వ్యక్తం చేసింది. బేసిన్ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులకు అనుమతుల కోసం చేస్తున్న ప్రయత్నాలకు గెజిట్ నోటిఫికేషన్ అడ్డంకిగా మారే అవకాశం ఉందని పేర్కొంది. కృష్ణాలో 75 శాతం లభ్యత ఆధారంగా నీటి కేటాయింపులు కోరుతున్నామని తెలిపింది.

క్లుప్తంగా...

విదేశీ అతిథుల కోసం అనువాదకులు

న్యూఢిల్లీ: జీ20 సదస్సు కోసం వచ్చి ఢిల్లీ దుకాణాల్లో, ముఖ్యంగా చాందినీ చౌక్ ప్రాంతంలో షాపింగ్ చేసే విదేశీ అతిథుల సౌకర్యం కోసం అక్కడి వర్తకులు మరో అడుగు ముందుకేశారు. షాపింగ్ సమయంలో భాషా బేధంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అనువాదకు(ట్రాన్స్‌లేటర్)లను సిద్ధంచేస్తున్నారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్ ఇలా జీ20 దేశాల్లో మాట్లాడే భాషలను అనర్గళంగా మాట్లాడి అనువదించగల 100 మంది మహిళా అనువాదకులను అక్కడి వర్తకులు రంగంలోకి దింపుతున్నారు. వీరు అందుబాటులో ఉండటంతో ఇకమీదట విదేశీ అతిథులు షాపింగ్ వేళ ఎలాంటి ఇబ్బందులు పడరని వర్తకులు చెబుతున్నారు. ఈ అనువాదకులు నిజానికి నూతన వ్యాపార వ్యవస్థాపకులు(ఎంట్రప్రెన్యూవర్స్). వీరిలో ఫ్యాషన్ డిజైనర్లు, సెలూన్, బొటిక్ యజమానులు, బ్లాగర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్లు ఉన్నారు. 'వీరంతా ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మనీ తదితర భాషలను అనర్గళంగా మాట్లాడగలరు. 8, 9, 10 తేదీల్లో ట్రేడర్లకు, అతిథులకు అనుసంధానకర్తలుగా మెలగుతారు' అని వీరితో భాగస్వామ్యం కుదుర్చుకున్న ది చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ(సీటీఐ) చైర్మన్ బ్రిజేష్ గోయల్ చెప్పారు. 'ట్రేడర్లకు సాయపడే వాలంటీర్ల జాబితాను ఇప్పటికే కేంద్ర విదేశాంగ శాఖకు పంపాం. వీరు విదేశీ అతిథులకు అందుబాటులో ఉండి సాయపడతారు. దేశంలోనే షాపింగ్‌కు చిరునామాగా నిలిచే చాందినీ చౌక్‌లో విదేశీయుల సందడి మరింత పెరగనుంది' అని గోయల్ పేర్కొన్నారు.

నేడే మోదీ- బైడెన్ చర్చలు

న్యూఢిల్లీ: జీ 20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్ వస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరుదేశాల మధ్య ప్రపంచ, వ్యూహాత్మక స్థాయి భాగస్వామ్యాన్ని మరింతగా దృఢతరం చేసుకోవడమే చర్చల ప్రధాన అజెండా కానుంది. స్వచ్ఛ ఇంధనం, వర్తకం, హై టెక్నాలజీ, రక్షణ వంటి రంగాల్లో ప్రస్తుత పరస్పర సహకారాన్ని సమీక్షించి దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సమస్యలను అధిగమించే మార్గాలపై నేతలు దృష్టి సారిస్తారు. బైడెన్ శుక్రవారం సాయంత్రమే ఢిల్లీ చేరుకుంటారు. ఆదివారం జీ 20 సదస్సు ముగియగానే వియత్నాం బయల్దేరతారు. మోదీ, ఇతర నేతలతో ఈ వారాంతంలో ఫలప్రదమైన చర్చల కోసం బైడెన్ ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారని వైట్ అండ్ హౌజ్ ప్రెస్ కార్యదర్శి కరిన్ జీన్ పియరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చివరిసారిగా 2020లో భారత్‌ను సందర్శించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

జిన్‌పింగ్ ఎందుకు రావట్లేదు?

చుట్టుముట్టిన ఆర్థిక అనిశ్చితి! సమస్యను మరింత పెంచిన హౌజింగ్ సంక్షోభం



జీ20 సదస్సుకు కయ్యాలమారి చైనా అంతగా ప్రాధాన్యత ఇవ్వట్లేదా ?. అందుకే అధ్యక్షుడు జిన్‌పింగ్ తనకు బదులు ప్రధాని లీ కియాంగ్‌ను పంపించారా ?. ఇలాంటి ప్రశ్నలకు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు తలో విశ్లేషణ చెబుతున్నారు. జీ20 కూటమి ఆవిర్భావం తర్వాత చైనా అధ్యక్షులు ఒకరు శిఖరాగ్ర సదస్సులో పాల్గొనకపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన సదస్సుకు హాజరుకాకుండా జిన్‌పింగ్ చైనాలోని ఉండి ఏం చేస్తున్నారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 2020 మే నెల నుంచి భారత్‌తో సరిహద్దు వెంట ఇరుదేశాల సైనికులు బాహాబాహీకి దిగడం, భారీగా సైన్యం మొహరింపు వంటి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతుండటం వల్లే జిన్‌పింగ్ ఆగ్రహంతో సదస్సుకు రావట్లేదని చాలా మంది భావిస్తున్నారు. అసలు కారణం అది కాదని మరో వాదన బలంగా వినిపిస్తోంది. అదే అదుపు తప్పుతున్న చైనా ఆర్థిక పరిస్థితి.

జిన్‌పింగ్ ధనవంతుల కుటుంబంలో పుట్టాడు. అప్పుడే వచ్చిన సాంస్కృతిక విప్లవం ధాటికి ఆయన తండ్రి పేదవాడిగా మిగిలిపోయాడు. దీంతో జిన్‌పింగ్ బాల్యంలో కష్టాలు చూశాడు. పొలంలో సాధారణ కూలీగా పనిచేశాడు. ఆరేళ్ల ఇబ్బందులు పడ్డాడు. అయితే బలీయమైన చైనాకు అధ్యక్షుడిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలతో పోలిస్తే ఆనాటి కష్టాలు గడ్డిపరకతో సమానమే. 'చైనా రాజ్య విస్తరణ వాదం, దక్షిణ చైనా సముద్రంపై గుత్తాధిపత్యం, ప్రపంచ వస్తూత్పత్తి మార్కెట్‌కు ఏకైక దిక్కుగా మారాలన్న వ్యూహాలతో చైనా చాలా ప్రపంచ దేశాలకు శత్రువుగా మారింది. ఇలాంటి తరుణంలో చైనాతో కలిసి జీ20 వేదికను కలిసి పంచుకునేందుకు తోటి దేశాలు విముఖత చూపుతున్నాయి' అని మేథో సంస్థ కార్నీగ్ చైనా డైరెక్టర్ పాల్ హెనెల్ వ్యాఖ్యానించారు. ఆ అప్రతిష్ట పోగొట్టుకునేందుకే ' సదస్సు విజయవంతం అవడానికి అందరితో కలిసి పనిచేస్తాం' అని బీజింగ్ తాజాగా ప్రకటించింది. 'విదేశీ పర్యటనకు పక్కనబెట్టి స్వదేశ సమస్యలపై జిన్‌పింగ్ దృష్టిపెట్టారు. దేశ రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పొరుగు దేశాలతో కయ్యానికి దిగారు. ఆర్థిక వ్యవస్థ సమస్యల్లో చిక్కుకోవడంతో జిన్‌పింగ్‌కు తలనొప్పి పెరిగింది' అని సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆల్‌ఫ్రెడ్ వూ వ్యాఖ్యానించారు.

దెబ్బకొట్టిన హౌజింగ్ రంగం

ఇటీవల దశాబ్దాల కాలంలో ఎన్నడూలేనంతగా పలు సమస్యలు చైనాలో తిష్టవేశాయి. కుటుంబాలు తమ ఖర్చులను తగ్గించుకున్నాయి. కర్మాగారాల్లో ఉత్పత్తి తగ్గిపోయింది. వ్యాపారవేత్తలు నూతన పెట్టుబడులకు ముందుకు రావట్లేదు. ఎగుమతులు దిగజారాయి. ఆగస్టులో ఎగుమతులు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8.8 శాతం తగ్గాయి. దిగుమతులు 7.3 శాతంపెరిగాయి. నిరుద్యోగిత భారీగా పెరగడంతో ప్రభుత్వం తాజా గణాంకాలు బహిర్గతంచేయడం మానేసింది. ఆస్తుల మార్కెట్ విలువ భారీగా పతనమైంది. ప్రధాన డెవలపర్లు చేతులెత్తేసి దివాలాను ప్రకటించారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో చిక్కింది. 40 ఏళ్ల భవిష్యత్ అభివృద్ధి మోడల్‌ను ఈ అంశాలు తలకిందులుచేసేలా ఉన్నాయి. ప్రాపర్టీ రంగంపై అతిగా ఆధారపడటం, అత్యంత కఠినమైన కోవిడ్ ఆంక్షల విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయని నిపుణులు భావిస్తున్నారు. రుణాల పునాదిపై నెలకొల్పిన అభివృద్ధి మోడల్ ఈ పరిస్థితికి మరో కారణం. దేశం అప్పులు పెరిగిపోయాయి. 2023 తొలి త్రైమాసికంలో అప్పులు–జీడీపీ నిష్పత్తి రికార్డు స్థాయిలో 279 శాతంగా నమోదైందని బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది. రుణాలు అతిగా తీసుకొచ్చి మౌలిక వసతులపై ఖర్చుచేసిన పాపం ఇప్పుడు పండిందని మరో వాదన. హౌజింగ్ బుడగ బద్దలైంది. చైనా ఆర్థిక వ్యవస్థ 25 శాతం ప్రాపర్టీ మార్కెట్‌పైనే ఆధారపడింది. ఇన్నాళ్లూ కేవలం చైనాపై ఆధారపడిన విదేశీ బ్రాండ్లు ఇప్పుడు చైనాతోసహా ఇతర(చైనా ప్లస్ స్ట్రాటజీ) దేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. దీని వల్ల ప్రధానంగా లాభపడేది ఇండియానే. ఆపిల్, టెస్లా మొదలుకొని నైక్ వరకు అన్ని ప్రధాన సంస్థల తయారీకేంద్రాలు చైనాలోనే ఉన్నాయి. కార్మికులకు అధిక జీతభత్యాలు, అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో విదేశీ సంస్థలు చైనాకు బదులు వేరే దేశాల వైపు చూస్తున్నాయి. - సాక్షి, నేషనల్ డెస్క్

ఆర్మీలో అవిధేయత?

చైనా ఆర్మీలో పెరిగిన అవినీతి, పాలక పార్టీ పట్ల తగ్గిన విధేయతపై జిన్‌పింగ్ భయపడుతున్నారని ఆసియా పాలసీ సొసైటీ ఇన్‌స్టిట్యూట్‌లో జాతీయ భద్రతా విశ్లేషకుడు లైల్ మోరిస్ చెప్పారు. చైనా సైన్యంలో అణ్వస్త్ర సామర్థ్య రాకెట్ విభాగంలోని జనరల్, డెప్యూటీ జనరల్‌లను తొలగించడాన్ని ఆయన ఉటంకించారు. తనకు నమ్మకస్తుడైన విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌ను జిన్‌పింగ్ తప్పించడంతో పార్టీ వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి రేగింది. జిన్‌పింగ్ పాలనా సామర్థ్యానికి ఈ ఘటనలు మాయని మచ్చలని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇలాంటి సమస్యలు ఇంకొన్ని పెరిగితే డ్రాగన్ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ పాలనకు తెరపడే ప్రమాదముందని కొందరు సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. ఇన్ని సమస్యలు ఇంట్లో పెట్టుకునే జిన్‌పింగ్ చైనాను వదలి బయటకు రావట్లేదనే విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి.

78 భిన్న వాయిద్యాలతో సంగీత సౌరభం!

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం విచ్చేసిన ప్రపంచ నేతలకు వీనుల విందైన సంగీతం వినిపించేందుకు వాయిద్యకారులు సిద్ధమయ్యారు. భారతీయ సంగీత వారసత్వ సంపద ఎంతటి గొప్పదో ప్రత్యక్షంగా చూపేందుకు సమాయత్తమయ్యారు. శాస్త్రీయ సంగీతంతోపాటు సమకాలీన సంగీతంలో వినియోగించే భిన్న వాద్య పరికరాలతో సంగీత విభావరి అతిథులను ఆకట్టుకోనుంది. గాంధర్వ ఆతిథ్యం బృందం 'భారత వాద్య దర్శనం' పేరిట గొప్ప ప్రదర్శన ఇవ్వనుంది. జీ20 దేశాధినేతలకు సెప్టెంబర్ తొమ్మిదో తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చే విందులో ఈ సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సంతూర్, సారంగి, జల్ తరంగ్, షెహనాయ్ ఇలా దేశవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో ప్రఖ్యాతిగాంచిన మొత్తం 78 రకాల వాద్య పరికరాల నుంచి ఉద్భవించే అద్భుతమైన సంగీతం ఆహుతులను అలరించనుంది. 'సంగీత మార్గంలో భారత్ సాగించిన సామరస్య ప్రయాణం తాలూకు అపురూప జ్ఞాపకాలను ఇప్పుడు మరోసారి గుర్తుచేస్తాం' అని ఆహ్వాన ప్రతి సంబంధ బ్రోచర్ కాన్సెప్ట్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రదర్శన విలాంబిత్ లయతో మొదలై మధ్య లయలో కొనసాగి ధృత లయతో ముగుస్తుంది. ఈ వాయిద్య పరికరాల సమ్మేళనంలో 34 హిందుస్తానీ సంగీతం తాలూకు వాద్య పరికరాలు, 18 కర్ణాటక సంగీత సంబంధ పరికరాలు, 26 జానపద సంబంధ పరికరాలు వినియోగిస్తున్నారు. 11 మంది చిన్నారులు, 13 మంది మహిళలు, ఆరుగురు దివ్యాంగులు, 26 మంది యువకులు, 22 మంది నిష్ణాతులుసహా 78 మంది కళాకారులు ఈ వాద్య పరికరాలను వాయిస్తారు. తమ ప్రాంత విశిష్ట వారసత్వ సంగీత సంపదను ఘనంగా చాటుతూ భిన్న ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ సంప్రదాయక వేషధారణలో వేదకాలంనాటి పరికరాలు, గిరిజనుల, జానపదుల పరికరాలతోపాటు లలిత సంగీతం తాలూకు పరికరాలు వాయిస్తారు.



జీ20 ఇతివృత్తంతో ఇండియా గేట్ వద్ద కటౌట్

10న ప్రధానితో మాక్రాన్ భేటీ

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర భేటీకి హాజరవుతున్న ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల10న ప్రధాని మోదీతో సమావేశం కానున్నారు. శిఖరాగ్రం ఆఖరి రోజైన ఆదివారం ఫ్రాన్సు అధ్యక్షుడు ప్రధానితో సమావేశమవుతారని అధికారులు తెలిపారు. ఆయన బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా, ఇండోనేసియా అధ్యక్షుడు విడోడో, సౌదీ యువరాజు సల్మాన్‌తోనూ చర్చలు జరుపుతారు.

తీర్మానాలపై ఎన్నో ఆశలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సులో విస్తృత చర్చల తర్వాత దేశాధినేతలు ప్రపంచ శ్రేయస్సు కోసం ఎలాంటి తీర్మానాలు చేయనున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. జులైలో జీ20 దేశాల పర్యావరణశాఖ మంత్రుల సదస్సులో శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశాలవారీగా తగ్గించడంపై చర్చలో ఏకాభిప్రాయం కుదరనే లేదు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికల్లా 11 టెరావాట్లకు తేవడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వడం వంటి అంశాల్లోనూ ఉమ్మడి నిర్ణయం తీసుకోలేకపోయాయి. శిలాజ ఇంధనాలకు బదులు మరో ఇంధన వనరులకు మారడం, బహుళ అభివృద్ధి బ్యాంకు(ఎండీబీ)లో సంస్కరణలు వంటి అంశాల్లో కనీస ఉమ్మడి నిర్ణయాలైనా దేశాధినేతలు తీసుకుంటారేమోనని పలు రంగాల వర్గాలు ఆశగా చూస్తున్నాయి. 'అభివృద్ధి చెందుతున్న దేశాలకు మేలు చేకూర్చేలా తక్కువ వడ్డీకి రుణాలు అందేలా ఎండీబీలో సంస్కరణలు తేవాలన్న చర్చ జీ20 శిఖరాగ్ర సదస్సు స్థాయిలో జరగడం ఇదే తొలిసారి. సంస్కరణలు వాస్తవ రూపం దాల్చితే ఎంతో మేలు' అని క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థలో గ్లోబల్ పాలసీ విభాగం నేత ఇంద్రజిత్ బోస్ ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే ఇక్కడో సమస్య ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తాము అందుకున్న నిధులను పర్యావరణ మార్పులు తదితరాలను ఎదుర్కొనేందుకు ఖర్చుచేస్తాయి. గ్రాంట్స్‌గా కాకుండా రుణాలు, పెట్టుబడుల రూపంలో ఈ నిధుల్ని అందుకుంటాయి. వీటిని తిరిగి చెల్లించాలి. కానీ ఆ దేశాలకు ఆ స్తోమత ఉండదు. దీంతో ఈ దేశాలను ఆదుకునేందుకు సంపన్న దేశాలు వెనుకంజ వేస్తున్నాయి. 2011–20కాలంలో ఇలాంటి దేశాలకు కేవలం 5 శాతం నిధులే దక్కాయి. ఈ నేపథ్యంలో గత వాగ్దానాలు, తీర్మానాలకు కట్టుబడేలా ఈసారైనా జీ20 దేశాలు ఉమ్మడి నిర్ణయాలు తీసుకుంటాయో లేదో చూడాలి.

మరింత సహకారానికి 12 సూత్రాలు



ఆసియాన్ వేదికపై మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌తో ప్రధాని మోదీ

- ఇది ఆసియా శతాబ్దం
- ప్రపంచ వృద్ధికి మనమే ఊతం
- ఆసియాన్-భారత్ సదస్సులో మోదీ
- కలిసి సాగుతామంటూ సంయుక్త ప్రకటన

జకార్తా: 10 దేశాలతో కూడిన ఆసియాన్ కూటమి, భారత్ మధ్య మరింత సహకారానికి 12 సూత్రాల ప్రతిపాదనను ప్రధాని నరేంద్ర మోదీ తెరమీదకు తెచ్చారు. కనెక్టివిటీ మొదలు వర్తకం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దాకా పలు అంశాల్లో పరస్పర సహకారం పెంపునకు ఎంతగానో అవకాశాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. కరోనా అనంతరం మరింత క్రమశిక్షణతో కూడిన ప్రపంచం కోసం పాటుపడదామని పిలుపునిచ్చారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో గురువారం ఆసియాన్ -భారత్ వార్షిక శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి మోదీ మాట్లాడారు. మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, యూరప్‌లతో భారత్‌ను అనుసంధానిస్తూ ఆర్థిక కారిడార్ తదితరాలను ప్రస్తావించారు. శాంతి, ప్రగతి, పరస్పర వృద్ధే లక్ష్యంగా ఆసియాన్ -భారత్ భాగస్వామ్య కార్యాచరణను పటిష్టంగా ప్రణాళిక అమలు చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. సముద్ర వర్తకంలో పరస్పర సహకారాన్ని, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవాలని పేర్కొన్నాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో నిరంతర కనెక్టివిటీ, బ్లూ ఎకానమీ, ఆహార భద్రత మొదలుకుని అంతరిక్షం దాకా అన్ని రంగాల్లోనూ భారత కృషికి, ప్రయత్నాలకు ఆసియాన్ పూర్తి మద్దతుంటుందని ప్రకటన పేర్కొంది. అలాగే పరస్పర వర్తకం, పెట్టుబడుల ద్వారా ఆహార భద్రత, పౌష్టికాహారం తదితర రంగాల్లో సహకారాన్ని మరింతగా పటిష్టపరచుకోవాలని మరో సంయుక్త ప్రకటనలో నిర్ణయించాయి. ఉగ్రవాదం, దానికి నిధులు తదితరాల మీద ఉమ్మడి పోరు జరపాలని నిర్ణయించారు. మరింత స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ దిశగా ప్రగతి సాధనలో కలిసి రావాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. సదస్సుకు సహాధ్యక్ష హోదాలో ఆయన మాట్లాడారు. '21వ శతాబ్దం ఆసియాకు సొంతం. ఇది మన శతాబ్దం'' అని పేర్కొన్నారు.

ఆ ప్రతిపాదనల్లో కొన్ని...

- కనెక్టివిటీ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, వర్తకం, ఆహార భద్రత నుంచి బ్లూ ఎకానమీ దాకా వంటి పలు రంగాల్లో మరింత సహకారం
- ఉగ్రవాదం, దాని ఆర్థిక మూలాల మీద ఉమ్మడి పోరు
- దక్షిణాది ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను అంతర్జాతీయ వేదికల మీద లేవనెత్తడం
- ఆసియాన్–భారత్ డిజిటల్ ఫ్యూచర్ నిధి
- ఆసియాన్, ఈస్ట్ ఏషియా ఆర్థిక, పరిశోధన సంస్థ (ERIA) పునరుద్ధరణ, దానికి మరింత మద్దతు
- భారత్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్‌లో భాగం కావాలంటూ ఆహ్వానం
- విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాల కల్పన యత్నాల్లో భాగస్వామ్యం
- జన్ ఔషధీ కేంద్రాల ద్వారా పేదలకు అందుబాటు ధరల్లో మందులు అందించడంలో భారత అనుభవాన్ని అందిపుచ్చుకోవడం
- ఆసియాన్–భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలును నిర్ణీత కాలావధిలో సమీక్షించుకోవడం

30 ఏళ్ల బంధం

- వ్యూహాత్మక భాగస్వామ్య కూటమి ఏర్పాటు దిశగా ఆసియాన్- భారత్ చర్చలు 1992 నుంచే మొదలయ్యాయి.
- 1995 కల్లా పూర్తిస్థాయి రూపు సంతరించుకున్నాయి.
- 2002 నాటికి శిఖరాగ్ర సదస్సు స్థాయి భాగస్వామ్యంగా రూపుదాల్చాయి.
- ఆసియాన్ సభ్య దేశాలతో కొన్నేళ్లుగా భారత సంబంధాలు ఊపు మీదున్నాయి. రక్షణ, భద్రత, పెట్టుబడులు, వర్తకం తదితర రంగాల్లో సహకారం పెరుగుతూ వస్తోంది.

ఆ పది దేశాలు...

ఆసియాన్ కూటమి పది దేశాల సమాహారం. అంతర్జాతీయంగా శక్తిమంతమైన కూటముల్లో ఇదొకటి. దాని సభ్య దేశాలు...

- ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, బ్రూనై, వియత్నాం, లావోస్, మయన్మార్, కాంబోడియా.

- ఆసియాన్ కూటమిలో చర్చా భాగస్వాములుగా భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలున్నాయి.




ఆదిత్య పంపిన సెల్ఫీలో కనిపిస్తున్న వెల్సీ, సూట్ అనే పేలోడ్లు

ఆదిత్య సెల్ఫీ..!

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడి దిశగా దూసుకుపోతున్న ఆదిత్య–ఎల్1 కెమెరా పని మొదలుపెట్టింది. తన సెల్ఫీతోపాటు భూమి, చంద్రుడిని కూడా క్లిక్ మనిపించింది. ఈ మేరకు ఆదిత్య–ఎల్1 నుంచి అందుకున్న ఫొటోలను బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో విడుదల చేసింది. ఆదిత్య–ఎల్1లో అమర్చిన కెమెరా ఈనెల 4న తీసిన సెల్ఫీలో వీఈఎల్‌సీ (విజిబుల్ ఎమిషన్ లైన్), ఎస్‌యూఐటీ(సోలార్ అల్ట్రావయొలెట్) పరికరాలు కనిపిస్తున్నాయి. అదే కెమెరా భూమి, చంద్రుడి ఫొటోలను కూడా తీసింది. ఆదిత్య–ఎల్1లో అమర్చిన ఏడు వేర్వేరు పేలోడ్లలో వీఈఎల్‌సీ, ఎస్‌యూఐటీలు కూడా ఉన్నాయి. ఆదిత్య–ఎల్1 భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లగ్రాంజియన్ పాయింట్1(ఎల్1)లోని తన నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్నాక సూర్యుడి చుట్టు పరిభ్రమిస్తూ వీఈఎల్‌సీ పేలోడ్ ద్వారా రోజుకు 1,440 ఫొటోలను తీసి భూనియంత్రిత కేంద్రాలకు విశ్లేషణ నిమిత్తం పంపించనుంది.

అనారోగ్యంతో తుర్కియే గుహలో చిక్కుబడిన అమెరికా అన్వేషకుడు



ఘటన జరిగిన మోర్కా గుహ

ఇస్తాంబుల్: తుర్కియేలోని ఓ గుహలో వెయ్యి మీటర్ల లోతులో అనారోగ్యంతో చిక్కుకుపోయిన అమెరికాకు చెందిన మార్క్ డికే(40)ను సురక్షితంగా వెలుపలికి తీసుకువచ్చేందుకు అంతర్జాతీయంగా ప్రయత్నాలు మొదలయ్యాయి. అంతర్జాతీయ అన్వేషణలో భాగంగా తుర్కియేలోని టారస్ పర్వతాల్లో ఉన్న మోర్కా గుహల్లోకి మార్క్ డికే వెళ్లారు. మోర్కా గుహ లోతు 1,276 మీటర్లు కాగా, మార్క్ డికే 1,120 మీటర్ల లోతులోని బేస్‌క్యాంప్‌లో ఉన్నారు. జీర్ణాశయంలో రక్తస్రావం కారణంగా ముందుకు వెళ్లలేని స్థితిలో ఉండిపోయారని యూరోపియన్ కేవ్ రెస్క్యూ అసోసియేషన్ ప్రకటించింది. ఆయనకు అనేక అంతర్జాతీయ గుహాన్వేషణల్లో పాలుపంచుకున్న అనుభవం ఎంతో ఉంది. గృహల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించడంలో స్వయంగా ఆయన సిద్ధహస్తుడని వివరించింది. సాధారణ పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన గృహాన్వేషకులకే అక్కడికి వెళ్లేందుకు 15 గంటలు పడుతుందని టర్కిష్ కేవింగ్ ఫెడరేషన్ వివరించింది. మార్క్ డికే కోసం ఆరు యూనిట్ల రక్తం పంపించామని టర్కీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. డికేను కాపాడేందుకు తుర్కియే, అమెరాకాతోపాటు హంగరీ, బల్గేరియా, ఇటలీ, క్రొయేషియా, పోలాండ్ దేశాలకు చెందిన 150 మంది నిపుణులను రప్పిస్తున్నట్లు యూరోపియన్ కేవ్ రెస్క్యూ అసోసియేషన్ తెలిపింది. ఎంతో క్లిష్టమైన ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొన్ని రోజుల వరకు పట్టవచ్చని చెబుతున్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు మోదీ యత్నం

- తొమ్మిదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్ర ఇది
- వ్యాఖ్యల కేసులన్నిటినీ చట్టపరంగా ఎదుర్కొంటా
- తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పష్టీకరణ



చెన్నై: సనాతన ధర్మకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలపై డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సహా కాషాయ పార్టీ నేతలు తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వ్యాఖ్యలపై దాఖలైన కేసులన్నిటినీ చట్టపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మణిపూర్‌లో నెలలుగా కొనసాగుతున్న హింసపై విమర్శలను ఎదుర్కోలేని ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తన వ్యాఖ్యలపై రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో ప్రధాని మోదీ, మంత్రులు సనాతన ధర్మపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై చర్చించిన విషయం తెలిసిందే. 'ప్రజలకిచ్చిన వాగ్దానాలను తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించింది. ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ఫాసిస్ట్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. దీనిని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతలు 'జనహననం'అంటూ నా వ్యాఖ్యలను వక్రీకరించారు. తమను తాము రక్షించుకునేందుకు దీనిని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు'అని గురువారం ఉదయనిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఏ మతానికీ వ్యతిరేకం కాదని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. 'మణిపూర్‌లో ఆగని హింసపై సమాధానం ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే మోదీజీ స్నేహితుడు అదానీని వెంటేసుకుని ప్రపంచ దేశాల్లో తిరుగుతున్నారు. మణిపూర్ హింసలో 250 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు..మోదీ ప్రభుత్వం 7.5 లక్షల కోట్ల అవినీతికి పాల్పడింది. వీటన్నిటినీ మరుగుపరిచేందుకే మోదీ, ఆయన బ్యాచ్ సనాతన వ్యాఖ్యలను వాడుకోవాలనుకుంటున్నారు. ప్రజల అమాయకత్వమే వారి రాజకీయాలకు పెట్టుబడి. 'అని విమర్శించారు. 'ఈ రోజుల్లో సాధువులు కూడా ప్రచారం కోరుకుంటున్నారంటూ తన తలపై రూ.10 కోట్లు ప్రకటించిన సాధువుపై ఉదయనిధి వ్యాఖ్యానించారు. అంతా త్యాగం చేసిన ఆ సాధువుకు రూ.10 కోట్లు ఎలా వచ్చాయంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అమానవీయ విశ్వాసాలపైనే..: స్టాలిన్

సనాతన ధర్మంపై తన కొడుకు, మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై రేగుతున్న దుమారంపై సీఎం స్టాలిన్ స్పందించారు. సనాతన ధర్మంలో భాగమైన అమానవీయ సిద్ధాంతాలపైనే ఉదయనిధి మాట్లాడారని చెప్పారు. వీటి ఆధారంగా ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.

డీఎంకే వ్యాఖ్యలను ఒప్పకోం

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజా చేసిన వ్యాఖ్యలతో తాము ఏకీభవించబోమని కాంగ్రెస్ పేర్కొంది. అన్ని మతాలకు సమాన గౌరవం(సర్వధర్మ సమభావ) భావననే తమ పార్టీ విశ్వసిస్తుందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖెరా స్పందిస్తూ..'సమధర్మ సమభావమనే దానినే కాంగ్రెస్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుంది, ప్రతి మతం, ప్రతి విశ్వాసాలకు ఇందులో సమస్థానం ఉంటుంది. ఎవరూ ఎవరినీ తక్కువగా చూడరు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కూడా సమ్మతించదని అన్నారు.

విద్వేషాలు తొలిగేదాకా యాత్ర: రాహుల్

విద్వేషాలు తొలిగిపోయి భారత్ ఏకమయ్యేదాకా తన యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. భారత్ జోడో యాత్ర ప్రారంభమై గురువారం ఏడాది పూర్తయిన సందర్భంగా రాహుల్ స్పందించారు. నాలుగు వేల కిలోమీటర్ల పైచిలుకు సాగిన తన పాదయాత్ర తాలూకు వీడియో ఫుటేజిని ఎక్స్‌లో పంచుకుంటూ.. 'ఈ యాత్ర కొనసాగుతుంది. ఇది నా ప్రామిస్' అని రాహుల్ పేర్కొన్నారు. భారత్ జోడోయాత్రలో రాహుల్ 12 బహిరంగ సభల్లో, 100 పైచిలుకు రోడ్డు కార్నర్ మీటింగ్‌లలో, 13 విలేకరుల సమావేశాల్లో పాల్గొన్నారు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



విద్యార్థినులే శాస్త్రవేత్తలు
రావెప్‌లో భాగంగా వ్యవసాయ విద్యార్థినులు నాలుగు నెలలపాటు గ్రామాల్లో బస చేయనున్నారు. కరీంనగర్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. - 8లో▸



ఇండియా పేరు తొలగించొద్దు
కేంద్రం ఇండియా పేరు తొలగించి భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాల ను విరమించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'ఆరెపల్లి'పై వదంతులు నమ్మొద్దు

కరీంనగర్: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నారనే వదంతులను నమ్మొద్దని, సీఎం కేసీఆర్ సారథ్యంలోనే ఆయన పని చేస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ.రామకృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల లిస్టులో మానకొండూర్ నుంచి చోటుదక్కలేని ఆరెపల్లి అలకబూని బీఆర్ఎస్‌ను వీడుతున్నారన్న ప్రచారం అబద్ధమన్నారు. ఆయన సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌లకు బాసటగా నిలుస్తూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించేనా?
బీఆర్ఎస్ రాష్ట్రస్థాయి నేతలు ఆరెపల్లి మోహన్‌తో జరిపిన చర్చలు సఫలమైనట్లు సమాచారం. ఇటీవల ఖాళీ అయిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చేందుకు హామీ లభించడంతో బీఆర్ఎస్‌ను వీడే నిర్ణయాన్ని మార్చుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. సర్పంచ్‌గా, జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, సీనియర్ దళిత నాయకుడిగా పేరొందిన ఆరెపల్లికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టేందుకే పార్టీ అధిష్టానం సిద్ధపడుతున్నట్లు తెలిసింది. ఇదివరకు చైర్మన్‌గా ఉన్న హుజూరాబాద్‌కు చెందిన బండ శ్రీనివాస్ పదవీ కాలం గత జూలై 30తో ముగిసింది.

ఔట్‌సోర్సింగ్ పీఎస్‌ల క్రమబద్ధీకరణకు కృషి



కరీంనగర్ అర్బన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు టీఎన్జీవోల సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం కేంద్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో కార్యదర్శులు ఆయనను కలిసి, తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ అయి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నవారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పని చేసిన కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలన్నారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు రాగి శ్రీనివాస్, గంగారపు రమేశ్ తదితరులున్నారు.



సిరిసిల్ల ట్రెయిన్ 21 కి.మీ. దూరంలో ఉన్నది!

- వడివడిగా మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్ పనులు
- ఇటీవల సిద్దిపేట వరకు వచ్చిన రైలు
- త్వరలో సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లో స్టేషన్లు
- ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదుల నిర్మాణానికి టెండర్లు
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు చర్యలు

కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గం విశేషాలు

- మార్గంలో విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్
- మార్గాన్ని ఆనుకొని ఉన్న గ్రామాలు: 70
- ఈ రూట్‌లో మొత్తం రైల్వే స్టేషన్లు :15
- పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు.
- మొత్తం పొడవు 151.36 కి.మీ.
- మెదక్ జిల్లాలో 9.30 కి.మీ.
- సిద్దిపేట జిల్లాలో 83.40 కి.మీ.
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో 37.80 కి.మీ.
- కరీంనగర్ జిల్లాలో 20.86 కి.మీ.
- ఇప్పటి వరకు పూర్తయిన మార్గం 77 కి.మీ.


ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..
వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2006–07లో 151 కి.మీ కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం రూ.1,167 కోట్ల అంచనా వ్యయం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో రైల్వే పనులు ఊపందుకున్నాయి. కొత్తపల్లి– మనోహరాబాద్ లైన్ పనులు వడివడిగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే సిద్దిపేట వరకు రైలొచ్చింది. మిగిలిన రూట్లలోనూ పనులు స్పీడందుకున్నాయి. సిద్దిపేట తర్వాత గుర్రాలగొంది, చిన్నలింగాపూర్, సిరిసిల్ల స్టేషన్ల నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్లు జారీ చేసింది. ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, విద్యుత్ యార్డు తదితర పనుల కోసం టెండర్లు జారీచేశారు. మొత్తం టెండరు విలువ రూ. 5,30,27,277గా అధికారులు పేర్కొన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు టెండరు ముగింపు గడువుగా తెలిపారు. పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలని టెండరులో సూచించారు.

21 కి.మీ. దూరంలో పాత కరీంనగర్..
సిరిసిల్ల–సిద్దిపేట మధ్యలో 30 కి.మీ దూరానికి ట్రాక్ వేసేందుకు దాదాపు రూ.440 కోట్ల వ్యయంతో జనవరిలోనే దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులు పిలిచింది. తాజాగా సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లలోనూ స్టేషన్ నిర్మాణాలకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలవడంతో ఈ మార్గంలో జరుగుతున్న పనుల వేగానికి నిదర్శనం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వేలైను ప్రస్తుతం సిద్దిపేట వరకు పూర్తయింది. ఇటీవల సిద్దిపేటను రైలు కూడా పలకరించింది. సిద్దిపేట తర్వాతి స్టేషన్ గుర్రాలగొంది కేవలం 10 కి.మీ దూరంలో ఉంటుంది. గుర్రాలగొంది– చిన్నలింగాపూర్ మధ్య దూరం 11 కి.మీ. చిన్నలింగాపూర్–సిరిసిల్ల మధ్య 9.కి.మీ దూరం వస్తుంది. గుర్రాలగొంది సిద్దిపేట జిల్లా కాగా, చిన్నలింగాపూర్ సిరిసిల్ల జిల్లాలో ఉంటుంది. ఈ లెక్కన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే మార్గం పాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రవేశించేందుకు కేవలం 21.కి.మీల దూరంలో ఉంది.

77 కి.మీ. మేర పూర్తయిన మార్గం..
మనోహరాబాద్ –కొత్తపల్లి (కరీంనగర్) వరకు మొత్తం 151.36 కిలో మీటర్ల బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో ప్రస్తుతం సిద్దిపేట స్టేషన్ (77కి.మీ) వరకు లైన్ పూర్తయింది. ఇక్కడి నుంచి దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) వరకు ప్రస్తుతం పనులు వేగంగా నడుస్తున్నాయి. అక్కడ నుంచి కరీంనగర్ వరకు (151.36 కి.మీ) అంటే దాదాపు 44.48 కి.మీ వరకు ట్రాక్ పనులు సాగాలి. ఇవి 2025 మార్చి వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్లలో చేపట్టాల్సిన భూసేకరణకు అధికారులు ఇప్పటికే పచ్చజెండా ఊపారు. దక్షిణ మధ్యరైల్వే అడిగిన భూమిని ఇచ్చేందుకు సిరిసిల్ల కలెక్టర్ అనుమతించారు. భూసేకరణ విషయమై రైల్వే అధికారులతో సిరిసిల్ల–కరీంనగర్ కలెక్టర్లు పలు మార్లు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే జగిత్యాల, పెద్దపల్లి వాసులకు ఢిల్లీ, హైదరాబాద్ వెళ్లేందుకు రైలు అందుబాటులోకి వస్తుంది.



టీచర్ల బదిలీ దరఖాస్తులు 1,977

- 80 శాతానికి పైగా బదిలీ కానున్న ఉపాధ్యాయులు
- నేడు, రేపు ప్రైమరీ సీనియారిటీ లిస్టు
- 12, 13వ తేదీల్లో తుది జాబితా విడుదల

కరీంనగర్:

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, టీచర్ల పదోన్నతులు, బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల పర్వం ముగిసింది. ఈ నెల ఒకటో తేదీ నాటికి సర్వీసును కటాఫ్‌గా నిర్ణయిస్తూ 3వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కరీంనగర్ జిల్లా నుంచి జీహెచ్‌ఎంలు, ఎస్‌ఏలు, ఎస్జీటీలు హార్డ్ కాపీలను మండలాల పరిధిలోని కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అందించారు. విద్యాశాఖ లెక్కల ప్రకారం బదిలీల కోసం 1,977 మంది అర్జీ పెట్టుకున్నారు. దరఖాస్తుల్లో కొత్తవి 203 కాగా సవరించినవి 1,712, సవరించనివి 62 ఉన్నాయి. దరఖాస్తుదారుల్లో 80 శాతానికి పైగా టీచర్లు బదిలీ కానున్నారు.

జిల్లాలో 651 పాఠశాలలు..
జిల్లాలో పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలలు 651 ఉన్నాయి. వీటిల్లో 3,173 ఉపాధ్యాయ పోస్టులుండగా ప్రస్తుతం 2,786 మంది పని చేస్తున్నారు. 387 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 70 శాతం పోస్టులు పదోన్నతులు, 30 శాతం పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. మరో వైపు ప్రస్తుతం పని చేస్తున్న స్థానం నుంచి బదిలీ చేయాలని కోరుతూ జిల్లాలో మొత్తం 1,977 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. దీని ప్రకారం ప్రైమరీ సీనియారిటీ లిస్టును శుక్ర, శనివారాల్లో ప్రకటిస్తారు. తుది జాబితాను ఈ నెల 12, 13వ తేదీల్లో విడుదల చేస్తారు. తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తారు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, అయిదేళ్లు పూర్తి చేసుకున్న జీహెచ్‌ఎంలకు తప్పనిసరిగా బదిలీ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కేటగిరీలో దాదాపు 500 మంది ఉండనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఎంత మందికి బదిలీ అవకాశం ఉంటుందోనని ఉపాధ్యాయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

జీహెచ్‌ఎం ఖాళీలు

	లోకల్‌బాడీ (ఎల్‌బీ)	ప్రభుత్వ
జోన్ – 1		
1. కుమ్రంభీం	30	06
2. మంచిర్యాల	38	05
3. పెద్దపల్లి	35	01
4. భూపాలపల్లి	45	00
5. ములుగు	20	02
జోన్ – 2		
1. ఆదిలాబాద్	44	07
2. నిర్మల్	53	06
3.నిజామాబాద్	90	13
4.జగిత్యాల	89	09
జోన్ – 3		
1. కరీంనగర్	41	07
2. రాజన్న సిరిసిల్ల	52	00
3. సిద్దిపేట	63	06
4. మెదక్	62	06
5. కామారెడ్డి	111	05
జోన్ – 4		
1. భద్రాద్రి	36	07
2.ఖమ్మం	75	06
3. మహబూబాబాద్	38	00
4. హనుమకొండ	42	07
5. వరంగల్	33	04

పారదర్శకంగా నిర్వహిస్తాం



దరఖాస్తుల ఆధారంగా అర్హులైన టీచర్లకు బదిలీలు ఉంటాయి. పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. ఏవైనా సందేహాలు ఉంటే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి.
– జనార్దన్‌రావు, డీఈవో

ప్రత్యక్ష పద్ధతిలో బదిలీ చేపట్టాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్, పక్కన నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెబ్ అప్షన్స్ ద్వారా టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టడం వల్ల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందేవారు మల్టీజోన్‌లో 19 జిల్లాల్లో ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకోవడం చాలా కష్టమన్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ప్రత్యక్ష పద్ధతిలో ఈ ప్రక్రియ నిర్వహించడం వల్ల ఏ ఆందోళన లేకుండా పాఠశాలలను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్త జిల్లాల ఏర్పాటుతో టీచర్ల సంఖ్య తగ్గినందున ప్రత్యక్ష పద్ధతిలో మరింత సులభంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. పదోన్నతులు వద్దనుకునే ఉపాధ్యాయుల నుంచి అంగీకారం తీసుకొని, వారి తర్వాత ఉన్న సీనియర్లకు అవకాశం కల్పించాలన్నారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు సవరించి, కామన్ సీనియారిటీ లిస్టు ప్రకటించాలని కోరారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నమనేని రంగారావు, రాష్ట్ర కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు, బాధ్యులు బోట్ల రామస్వామి, పోలు సత్యం, వినయధర్ రాజు, హరిచరణ్, సత్యనారాయణ రావు, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

'భారత్ జోడో'కు అందరి మద్దతు



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి

కరీంనగర్‌టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశ ప్రజల సంపూర్ణ మద్దతు లభించిందని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. యాత్ర చేసి, ఏడాది పూర్తయిన సందర్భంగా ఏఐసీసీ పిలుపు మేరకు గురువారం కాంగ్రెస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలో భారత్ జోడో వార్షికోత్సవ పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్ర మన దేశంలోని ఏ రాజకీయ నాయకుడు చేయని సుదీర్ఘమైన పాదయాత్ర అన్నారు. 4,081 కిలోమీటర్లు నడిచి రాహుల్ గాంధీ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఈ యాత్ర కర్ణాటక ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందని, మన రాష్ట్రంతోపాటు మిగతా రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికలపైనా ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. నాయకులు మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు, రమ్యారావు, నవాబ్, రాహుల్, సత్యప్రసన్నరెడ్డి, శ్రవణ్‌కుమార్, అరుణ్‌కుమార్, కృష్ణారెడ్డి, ముస్తాక్ అహ్మద్, పద్మ, అనిల్, రాజమల్లయ్య, మోహన్, శకుంతల, రమణారెడ్డి, అనిల్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

గిర్దావర్లకు నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి

- కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 10 మందికి అవకాశం

కరీంనగర్ అర్బన్: రెవెన్యూలో పదోన్నతుల ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించగా తాజాగా గిర్దావర్లు, సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహసీల్దార్ పదోన్నతి లభించనుంది. రాజన్న జోన్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలో పోస్టింగ్ ఇవ్వనున్నారు. కరీంనగర్‌లో 10, రాజన్న సిరిసిల్లలో 4, కామారెడ్డిలో 12, సిద్దిపేటలో 4, మెదక్ జిల్లాలో 14 మొత్తం 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో 10 మందికి పదోన్నతి ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. రోస్టర్ పాయింట్‌ను పరిగణలోకి తీసుకుంటే మరో ఆరుగురిని పదోన్నతి వరించనుంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో పనిచేసే సురేందర్, ప్రణీత్, మన్మిత్‌సింగ్, రాకేశ్, ఉష, సత్యనారాయణ, అరుణ్(చొప్పదండి)లకు దాదాపు ఖాయం కాగా రోస్టర్ పాయింట్ ప్రకారమైతే శివ, రమేశ్, సంపత్, సంతోష్‌లకు ప్రమోషన్ రానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూపేశ్, స్వరూప, విజయభాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రహీంలకు పక్కా కాగా ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటే యాదగిరి, రమ్యలకు నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి వరించనుంది. ఇదిలా ఉండగా 2014, 2015 సంవత్సరాల్లో గిర్దావర్లుగా పదోన్నతి పొందినవారికి ఏడాది క్రితం నాయబ్ తహసీల్దార్‌గా పదోన్నతి కల్పించడం విశేషం. కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల వారికి పదోన్నతులు రాగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వారిని విస్మరించారు. ఇక్కడ 2013లో గిర్దావర్లుగా పదోన్నతి పొందిన వారికి అవకాశం లభించలేదు. కాగా, నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతి కల్పించి, నెల రోజులు కావస్తుండగా తక్షణమే అమల్లోకి రావాల్సి ఉండగా కసరత్తు పేరిట జాప్యం జరుగుతోంది. సర్టిఫికెట్లు, రేషన్ మూవ్‌మెంట్‌లో కీలకపాత్ర పోషించే నాయబ్ తహసీల్దార్లు లేక పరిపాలన కుంటుపడింది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ నెల 12న ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

ఇదీ నగరంలోని రోడ్డే..!



అధ్వానంగా తీగలగుట్టపల్లి–ఆరెపల్లి మెయిన్ రోడ్డు

కరీంనగర్ కార్పొరేషన్‌లోని విలీన డివిజన్లలో ప్రధాన రోడ్లు సహనానికి పరీక్ష పెడుతున్నాయి. నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి నుంచి ఆరెపల్లి, సీతారాంపూర్, ఎస్ఆర్ఆర్ కళాశాల వైపు వెళ్లే మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. అసలే మట్టిరోడ్డు, ఆపై వర్షాలు కురుస్తుండడంతో గుంతలుగా మారి వాహనదారులను భయపెడుతోంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. తొమ్మిది నెలల క్రితం స్థానిక ప్రజల సహకారంతో ఈ రోడ్డును 40 ఫీట్లమేర విస్తరణ చేపట్టారు. అప్పటి నుంచి రోడ్డును నిర్మిస్తారని ఎదురుచూస్తున్నప్పటికీ పరిస్థితి మారడం లేదు. ముఖ్యమంత్రి హామీ పథకం కింద నిధులు కేటాయించినట్లు చెబుతున్నా.. ఆ పనులు ఎప్పటికి మొదలవుతాయో తెలియని పరిస్థితి ఉంది. మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
–కరీంనగర్ కార్పొరేషన్

- 9వ తరగతి నుంచి డిగ్రీ, ఆపైన విద్యార్థులను కేటగిరీలుగా విభజన
- నామినేషన్లకు 11 వరకు గడువు
- ప్రతిభ కనబరిస్తే నగదు ప్రోత్సాహకాలు

ఓటుపై అవగాహనకు పోటీలు

కరీంనగర్ అర్బన్: ఓటరుగా నమోదు, ఓటుహక్కు వినియోగంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఎన్నికల అధికారులు వీలైనన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రధానంగా యువత ఎన్నికల్లో భాగస్వాములవడంతోపాటు ఓటరు నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నది ఎన్నికల సంఘం ఉద్దేశం. ఈ నేపథ్యంలో కలెక్టర్ బి.గోపి ప్రోత్సాహక బహుమతులు ఇస్తూ యువతను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా స్కిట్‌లు, కవితలు, పాటల రచన పోటీలను వేర్వేరుగా హైస్కూల్ టు ఇంటర్, డిగ్రీ కళాశాలల స్థాయిలో నిర్వహించనున్నారు. ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. ప్రతిభావంతులకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

వేర్వేరుగా పోటీల నిర్వహణ
స్కిట్ పోటీలకు 9 నుంచి 12వ తరగతి చదువుతున్నవారిని ఒక కేటగిరీగా, డిగ్రీ ఆపైన చదువుతున్నవారిని ఒక కేటగిరీగా నామినేషన్లు తీసుకోనున్నారు. స్కిట్‌లు పట్టణ యువ ఓటర్లు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొనేలా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, నైతికంగా ఓటు వేయడం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసే విధానాలపై అవగాహన కలిగించేవిగా ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలతోపాటు సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. స్కిట్‌లు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషలలో దేనిలోనైనా వేయవచ్చు. ఎంపిక చేసిన వాటిని రాష్ట్రస్థాయికి పంపించనున్నారు. అక్కడ ఎంపికైతే ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.12 వేలతోపాటు సర్టిఫికెట్లు అందజేస్తారు. అలాగే 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పద్యాలు, కవితలు, పాటల రచన పోటీలు నిర్వహిస్తుండగా వీటిలో జిల్లా స్థాయిలో ప్రథమ రూ.5 వేలు, ద్వితీయ రూ.4 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలు, సర్టిఫికెట్లు ఇవ్వనున్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో ప్రథమ రూ.10 వేలు, ద్వితీయ రూ.8 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, సర్టిఫికెట్లు అందించనున్నారు. జిల్లాలోని 9, 10వ తరగతి విద్యార్థులు తమ పేర్లను తమ పాఠశాల ద్వారా డీఈవోకు, ఇంటర్ విద్యార్థులు తమ కళాశాల ద్వారా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు ఈ నెల 11వ తేదీలోపు పంపాలని కలెక్టర్ సూచించారు. వీరంతా స్కిట్, కవితలు, పాటలు, పద్యాల రచన విభాగంలో పోటీ పడవచ్చని, డిగ్రీ విద్యార్థులు మాత్రం స్కిట్ విభాగంలోనే పోటీ పడాల్సి ఉంటుందని, తమ కళాశాలల ద్వారా కలెక్టరేట్ కార్యాలయంలోని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయాలనికి పేర్లు పంపించాలన్నారు.



కలెక్టర్ బి.గోపి

కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రదర్శన
హైస్కూల్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు తమ స్కిట్‌లను ఈ నెల 16న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రదర్శించనున్నారు. జిల్లాస్థాయిలో వచ్చిన అన్ని ఎంట్రీలను ఎన్నికల కమిటీ పరిశీలించి, ఎంపిక చేస్తుంది. విద్యార్థులు ఆయా కేటగిరీల్లో వీలైనంత త్వరగా నామినేషన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

తండ్రి చితికి నిప్పంటించిన కూతురు



సైదాపూర్: మండలంలోని ఘనపూర్‌కు చెందిన బెల్లం రాజమల్లు(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ, గురువారం ఇంటి వద్దే మృతి చెందాడు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కూతురు పుష్పలత తండ్రి చితికి నిప్పంటించి, అంత్యక్రియలు పూర్తి చేసింది.

యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖనిలోని పరుశరాంనగర్‌కు చెందిన టంగుటూరి గోపాలకృష్ణ (29) గురువారం ఉరేసుకుని మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం గోపాలకృష్ణ తల్లి, తండ్రి మృతిచెందారు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయి తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి నాయినమ్మ టంగుటూరి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద ఓ భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రాడ్‌కు గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం అని తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

పెగడపల్లి(ధర్మపురి): పెగడపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 80 ఏళ్ల వయస్సు గల బైర మల్లవ్వ రేకుల షెడ్డులో ఒంటరిగా నిద్రిస్తుండగా, అర్ధరాత్రి దొంగ ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న తులం బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. గురువారం మల్యాల సీఐ కోటేశ్వర్, కొడిమ్యాల ఎస్సై వెంకట్‌రావు, ఏఎస్సై సత్తయ్య, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరుపై బాధితురాలిని సీఐ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పర్శరాం



సప్తగిరికాలనీ(కరీంనగర్): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన కోడూరి పర్శరాంను నియమించారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం ఆయనకు నియామక పత్రం అందించారు. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి పాటుపడతానని, బీసీల సమస్యలపై పోరాటం చేస్తానని పర్శరాం తెలిపారు.

వ్యవసాయ విద్యార్థినులే శాస్త్రవేత్తలు

- రావెప్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎంపిక
- నాలుగు నెలలపాటు క్షేత్రస్థాయి పాఠాలు
- రైతులకు సలహాలు, సూచనలు
- 12 బృందాలు.. మండలానికో గ్రామం ఎంపిక
- విత్తు దశ నుంచి కోత వరకు పరిస్థితులపై నివేదిక



విద్యార్థినులకు సూచనలిస్తున్న కరీంనగర్ ఏరువాక సమన్వయకర్త డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి

కరీంనగర్ అర్బన్: అవును.. విద్యార్థినులే శాస్త్రవేత్తలుగా సలహాలు, సూచనలు అందించనున్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా వ్యవసాయ విద్యార్థినులు 4 నెలలపాటు గ్రామాల్లోనే బస చేయనున్నారు. కరీంనగర్ ఏరువాక ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించగా రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎంపిక చేశారు. ఇప్పటికే వారు రైతులతో మమేకమయ్యారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల వ్యవసాయ కళాశాలలకు చెందిన మొత్తం 51 మందికి గాను 4 నుంచి 5గురు విద్యార్థినులతో 12 బృందాలున్నాయి. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయగా ఆయా గ్రామాల్లో బస ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎప్పటికప్పుడు సహాయ సహకారాలను అందించనుండగా నవంబర్ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విత్తనాలు వేయడం నుంచి కోత వరకు..

ఒక్కో విద్యార్థినికి ఒక్కో రైతును అటాచ్ చేయగా వివిధ రకాల విత్తనాలు వేసిన నుంచి పంట కోత వరకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. విత్తన ఎంపిక, శుద్ధితోపాటు పంటలకు ఆశించే చీడపీడల నివారణ, దిగుబడులు ఎక్కువగా వచ్చేందుకు అనుసరించాల్సిన యజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తల సూచనల ప్రకారం ఫీల్డ్‌లో అమలు చేయనున్నారు. పంట వివిధ దశల ప్రక్రియ ఎలా ఉంది? లోపం ఎక్కడుంది? వంటి వివరాలపై ప్రాజెక్టు తయారు చేస్తారు. ఎరువుల యాజమాన్యం, క్రిమిసంహారక మందుల వినియోగం పొదుపుగా జరిగేలా సూచనలు ఇవ్వనున్నారు. అలాగే ఏ గ్రామంలో సేవలందిస్తున్నారో ఆ గ్రామ నైసర్గిక స్వరూపంతోపాటు వనరులను వివరిస్తూ డయాగ్రామ్ రూపొందించనున్నారు.

యూట్యూబ్, టోల్‌ఫ్రీ సేవలపై ప్రచారం

రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించేలా ఇంటర్నెట్ సేవలపై అవగాహన కల్పించనున్నారు. రైతు వేదికలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రదర్శించి, ఏరువాక సూచనలను రైతులకు వివరించి, సమస్యలను పరిష్కరించనున్నారు. గ్రామీణ విశ్లేషణాత్మక తులనం(పీఆర్ఏ)లో భాగంగా గ్రామ భౌగోళిక, పోస్టాఫీస్, బ్యాంకులు, ఇతరత్రా అంశాలపై పంట క్షేత్రాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. యూట్యూబ్ ఛానల్ 'పీజేటీఎస్ఎయూ'లో అగ్రికల్చర్ యూనివర్సిటీ వీడియోలు ఉండనుండగా అథెంటిక్‌గా రూపొందించారు. ప్రధాన శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు చూసుకోవచ్చు. వరి, పత్తి, మొక్కజొన్న, పెసలు, మినుములు, తృణధాన్యాలపై వీడియోలు ఉండనున్నాయి. అలాగే కిసాన్ సారథి టోల్‌ఫ్రీ నంబర్ 14426 లేదా 18001232175 ఫోన్ చేసి, రైతులు తమ సమస్యలను వివరిస్తే పరిష్కారం చూపనున్నారు. ఇక వ్యవసాయ వర్సిటీలు రూపొందించిన విత్తనాలను రైతుల క్షేత్రాల్లో ప్రాక్టికల్‌గా పరీక్షించి, ఎదుగుదల, పెట్టుబడి, నికర ఆదాయం తదితరాలపై నివేదించనున్నారు.

ఎంపికైన గ్రామాలు ఇవే..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తపల్లి(గంభీరావుపేట మండలం), ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ఆవునూరు (ముస్తాబాద్), నిజామాబాద్(కోనరావుపేట), మారుపాక(వేములవాడ అర్బన్), మల్లారం(వేములవాడ రూరల్), మూడపల్లి(చందుర్తి), రుద్రంగి, వెంకట్రావ్‌పల్లి(బోయినపల్లి) గ్రామాలను ఎంపిక చేశారు.

నాలుగు నెలలపాటు సేవలు

వ్యవసాయ విద్యార్థినులకు తరగతి బోధనలతోపాటు ప్రాక్టికల్ అవగాహన అవసరం. అందుకే నాలుగు నెలలపాటు పంట పొలాలు, రైతుల మధ్య తిరుగుతూ నివేదికలు, మ్యాప్‌లు రూపొందించాల్సి ఉంటుంది. అలాగే యూట్యూబ్, టోల్ ఫ్రీ సేవలను రైతులకు వివరిస్తారు. పంట వేసిన నుంచి కోత వరకు పరిస్థితులను గమనించి, అక్షరీకరిస్తారు.

– కె.మదన్‌మోహన్‌రెడ్డి, కరీంనగర్ ఏరువాక సమన్వయకర్త

ఇండియా పేరు తొలగించొద్దు



అభివాదం చేస్తున్న ప్రవీణ్‌కుమార్, నాయకులు

- జమిలి ఎన్నికలు సరికాదు
- ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశం పేరును ఇండియాగా తొలగించి భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల మూడో వారంలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి రాజ్యాంగ సవరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజ్యాంగంలో ఇండియా.. అలాగే భారత్‌గాను దేశం పేరును వాడుకలో ఉంచేలా రాజ్యాంగంలో పొందుపర్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జమిలి ఎన్నికల అంశాన్ని బీజేపీ వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చిందన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు బీఎస్పీ వ్యతిరేకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీల ప్రాబల్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతోనే జమిలి అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. నాయకులు దాసరి హనుమయ్య, దాసరి ఉష, రాజు, వెంకటేశ్, రియాజ్ తదితరులున్నారు.

360 మామిడి మొక్కలు ధ్వంసం



మొక్కలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లిలో ముగ్గురు మహిళా రైతులకు చెందిన 360 మామిడి మొక్కలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామస్తుల వివరాలు.. రేచపల్లి గ్రామానికి చెందిన రేండ్ల లక్ష్మి, రేండ్ల పుష్ప, రేండ్ల సరిత భర్తలు ముంబయిలో కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారు ముంబయి వెళ్లడంతో వరిపొలాలు సాగుచేయడం ఇబ్బందిగా మారింది. దీంతో మామిడి మొక్కలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. 15 రోజులుగా భూమిని చదును చేసి, గుంతలు తవ్వి 360 మామిడి మొక్కలు (రెండున్నర సంవత్సరాల వయస్సు గల మొక్కలు) నాటారు. పైప్‌లైన్లు, డ్రిప్ సైతం ఏర్పాటు చేయించుకున్నారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి విచ్చలవిడిగా మామిడి మొక్కలను, పైప్‌లైన్లు, డ్రిప్‌ను ధ్వంసం చేశారు. తమకు లక్షల రూపాయల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎల్ఎండీలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఎల్ఎండీలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని కరీంనగర్ లేక్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని మారుతీనగర్‌కు చెందిన మహమ్మద్ అయూబ్ ఖాన్ కుటుంబ కలహాలతో విసుగు చెందాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకొని, గురువారం ఎల్ఎండీలో దూకాడు. అక్కడే గస్తీలో ఉన్న లేక్ అవుట్ పోస్ట్ ఆర్ఎస్సై సురేశ్, కానిస్టేబల్ మహమ్మద్ గౌస్ గమనించి, వెంటనే అతన్ని కాపాడారు. అనంతరం కుటుంబసభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ నిర్వహించి, పంపించారు. లేక్ పోలీసులను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

వలస కార్మికులకు తక్కువ కూలీ చెల్లింపు



మాట్లాడుతున్న శంకర్

జమ్మికుంట(హుజూరాబాద్): వలస కార్మికులకు తక్కువ కూలీ చెల్లిస్తూ గుత్త మేస్త్రీలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ఆరోపించారు. జమ్మికుంట పట్టణంలోని సంఘం కార్యాలయంలో గేరా రాజకుమారి అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో గుత్త మేస్త్రీలు ఏజెంట్లను నియమించుకొని, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి తక్కువ కూలీ చెల్లిస్తున్నారని, కొందరికి కూలీ డబ్బులు ఎగవేస్తున్నారని అన్నారు. ఎక్కువ గంటలు పని చేయించి, యాజమానుల నుంచి కూలీ రేట్లు పెరిగాయిని ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తూ కూలీల వద్ద కమీషన్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వలస కార్మికులను కార్మిక శాఖ పరిధిలో నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు బండ సురేశ్, రమేశ్, నవీన్, పుష్ప, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కరీంనగర్: తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని, నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగులకు జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. మహిళ ఉద్యోగులందరికీ 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీయూటీఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శనిగరపు రవి, టీపీయూఎస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌చందర్ రెడ్డి, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాద్రి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ తిరుపతి, వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ నరహరి లక్ష్మారెడ్డి మద్దతు తెలిపారు.

కోర్టుకు నాలుగుసార్లు గైర్హాజరవడం ఏమిటి?

- మంత్రి గంగుల, ఎంపీ బండి మధ్య చీకటి ఒప్పందం
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్



మాట్లాడుతున్న డాక్టర్ నగేశ్

విద్యానగర్(కరీంనగర్): మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ల మధ్య జరిగిన చీకటి ఒప్పందం కారణంగానే ఎంపీ హైకోర్టుకు గైరాజరయ్యారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల్లో మంత్రి గంగుల తన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు తప్పుగా ప్రకటించారని, ఆయన ఎమ్మెల్యే పదవిని రద్దు చేయాలంటూ ఎంపీ బండి హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. విచారణ తుది దశకు వచ్చాక హైకోర్టుకు నాలుగుసార్లు గైరాజవడంలో మర్మమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తి ఆయనకు రూ.50 వేల జరిమానా విధించారని, దీనిపై కరీంనగర్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ నెల 29న తప్పనిసరిగా హాజరు కావాలని డిమాండ్ చేశారు. శ్వేత గ్రానైట్ వ్యాపారంతో తనకు సంబంధం లేదని చెప్పుతూనే ఈడీకి సరైన సమాచారం ఇవ్వడానికి సిద్ధమని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ, దళిత, మైనారిటీ బంధు పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకే వర్తింపజేయడం దుర్మార్గమని మండిపడ్డారు. నాయకులు ఎండీ.ఆరిఫ్, సయ్యద్ అజారుద్దీన్, ఎండీ.మీర్జా, సయ్యద్ ఖలీద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అజయ్

కరీంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెంట అజయ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, శాతవాహన యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించాలన్నారు. కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు–మన బడి పథకం కింద చేర్చాలని, కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాలని కోరారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీకి సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలన్నారు. తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గరిగే కోటేశ్వర్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రావర్తి వికాస్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మానకొండూరు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కాల్వ కిషన్, తిమ్మాపూర్ మండల ఉపాధ్యక్షుడు కాల్వ రవి, కేశవపట్నం మండల ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు కట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన ఉషకు స్థానికుడైన చిలుక శ్రీకాంత్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా అదనపు కట్నం రూ.5 లక్షలు తీసుకురావాలని భర్త శ్రీకాంత్, అత్తామామ శోభ, భాస్కర్, బావ రాజు, మరిది మహేశ్‌లు ఉషను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేరకు ఆమె అత్తింటివారిపై అదనపు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సిరిసేడులో భర్త, అత్తపై..

ఇల్లందకుంట(హుజూరాబాద్): అదనపు కట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీరాములపల్లి గ్రామానికిచెందిన మానసను 2015లో ఇల్లందకుంట మండలంలోని సిరిసేడుకు చెందిన రమేశ్‌కు ఇచ్చి, పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఒప్పుకున్న మేరకు రూ.7 లక్షల కట్నం ఇచ్చారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా భర్త రమేశ్, అత్త లక్ష్మి అదనపు కట్నం కోసం మానసను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రామానుజమ్మ

- మలేషియాలో జరిగే పోటీలకు హాజరు
- 70 ఏళ్ల విభాగంలో తలపడనున్న సిరిసిల్ల బామ్మ



రామానుజమ్మ

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ(70) అంతర్జాతీయ స్థాయిలో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరుకానుంది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 16, 17 తేదీల్లో జరిగే 35వ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. 50 కిలోలు.. 70 ఏళ్ల విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెంలో తలపడనుంది. ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించింది. జాతీయస్థాయిలో 70 ఏళ్ల విభాగంలో రాణించిన రామానుజమ్మను అంతర్జాతీయ పోటీలకు దేశం తరపున ఎంపిక చేసినట్లు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఇండియా సెక్రటరీ జనరల్ రాంపాల్‌శర్మ గురువారం ప్రకటించారు. పరుగుపందెంలో అంతర్జాతీయ పోటీలకు ఎంపికవడంపై రామానుజమ్మ మాట్లాడుతూ తనకు సహకరించిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్‌గౌడ్, కల్లెం మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చీటీ నర్సింగరావు, కార్యదర్శి గొట్టిముక్కల శేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సిరిసిల్ల వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి విషయమై వివాదం.. అంత్యక్రియలకు బ్రేక్

- మృతదేహాన్ని మార్చురీకి తరలించిన బసంత్‌నగర్ పోలీసులు
- పెద్దపల్లి మండలం సబ్బితంలో ఘటన

పెద్దపల్లిరూరల్: అనాథైన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మరణించగా.. ఆమె ఆస్తి తమకే చెందాలంటూ తోబుట్టువుల కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. వారి ఘర్షణతో వృద్ధురాలి అంత్యక్రియలు నిలిచిపోయాయి ఈ ఘటన పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెర్క కనకమ్మ, బాలయ్య దంపతులకు సంతానం లేరు. ఐదేళ్ల క్రితం బాలయ్య మరణించాడు. కనకమ్మ సుల్తానాబాద్‌లోని తన సోదరి కూతురు ఇండ్ల పద్మ వద్ద కొంతకాలంగా ఉంటోంది. ఈ క్రమంలో కనకమ్మ పేరిట ఉన్న వ్యవసాయ భూమిని పద్మ అమ్ముకుందని, ఇంటి స్థలాన్ని కూడా పట్టా చేసుకుందని గ్రామస్తులు అంటున్నారు. ఈ క్రమంలో కనకమ్మ గురువారం అస్వస్థతకు గురికాగా సబ్బితం గ్రామానికి తీసుకొచ్చారు. కొద్దిసేపటికే ఆమె చనిపోగా.. అంత్యక్రియలకు గ్రామశివారులో ఏర్పాట్లు చేశారు. దీంతో కనుకమ్మ భర్త బాలయ్య తోబుట్టువులు పెర్క రాయమల్లు, రాజలింగు తమకు మృతురాలి ఆస్తిలో వాటా వస్తుందంటూ వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆస్తి విషయంలో అనుమానాలు ఉండడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో అంత్యక్రియల కోసం తవ్వించిన గోతిని పూడ్చివేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఫిర్యాదు అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట వసూలు..?

- ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు
- కాంట్రాక్టర్ మారితే పరిస్థితి ఏమిటో?



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్ కర్మాగారంలో ఉద్యోగాల పేరుతో 22 మంది నుంచి రూ.2లక్షల చొప్పున తీసుకున్నారని సమాచారం. గతంలో కూడా ఇలాగే కొందరు కొలువు పెట్టిస్తామని వసూలు చేయగా.. కాంట్రాక్టర్ మారడంతో సుమారు 480 మందిని తొలగించిన విషయం తెల్సిందే. వీరిలో ముంజ అశోక్ అనే కార్మికుడు అటు డబ్బులు రాక.. ఇటు ఉద్యోగం లేక 2022 ఆగస్టు 27న కమాన్‌పూర్ శివారులో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరవకముందే కొందరు మరోసారి డబ్బులు వసూలు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. కర్మాగారంలో పార్క్ మెయింటనెన్స్, హౌస్‌కీపింగ్ ఉద్యోగాల్లో రూ.2 లక్షలు చొప్పున వసూలు చేసి 22 మందిని నెలకు రూ.12,800 వేతనానికి పనిలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్ మారితే వీరిని తొలగించడం ఖాయమని, అప్పుడు వీరి పరిస్థితి ఏమిటని, వారికి డబ్బులు తిరిగి ఎవరిస్తారనే చర్చ జరుగుతోంది. సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు శాశ్వతం కాదని, కాంట్రాక్టు ఉద్యోగాల పేరుతో ఎవరైనా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని యాజమాన్యం నోటీసు బోర్డులు ఏర్పాటు చేసింది.

వసూళ్లకు పాల్పడలేదు

పెద్దపల్లిరూరల్: కర్మాగారంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూళ్లకు పాల్పడలేదని పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన శ్రీరాముల గోపాల్ తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖలో తన పేరు ఉండడం మానసికంగా ఇబ్బంది కలిగించిందన్నారు. తాను భూకబ్జాలకు పాల్పడలేదని, పంచాయితీల పేరిట ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని, ఏ విచారణకైనా సిద్ధమన్నారు.


ప్రత్యేకాలంకరణలో శ్రీకృష్ణుడు


రాంనగర్‌లోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో..


మురళీకృష్ణ మందిరంలో స్వామివారిని దర్శించుకున్న మేయర్ సతీమణి అపర్ణ

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయినగర్‌లోని మురళీకృష్ణ మందిరంలో మేయర్ సతీ మణి అపర్ణ రావు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయిమందిరంలో సాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. వేదభవనంలో శ్రీకృష్ణుడికి అభిషేక, అలంకరణ అర్చనలు నిర్వహించారు. రాంనగర్‌లోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి, శ్రీఅభయాంజనేయ ఆలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశంకర్, ఆలయ గౌరవ అధ్యక్షులు మల్లికార్జున, రాజేందర్, చైర్మన్ చల్ల హరికృష్ణ, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం భవన్‌లో..

కరీంనగర్: యాదవ సంఘం భవన్‌లో గురువారం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారం సత్యనారాయణయాదవ్ మాట్లాడుతూ యాదవుల కులదైవమైన కృష్ణుని పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. నూతనంగా అధ్యక్షుడైన తర్వాత మొదటిసారి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్పొరేటర్ జంగిల్ ఐలందర్‌యాదవ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, కాల్వ మల్లేశంయాదవ్, యూత్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్, వేణు, పర్శరాం, తదితరులు పాల్గొన్నారు.

పలు విద్యా సంస్థల్లో..

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు గోపికలు, శ్రీ కృష్ణుని వేషధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమంలో విద్యార్థులందరూ సంబురంగా పాల్గొని సందడి చేశారు. పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాలల చైర్మన్లు, కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, కృష్ణుడి వేషధారణ తో సందడి చేశారు.ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.


వేద భవనంలో..


కృష్ణుని వేషధారణలో చిన్నారి


సప్తగిరి పాఠశాలలో..


విద్యాధారి పాఠశాలలో..


యాదవ సంఘం భవన్‌లో..


చెర్లభూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..


హగ్స్ అండ్ హార్ట్స్ స్కూల్‌లో..

కొత్తపల్లి బస్టాండ్.. గుంతలమయం



కొత్తపల్లి(హెచ్) బస్టాండ్ బురద గుంతలమయంగా మారింది. వర్షం పడితే చాలు వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. దీనికి తోడు బస్టాండ్ నుంచి కొక్కెరకుంట వెళ్లే మార్గం కూడా గుంతలమయం కావడంతో రోడ్డు దాటాలంటేనే కష్టతరంగా పరిణమించింది. కొత్తపల్లి నుంచి కొక్కెరకుంట, వొన్నారం, మోతె, రామడుగు తదితర ప్రాంతాలకు ఈ మార్గం గుండా వాహనాలు వెళ్తుంటాయి. ఈ వాహనాల రాకపోకలతో గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ నగర పాలక సంస్థ పాలకమండలి, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ స్పందించి కనీస మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – కొత్తపల్లి

రేపు సీనియర్స్ జూడో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: జూడో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో గల జూడో అకాడమీలో జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల జూడో జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడారి అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు 60, 66, 73, 81, 90, 100 కేజీలు ఆపైన, మహిళలు 48, 52, 57, 63, 70, 78 కేజీలు ఆపైన విభాగాల్లో పోటీలు జరపనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 2008లోపు పుట్టినవారు అర్హులన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన వారిని ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే 8వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మధ్యాహ్నం 1 గంటకు జూడో అకాడమీలో రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 99498 30494 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ముస్లింలు బీఆర్‌ఎస్ పక్షానే ఉండాలి

విద్యానగర్(కరీంనగర్): ముస్లింలందరూ బీఆర్‌ఎస్ పక్షాన ఉండాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాఖ్ అన్నారు. గురువారం నగరంలోని ఎంఐఎం కార్యాలయం దారుస్సలామ్‌ను సందర్శించారు. సీఎం కేసీఆర్, ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ చొరవ వల్లనే మైనార్టీ బంధు పథకానికి అంకురార్పణ జరిగిందని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులైన మైనార్టీలందరికీ ఈ పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని, త్వరలోరెండో విడత చెక్కులు అందిస్తామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ ఇసాఖ్‌ను నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, నాయకులు అబ్బాస్ సమీ, బర్కత్ అలీ, మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఖాజా, ఖమరుద్దీన్, ఇబ్రహీం, కార్పొరేటర్ ఫిరోజ్ అఖీల్ తదితరులు పాల్గొన్నారు.


ఇంతియాజ్ ఇసాఖ్‌ను సత్కరిస్తున్న నాయకులు

బెస్ట్ టీచర్స్ అవార్డుల ప్రదానం

సప్తగిరికాలనీ: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని స్వదేశీ సేవా దిగ్గజం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నగరంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో గురు వారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను సత్కరించారు. అలయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ అంతర్జాతీయ కమిటీ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని అవయవాలు బాగున్న పిల్లలకు బోధించడమే కష్టతరంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు చదువును బోధిస్తున్న ఉపాధ్యాయులను ఈఏడాది ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు సౌత్ ఇండియా చైర్మన్ కోల అన్నారెడ్డి, జిల్లా గవర్నర్ నాగేశ్వర్, పాఠశాల ట్రస్టీ సముద్రాల జనార్దన్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రోజాదేవి, అలయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం


మాట్లాడుతున్న కర్ర సత్యప్రసన్నరెడ్డి

కరీంనగర్‌టౌన్: ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సంఘం వారం రోజులుగా చేపట్టిన నిరసన దీక్షలకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి సంఘీభావం తెలిపారు. గురువారం శిబిరం వద్దకు వెళ్లి ఉద్యోగులకు భరోసా కల్పించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న చైర్మన్ రాజు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ పరిధిలోని 5వ వార్డులో రూ.16 లక్షలు, 3వ వార్డులో రూ.10 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు భూమిపూజ చేశారు. కౌన్సిలర్ మానుపాటి వేణుగోపాల్, జేరిపోతుల మొండయ్య, కో ఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న ఏసీపీ ప్రతాప్

కరీంనగర్: నగరంలోని సాలి ప్రభుదాస్ మెమోరియల్ బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు గురువారం హెల్ప్ ది నీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, బ్లాక్ బోర్డు, చాక్ పీసులు, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ ప్రతాప్ హాజరై వస్తువులను అందజేసి ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కొలుగూరి ప్రసన్న కుమార్, సిరిసేటి రాకేశ్, మెర్లిన్‌నిస్సి, ఆదిత్య, ఆస్కార్, పాస్టర్ తియోతి జయరాజ్, సోలోమెన్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు ఉద్యమించాలి

కరీంనగర్: తెలంగాణ సాయుధ పోరాటాన్ని పెను తుపానుల హోరెత్తించిన విప్లవ వీరుడు రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. నారాయణరెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో గురువారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు వందల ఎకరాల సొంత భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిన మహనీయుడు నారాయణరెడ్డి అని అన్నారు. తెలంగాణ విముక్తి కోసం సాయుధ పోరాటానికి సారథ్యం వహించి నిజాం సర్కార్‌ను తుద ముట్టించేందుకు ఉప్పెనలా పైకెగసి గుండెను కాగడగా వెలిగించి రైతాంగ గెరిల్లా సైనికులకు తెలంగాణ వెలుగు దారి చూపించి విజయఢంకా మోగించిన విప్లవ వీరుడని కొనియాడారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి నుంచి లోక్‌సభకు పోటీ చేసి అధిక మెజారిటీ సాధించారని తెలిపారు. 1957–1962ల లో భువనగిరి నుంచి శాసనసభకు ఎన్నిక అయ్యారని, 1957లో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, బూడిద సదాశివ, కంది రవీందర్‌రెడ్డి, నాయకులు పరికరాల సాంబయ్య, కిరణ్, వీరగోని హరీశ్, సురేష్ రామ్మూర్తి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.


నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

'సింహగర్జన' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్

సప్తగిరికాలనీ: హైదరాబాద్‌లో ఈనెల 10న జరుగనున్న బీసీల సింహగర్జన బహిరంగ సభ కరపత్రాన్ని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం కరీంనగర్‌లో ఆవిష్కరించారు. బీసీ కుల సంఘాలకు ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఉంటుందన్నారు. బీసీల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు కనకయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద వెంకన్న, కార్యదర్శి గోడిసెల రమేశ్‌గౌడ్, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ్, సంపత్, నాగరాజు, సాయి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైనందున జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో టీచర్ల సందేహాల నివృత్తి, ఇతరత్రా సమస్యల సత్వర పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో జనార్దన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అట్ల శ్రీనివాస్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్, సైదాపూర్ మండల ప్రధాన కార్యదర్శి ఒడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆయిల్‌బాల్స్‌తో దోమలు పరార్

- నాలుగేళ్లుగా పంచాయతీల్లోనే తయారీ
- స్వల్పఖర్చుతో ప్రయోజనం

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో ప్రబలే డెంగీ, మలేరియా వ్యాధులకు కారణమయ్యే దోమల నియంత్రణకు గ్రామపంచాయతీలు చర్యలు చేపట్టాయి. మురుగుగుంతలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్‌ను వేసి లార్వా దశలోనే దోమలను నిర్మూలిస్తున్నారు. గ్రామపంచాయతీల్లోనే ప్రయోగాత్మకంగా ఆయిల్‌బాల్స్‌ను పంచాయతీ కార్మికులు స్వయంగా తయారు చేసి వినియోగిస్తున్నారు. తక్కువ ఖర్చుతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. కరీంనగర్ మండలంలోని 17గ్రామపంచాయతీల్లో నాలుగేళ్ల నుంచి ఆయిల్‌బాల్స్‌ను ఉపయోగిస్తూ దోమల నివారణలో ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆయిల్‌బాల్స్ తయారీ విధానం

గ్రామాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలు ఉపయోగించినప్పటికీ అంతగా ప్రయోజనం కలుగలేదు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా ప్రకటించి ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టడంతోపాటు బ్లీచింగ్‌పౌడర్ చల్లడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నాలుగేళ్లక్రితం గ్రామపంచాయతీల్లోనే ఆయిల్‌బాల్స్ తయారీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటి తయారీకి రంపపు పొట్టు, ఇసుక, సున్నం, వాహనాల్లో ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్‌ను ఉపయోగిస్తారు. పంచాయతీకార్మికులు ముందుగా రంపపుపొట్టు, సున్నం, ఇసుకను మిశ్రమంగా కలిపి బాల్‌గా తయారు చేసి బట్టలో కట్టి ఇంజిన్ ఆయిల్‌లో ఒక రోజంతా నానపెడుతారు. అనంతరం మురుగుగుంతలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఒకటి, రెండు చొప్పున ఆయిల్‌బాల్స్‌ను వేస్తారు. దీంతో లార్వా దశలోనే దోమలు చనిపోగా ఆయిల్ వాసనకు దోమలు అక్కడినుంచి పారిపోతాయి.


ఆయిల్‌బాల్స్ వేస్తున్న పంచాయతీ కార్మికుడు

మంచి ఫలితాలు

దోమల నియంత్రణకు ఉపయోగిస్తున్న ఆయిల్‌బాల్స్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయి. ముందుగా పంచాయతీ సిబ్బందితో ఆయిల్‌బాల్స్ తయారీ చేసి అందుబాటులో ఉంచుతున్నాం.మురుగుకాలువలు, నీటి గుంతల్లో వేయడంతో దోమలబెడద తగ్గింది.
– ఏ.ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి,చామనపల్లి

పంచాయతీల్లో వినియోగం

అన్ని గ్రామపంచాయతీల్లో తక్కువ ఖర్చుతో పంచాయతీ సిబ్బంది ఆయిల్‌బాల్స్ తయారీ చేస్తున్నారు. మురుగుగుంతలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ఆయిల్‌బాల్స్‌ను వినియోగిస్తున్నారు. పంచాయతీల్లో ఆయిల్ బాల్స్‌ను అందుబాటులో ఉంచాం.
– జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

కొత్తపల్లి చెరువులోకి ఉధృతంగా వరద

- వరదతో మునిగిన లోలెవల్ వంతెన
- కోతకు గురవుతున్న వంతెన సైడ్‌బర్మ్స్
- కొత్తపల్లి బైపాస్‌పై రాకపోకలకు అంతరాయం

కొత్తపల్లి: కొత్తపల్లి చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో చెరువు అలుగుపారుతోంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వానలతో వరద తీవ్రత అధికమవుతోంది. ఇక్కడి పరిసరాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా కొత్తపల్లి–వెలిచాల బైపాస్‌పై గల లోలెవల్ వంతెన మునిగింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాలు పడ్డప్పుడల్లా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదలతో తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రయాణికులు నిరాశకు లోనవుతున్నారు. అంతేగాకుండా లో లెవల్ వంతెన సైడ్ బరమ్స్ పూర్తిగా కోతకు గురవుతున్నాయి. ఇది మెల్లమెల్లగా రోడ్డు వరకు చేరి కోతకు గురయ్యే ప్రమాదం లేకపోలేదు. సంబంధిత అధికారులు స్పందించి లోలెవల్ వంతెన వద్ద పరిస్థితిని సమీక్షించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు ప్రత్యామ్నాయ మార్గమైన పట్టణ శివారులోని తోకబొందలో లెవల్ వంతెన సైతం వరద నీటితో మునిగింది. దీంతో రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోకతప్పడం లేదు.


మత్తడి దూకుతున్న కొత్తపల్లి చెరువు


కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద


కోతకు గురవుతున్న లోలెవల్ వంతెన

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ



కరీంనగర్‌టౌన్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకుని మొదటి వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, కలీమ్ ఆధ్వర్యంలో నగరంలోని ఫతేహ్‌పుర చౌరస్తా వద్ద షర్బత్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కరీంనగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ మునావర్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మొసిన్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, మహమ్మద్ ఇమ్రాన్, ఇర్ఫాన్, జాఫర్, అనురాగ్, సాజిద్, కృప, ఆసిఫ్, వాజిద్, అబోదు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



మార్గదర్శి దందాపై విచారించాలి

హైకోర్టుకు నివేదించిన సీఐడీ.. అప్పీళ్లు దాఖలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీ, శైలజా కిరణ్ తదితరులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ ఈ అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

ప్రజలందరికీ.. 'ఆరోగ్య సురక్ష'

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: ఏపీ ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం మరో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం, ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ద్వారా చికిత్సలు, మందులను ఉచితంగా అందించబోతోంది. ఎవరైనా రోగులకు అవసరమైతే ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య చికిత్సలు చేయించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

చెప్పింది చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. ఇతరత్రా సేకరించిన వారి గుర్తింపు కార్డులతో వ్యవహారం నడుపుతోంది. వారి సంతకాలను ఫోర్జరీ చేస్తూ తీవ్ర నేరానికి పాల్పడుతోంది.

- ఘోస్ట్ చందాదారుల పేరిట చెక్‌లు జారీ చేస్తున్నప్పటికీ, ఆ చెక్కులను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం వారి వద్దే అట్టిపెట్టుకుంటోంది. ఆ చెక్కుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదు. బ్యాంకులో జమ చేయడం లేదు. ఇదో అతి పెద్ద ఆర్థిక మోసం. అలాంటి 3 వేల మంది ఘోస్ట్ చందాదారుల్లో వంద మందిని సీఐడీ విచారిస్తోంది.
- దాంతో బెంబేలెత్తిన మార్గదర్శి యాజమాన్యం ఆ ఘోస్ట్ చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని, తర్వాత తాము అన్నీ సెటిల్ చేస్తామని.. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తన పీఏ శశికళ ద్వారా చందాదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.

అక్రమ డిపాజిట్లుగా నల్లధనం

- రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. దీనిపై ప్రశ్నిస్తే తిరిగి బుకాయిస్తోంది. రాబోయే నెలలకు చిట్టీ గ్రూపులకు చెల్లించాల్సిన చందాలను అడ్వాన్స్‌గా జమ చేస్తున్నారని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ అసలు చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే చందాదారుల పేరిట నాలుగైదు నెలల ముందే డిపాజిట్లు సేకరించిన విషయాన్ని సీఐడీ గుర్తించింది.
- చిట్టీ గ్రూపులు మొదలు కాకుండానే ఎవరైనా చందాల మొత్తం చెల్లిస్తారా? ఎవరూ చెల్లించరు కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే. రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు దాదాపు 2 వేల మందిలో రూ.కోటికి పైగా విలువైన అక్రమ డిపాజిట్లు చేసిన, చిట్టీ గ్రూపుల్లో చందాదారులుగా ఉన్న వారు ఏకంగా 800 మందికిపైగా ఉన్నారు. చాలా కంపెనీల పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు.



- ఆ 800 మందికిపైగా డిపాజిట్‌దారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. అంత భారీగా డిపాజిట్లు ఎలా చేశారు.. ఆ నిధులు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయనే కోణంలో విచారిస్తోంది. విజయవాడలో ఓ బిల్డర్ ఏకంగా రూ.50 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా ఉన్నారు.
- ఇలాంటి భారీ మొత్తాల డిపాజిట్‌దారులు, చిట్టీ గ్రూపుల్లో సభ్యుల గురించి ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా సీఐడీ సమాచారమిచ్చింది. అక్రమ డిపాజిట్ల ముసుగులో నల్లధనం చెలామణిలోకి తీసుకువస్తున్నారా అన్నది సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

రూ.9.43 కోట్ల జగజ్జనని చిట్ ఫండ్స్ ఆస్తులు అటాచ్

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడిన రాజమహేంద్రవరానికి చెందిన జగజ్జనని చిట్ ఫండ్స్‌కు చెందిన రూ.9,43,52,020 విలువైన స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. వాటిలో భవనాలు, భూములు, ఖాళీ స్థలాలతో కూడిన మొత్తం 12 స్థిరాస్తులను అటాచ్ చేయనుంది. చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఐడీ ప్రతిపాదనకు హోమ్ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై న్యాయస్థానం ఆమోదం కోసం సీఐడీ పిటిషన్ దాఖలు చేయనుంది. న్యాయస్థానం అనుమతి అనంతరం ఆ ఆస్తులను అటాచ్ చేస్తుంది.

ఏజెంట్లకూ కుచ్చుటోపీ

- మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ చందాదారులు, ఏజెంట్లను కూడా మోసగిస్తోంది. కుట్ర పూరితంగా వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారి ఆస్తులు రాయించుకుంటోంది. దీనిపై చందాదారులు, ఏజెంట్లు, ఘోస్ట్ చందాదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి తగిన ఆధారాలు ఉన్న వాటిపై సీఐడీ కేసులు నమోదు చేస్తోంది.
- విజయవాడలో కోళ్ల ఫారం యజమాని బొండు అన్నపూర్ణా దేవి అనే మహిళను ఏకంగా 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్పించి ఆమెను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కుట్ర పూరితంగా విజయవాడలోని లబ్బీపేట, గుడివాడ మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు కేంద్రంగా ఈ మోసానికి పాల్పడ్డారు. విదేశాల్లో ఉన్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారు. ష్యూరిటీలు ఇచ్చినా సరే కొర్రీలు వేస్తూ ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి ఆస్తులు కూడా రాయించుకున్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. ఆమె రూ.14 కోట్ల విలువైన 65 చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా ఉన్నారు. ఆమె రూ.8 కోట్లు చందా మొత్తం చెల్లించారు. కానీ చిట్టీ పాట పాడితే ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.48 లక్షలు మాత్రమే. ఇందులో రూ.8 కోట్ల విలువైన 45 చిట్టీ గ్రూపుల్లో ఆమె రూ.1.7 కోట్లు చందా మొత్తంగా చెల్లిస్తే.. చిట్టీ పాట పాడిన తర్వాత ఆమె చేతికి ఇచ్చింది కేవలం రూ.8 వేలు. ఆమెను డిఫాల్టర్‌గా చూపిస్తూ వారి కుటుంబ ఆస్తులు కూడా రాయించుకుంటున్నారు.
- విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన పిలక లలిత కుమారి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఆమెను విశాఖపట్నంలోని డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఘోస్ట్ చందాదారుగా చేర్చారు. ఆ విషయం తెలిసి ఆమె చిట్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అక్కడ ఉన్న పత్రాల్లో ఉన్న సంతకాలు చూసి అవి తాను చేయలేదని ఫోర్జరీ చేశారని తెలిపారు.
- ఆమె చిట్టీ పాడినట్టు.. ఆమెకు చిట్టీ మొత్తం చెల్లించినట్టు కూడా రికార్డుల్లో ఉంది. అందుకు ఇద్దరు సాక్షి సంతకాలు కూడా చేశారు. తనకు తెలియకుండానే తనను చందాదారుగా చేర్చడంతోపాటు తన సంతకాలు ఫోర్జరీ చేయడంపై లలిత కుమారి విశాఖపట్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో విశాఖపట్నం డాబా గార్డెన్స్ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్ యలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్ కె.సంతోష్, సాక్షి సంతకాలు చేసిన జి.నరసింగరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ఎండీ శైలజా కిరణ్, ఆమె పీఏ శశికళ, విజయవాడ లబ్బీపేట బ్రాంచి మేనేజర్ బండారు శ్రీనివాసరావు, గుడివాడ బ్రాంచి మేనేజర్ వైవీవీడీ ప్రసాద్, పాతూరి రాజాజీ, పాపి నాయుడులను నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.
- పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఏజెంట్‌నే ఆ సంస్థ మోసం చేసింది. ఏజెంట్ సంతకాన్ని బ్రాంచి మేనేజర్ ఫోర్జరీ చేశారు. ఏజెంట్ ఫిర్యాదుపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

మా కుటుంబాన్ని దోచేసి రోడ్డున పడేశారు

- బోరున విలపించిన బొండు అన్నపూర్ణా దేవి

'మార్గదర్శి చిట్ ఫండ్స్ మమ్మల్ని పూర్తిగా మోసం చేసి ఆర్థికంగా కుదేలయ్యేట్టు చేసింది. మా కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మా ఆస్తులు, బంగారం, వృద్ధాప్యంలో అవసరాల కోసం దాచుకున్న మొత్తం అంతా మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు ధారపోశాం. అయినా సరే ఇంకా మమ్మల్ని వేధిస్తూ మిగిలిన ఉన్న ఇంటిని కూడా తీసుకునేందుకు వేధిస్తోంది. మా కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడింది. నా భర్త ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడు. నేను కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాను. నేను మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరాను. ఆ తర్వాత ఏకంగా 65 గ్రూపుల్లో నన్ను చందాదారుగా చేర్చింది. నిబంధనల ప్రకారం మేము ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఉద్దేశ పూర్వకంగా మమ్మల్ని 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించింది. మా ఆస్తు లు తీసుకుంది. నా భర్త జీపీఎఫ్ డబ్బులు కట్టి, పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించాం. అయినా సరే ఇంకా బకాయి ఉన్నారంటూ మా ఇల్లు వేలం వేయించారు. మా ఇంటికి వచ్చి అల్లరి చేశారు. మా అమ్మాయి విదేశాల్లో వైద్య విద్య చదువుతోంది. ఆమె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించారు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మమ్మల్ని వేధిస్తున్నారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది? ఎలా వేలం పాటలో పాల్గొంది? తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది? ఇంత దారుణంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ మమ్మల్ని మోసం చేసింది. మమ్మల్ని కుట్ర పూరితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం, మేనేజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.'

ఆలస్యంగా ఆశ్రయించడం సమర్థనీయం కాదు

నీట్ పరీక్ష రాసిన విద్యార్థిని తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్యలో 'స్థానిక'సీట్ల భర్తీకి సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును రిజర్వు చేశామని, ఇప్పుడు మరో పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇంత ఆలస్యంగా కోర్టును ఆశ్రయించడాన్ని సమర్థించలేమని స్పష్టం చేసింది. వైద్యవిద్య సీట్ల భర్తీ అనేది కాలపరిమితితో కూడిందని, ఇప్పటికే రెండుసార్లు కౌన్సెలింగ్ కూడా ముగిసిందని చెప్పింది. ఆగస్టు 2వ తేదీనే నాన్ లోకల్‌గా పేర్కొన్నా 31వ తేదీ వరకు పిటిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుబట్టింది. పిటిషన్‌ను కొట్టివేసింది. ఇంటర్మీడియట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 114ను సవాల్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లెకు చెందిన విద్యార్థి శ్రీస్వరాజ్ రవీందర్ నాగపుర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీపడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయ మూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం న్యాయసూత్రాల మేరకు కొన్నిసార్లు ఆలస్యం అనేది న్యాయాన్ని పొందకుండా చేస్తుందని వ్యాఖ్యానించింది. ఇలాంటివారి హక్కుల పరిరక్షణకు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

12న వడ్డెర ప్రతినిధుల మహాసభ

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం వస్తే వడ్డెర కులస్తులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉద్యమంలో ముందుండి పోరాడితే ఉమ్మడి ఏపీలో ఉన్న హక్కులు కూడా ప్రత్యేక రాష్ట్రంలో లేకుండా చేస్తూ అధ:పాతాళానికి తొక్కేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. వడ్డెరల సమస్యలు చర్చించేందుకు ఈ నెల 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో వడ్డెర సంఘం ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభ పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా ఉన్న వడ్డెర కులస్తులకు బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీలు కనీసం 4 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర పిల్లలకు గురుకులాల్లో ఎంట్రెన్స్ లేకుండా సీట్లు ఇవ్వాలన్నారు. మహాసభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐలయ్య, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మావోల కదలికలపై నిఘా

- ఆయుధాల అక్రమ రవాణాపై దృష్టి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- ఎన్నికల నేపథ్యంలో పలు జిల్లాల ఎస్పీలతో సమావేశం

గోదావరిఖని: జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, నిర్మల్, జయశంకర్‌భూపాలపల్లి, కొముురంభీంఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల పోలీసు అధికారులతో సీపీ సమావేశమయ్యారు. మావోయిస్టులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఉమ్మడి కూంబింగ్ ఆపరేషన్, ఏరియా డామినేషన్స్ పార్టీలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ కనెక్ట్‌పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏజెన్సీ, సరిహద్దు ప్రాంతాల్లో ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో సరిహద్దు జిల్లాల పోలీసుల పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఉమ్మడి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్, ఓటింగ్, సంబంధిత పరికరాల రవాణా, పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. మంథని, ధర్మపురి, ఖానాపూర్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించారు. మాదక ద్రవ్యాలు, మద్యం, ఆయుధాలు, ఇతర అక్రమ రవాణాను నియంత్రించడానికి ఉమ్మడి పోలీసింగ్ ఏర్పాటు చేయాలని, వీవీఐపీలు, వీఐపీలు పర్యటించే సమయంలో పరస్పర సమాచార మార్పిడి, బందోబస్తు ఏర్పాట్లలో సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే సరిహద్దు జిల్లాల మధ్య పోలీసు బలగాలను త్వరితగతిన సమీకరించడానికి రీఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమ్యూనికేషన్ లేని మారుమూల ప్రాంతాల్లో సమాచార వ్యవస్థ ఏర్పాటుతోపాటు ఆ ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న అనుమానితులను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. 80ఏళ్లకు పైబడిన వృద్ధులు, ఫిజికల్ చాలెంజ్‌డ్ పర్సన్లకు ప్రత్యేకంగా ఓటు వేసేలా విభాగాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, కొమురంభీమ్‌ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్, జగిత్యాల్ ఎస్పీ ఎగ్గడి భాస్కర్, జయశంకర్‌భూపాలపల్లి ఎస్పీ పి.కరుణాకర్, కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



సరిహద్దు జిల్లాల ఆఫీసర్లతో సమీక్షిస్తున్న సీపీ

వామ్మో చిరుత



ప్రజలకు వివరిస్తున్న అధికారులు



అడుగులను గుర్తిస్తున్న అటవీ అధికారులు



దాడిలో మృతిచెందిన దూడ

- నిర్మల్ జిల్లా వాసులను భయపెడుతున్న సంచారం..
- మొన్న కుంటాల.. నిన్న గండిరామన్న అటవీప్రాంతం.. నేడు మలక్‌చించోలిలో కనిపించిన వైనం
- పశువులపై దాడులతో ఆందోళన చెందుతున్న రైతులు, పశువుల కాపర్లు
- చిరుత అడుగులను గుర్తించిన అటవీ అధికారులు

సారంగపూర్: నిర్మల్ జిల్లాలో చిరుతపులుల సంచారం ప్రజలను భయపెడుతోంది. ఇటీవల కుంటాల మండలంలో, నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని గండిరామన్న అటవీ ప్రాంతంలో చిరుతలు సంచరించగా, తాజాగా గురువారం తెల్లవారు జామున సారంగాపూర్ మండలం మలక్‌చించోలి అటవీప్రాంతంలో కనిపించింది. గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డికి చెందిన గేదె దూడను ఎత్తుకెళ్లి దాని తలను తినేసి కళేబరాన్ని చెట్టుపైకి ఈడ్చుకెళ్లింది. దీనిని చూసిన రైతులు, పశువుల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

అడవిలో..

ఈతకు సిద్ధంగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి గేదె రోజువారీ లాగనే మేత కోసం మందలో అడవికి పంపించాడు. బుధవారం గేదె అడవిలోనే ఈనింది. గమనించని పశువుల కాపరి మిగతా మందను తోలుకుని గ్రామానికి చేరుకున్నాడు. అప్పటికే చీకటి పడడంతో సదరు రైతు గ్రామస్తుల సహకారంతో గాలించారు. ఎక్కడా కనిపించలేదు. గురువారం ఉదయం అటవీప్రాంతంలో గాలించేందుకు వెళ్లారు. అటవీ ప్రాంతంలో చిరుత గేదెకు జన్మించిన దూడను లాక్కెళ్లి తలను తిని మిగతా భాగాన్ని చెట్టుపైకి లాక్కెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న డీఆర్వో శ్రీదేవి, ఎఫ్‌బీవో వెన్నెలతోతోపాటు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పాదముద్రలను గుర్తించి చిరుతగా తేల్చారు. పశువుల కాపరులు, సమీప పంటపొలాలకు వెళ్లే రైతులు 1053 కంపార్టుమెంటులోని అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని సూచించారు. దీంతోపాటు అటవీ ప్రాంతంలోని సమీప ప్రదేశాల్లో చిరుత పాదముద్రలను తాము గుర్తించామని ఆమె పేర్కొన్నారు. ఎవరూ భయాందోళనకు గురి కావద్దని, చిరుతకు ఎలాంటి హాని తలపెట్టొద్దని సూచించారు. నిత్యం పహారా చేపట్టి చిరుత జాడలు తెలుసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామన్నారు.

చెట్టుపై కనిపించింది..

నా గేదె ఈత సిద్ధంగా ఉందని తెలుసు, కాని దానికి సమయం ఉందన్న కారణంగా మందలో మేతకు పంపాను. గురువారం రాత్రి ఇంటికి చేరలేదు. రాత్రి చీకటి పడడంతో వెతకడం ఇబ్బంది అయ్యింది. గురువారం ఉదయం అడవిలో గాలించగా గేదె కనిపించింది. దూడ కనిపించకపోవడంతో వెతుకుతుండగా చెట్టుపై దూడ కళేబరం కనిపించింది. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాం.

– ప్రశాంత్‌రెడ్డి, రైతు, మలక్‌చించోలి

ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దు..

చిరుత సంచరిస్తున్న మాట వాస్తవమే. అది గేదె దూడను చంపి తినేసింది. దానికన్నా చిన్న జంతువులను మాత్రమే అది వేటాడి చంపగలదు. దాన్నిచూసి భయపడాల్సిన అవసరం లేదు. అలాగని ప్రజలెవరూ అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దు. పశువుల కాపరులు, సమీప పంటపొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిరుత కనిపిస్తే దానిపై దాడి చేయవద్దు. సమాచారం ఇస్తే అటవీశాఖ అధికారులు వస్తారు.

– జైపాల్‌రెడ్డి, ఎఫ్ఆర్‌ఓ, నిర్మల్

రాగి జావ.. పోషకాల హవా

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగకరం
- ఉమ్మడి జిల్లాలో 1,86,461 మందికి లబ్ధి
- శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ద్వారా సరఫరా

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాసటగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులేస్తున్న ప్రభుత్వాలు పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు అమలు చేస్తున్న 'పీఎం పోషణ్' కార్యక్రమంలో భాగంగా రాగిజావ అందిస్తున్నారు. ఐదేళ్ల క్రితం సిరిసిల్ల జిల్లాలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈఏడాది జూన్ 20న విద్యా దినోత్సవం సందర్భంగా రాగి జావ పంపిణీని కొన్ని పాఠశాలల్లో లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు నెల నుంచి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లలో రాగి జావను అందిస్తుండగా 1,86,461 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

అల్పాహార సమస్యను అధిగమించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం గ్రామీణ, పేద కుటుంబాలకు చెందిన వారే ఎక్కువ. వీరిలో అధిక శాతం ఉదయం పూట భోజనం, టిఫిన్ చేసే వీలుండదు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చి ఎప్పుడో మధ్యాహ్నం అందించే భోజనంపైనే ఆధారపడతారు. ఈ సమస్య నుంచి గట్టెక్కించడానికి, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాగిజావ తయారీకి అవసరమైన ముడి సరకును శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో ప్రభుత్వం సరఫరా చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్యాకింగ్ చేసిన ఫోర్టిఫైడ్ రాగి పొడి, బెల్లం పొడి అందిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల చొప్పున రాగి, 10 గ్రాముల బెల్లం పొడిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనాల ఏజెన్సీలకు వీటి బాధ్యత అప్పగించారు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉడికించిన కోడిగుడ్డు అందిస్తున్నారు. మిగతా మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో అల్పాహారంగా రాగి జావ అందిస్తున్నారు. పుట్టపర్తి సాయిబాబా ట్రస్టు నిర్వాహకులు సద్గురు మధుసూదనసాయి ఆశీర్వదంతో ఆనంద్ కడాలి ప్రోత్సాహంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదట ప్రారంభించిన రాగిజావ పంపిణీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కొనసాగుతోంది. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పాటు నోడల్ అధికారి కన్నం రమేశ్‌తో కూడిన బృందం పుట్టపర్తికి వెళ్లి సాయిబాబా ట్రస్టు పంపిణీ చేస్తున్న రాగిజావ పంపిణీ కార్యక్రమ వివరాలను, సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేయాలని కోరగా ట్రస్టు అందుకు సంబంధించి అడిగిందే తడవుగా రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది.

పిండిలో కలిసే పదార్థాలు

రాగి పిండి, బియ్యం పిండి, డీఫ్యాటెడ్ సోయా పౌడర్, దాల్చిన చెక్క పొడి, పసుపు, ఉప్పు, విటమిన్స్ , మినరల్స్ ప్రీమిక్స్ కలిసిన మిశ్రమాల పొడులను పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు.



విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్(ఫైల్)

జిల్లా	మండలాల సంఖ్య	విద్యార్థులు
జగిత్యాల	20	65,657
కరీంనగర్	16	47,158
రాజన్నసిరిసిల్ల	13	41,387
పెద్దపల్లి	13	32,259
మొత్తం	62	1,86,461

వారానికి మూడు రోజులు..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్స్‌లో చదువుతున్న 1,86,461 మంది విద్యార్థులకు వారానికి మూడు రోజులు రాగి జావ అందిస్తున్నాం. ఇందులో పోషక గుణాలు ఉండటంతో చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. చదువులో కూడా ఉత్సాహం చూపుతున్నారు.

– కన్నం రమేశ్, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి

ఐడియా అదిరింది గురూ..



తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన ఓ రైతు వినూత్న ఆలోచన చేశాడు. తనకున్న ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ తరహాలో విభిన్నంగా డిజైన్ చేయించాడు. నిత్యం పొలానికి కూలీలను ఆటోలో తీసుకెళ్లడం ఆర్థిక భారం కావడంతో తన బుల్లెట్‌ను మార్పు చేసి గుజరాత్‌లో ఇలా ప్రత్యేకంగా తయారు చేయించాడు. నిత్యం కూలీలను తీసుకెళ్లేందుకు ఉపయోగిస్తున్న ఈ వాహనం అందరినీ ఆకర్షిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆర్జీయూకేటీతో టెక్ జెయింట్ కాగ్నిజెంట్ భాగస్వామ్యం



విద్యార్థులతో కాగ్నిజెంట్ బృంద సభ్యులు

భైంసా: ప్రఖ్యాత గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ కాగ్నిజెంట్ సీనియర్ లీడర్‌షిప్ బృందం బాసర ఆర్జీయూకేటీని గురువారం సందర్శించింది. చిత్రా సుబ్రమణియన్, సీనియర్ డైరెక్టర్, జె.రవికిరణ్, అసోసియేట్ డైరెక్టర్, సేల్స్‌ఫోర్స్ ఎ.కార్తీక్, మేనేజర్, శివ బవనరి, సీనియర్ మేనేజర్, ఔట్‌రీచ్ బాల ప్రసాద్, సర్వీస్ డెలివరీ మేనేజర్‌తో కూడిన బృందానికి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వి.వెంకటరమణఘన స్వాగతం పలికారు. కాగ్నిజెంట్ లీడర్‌షిప్ టీమ్, ఆర్జీయూకేటీ ఫ్యాకల్టీ, విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్‌లలో నిమగ్నమై, ఆలోచనలు, జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. పరిశ్రమకు సిద్ధంగా ఉన్న లైవ్ ప్రాజెక్టులతోసహా రాబోయే 120 రోజుల్లో ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఉచిత సేల్స్‌ఫోర్స్ సాంకేతిక శిక్షణ అందించనున్న ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ విభాగం అధికారి హరిబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్



పార్టీలో అందరినీ ఆకట్టుకోవాలంటే ఏదైనా ప్రత్యేకత చూపాల్సిందే అనుకుంటోంది నవతరం. ఇక వెస్ట్రన్ స్టైల్ పార్టీలో అయితే ఆ హంగామా మామూలుగా ఉండదు. ప్లెయిన్ డ్రెస్సులకు స్పెషల్ అట్రాక్షన్‌గా యంగ్‌స్టర్స్‌ని అమితంగా ఆకట్టుకుంటున్నాయి డిటాచబుల్ హ్యాండ్ కఫ్స్. పార్టీలోనే కాదు క్యాజువల్ వేర్‌గానూ వీటిని ధరించవచ్చు. చూసినవారు థంబ్స్ అప్ ఇవ్వకుండా ఉండలేరు.

హ్యాండ్స్ అప్...





ఎంబ్రాయిడరీ కఫ్స్...

కాంబినేషన్ లేదా పూర్తి కాంట్రాస్ట్‌లో ఉండే డిటాచబుల్ ఎంబ్రాయిడరీ హ్యాండ్ కఫ్స్ ఏ ప్లెయిన్ డ్రెస్‌కైనా నప్పుతాయి. స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి. ట్రైబల్, మిషన్, మిర్రర్ ఎంబ్రాయిడరీ వీటిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఎంబ్రాయిడరీ డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది.

జ్యువెలరీ కఫ్స్..

సంప్రదాయ వేడుకలు ముఖ్యంగా పెళ్లి వంటి వేడుకలలో ధరించడానికి అనువైన జ్యువెలరీ హ్యాండ్ కఫ్స్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇమిటేషన్ జ్యువెలరీ నుంచి డైమండ్ హ్యాండ్ కఫ్స్ వరకు ఉన్నాయి.







ఫ్లోరల్ కఫ్స్

టీనేజర్స్, పిల్లలు ముచ్చట పడి ధరించేందుకు వీలుగా ఫ్లోర్ హ్యాండ్ కఫ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు లేస్, క్రోచెట్ అల్లికల హ్యాండ్ కఫ్స్‌ను కూడా తమ ప్రాధాన్యతలను బట్టి ఎంచుకోవచ్చు.







ట్రావెల్ కఫ్స్

ప్రయాణాలలో ఫోన్‌తో పాటు కొంత డబ్బు కూడా అదీ ఎలాంటి బ్యాగ్ అవసరం లేకుండా వెంట తీసుకెళ్లాలంటే ఈ ట్రావెల్ హ్యాండ్ కఫ్స్ మంచి ఉపయుక్తంగా ఉంటాయి.







ఉత్సవ సమయం



● రేష్మ ఖాతు

ముంబైలో గణేశ్ నిమజ్జనం రోజున వేలాది విగ్రహాలు సముద్రం వైపు కదులుతాయి. వాటిలో భారీ విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఆ విగ్రహాల్లో దాదాపు సగం రేష్మ ఖాతు తయారు చేసినవే. తండ్రి మరణించాక గణేశుడి విగ్రహాల తయారీ పరంపరను భుజానికెత్తుకుంది రేష్మ. ఇవాళ ముంబైలో ఆమె నంబర్ 1 గణేశ శిల్పి.

ఆమె తీర్చిన గణేశులు



'మనల్నందరిని దేవుడు తయారు చేశాడు. కాని ఆ దేవుణ్ణి తయారు చేసే అవకాశం ఎంత మందికి వస్తుంది' అంటుంది రేష్మ ఖాతు.

నలభై ఏళ్ల రేష్మ ఖాతును ముంబైలో 'మూర్తికార్' అని పిలుస్తారు. అంటే దేవుని మూర్తుల రూపశిల్పి అని అర్థం. 'ఇవాళ మా నాన్న నన్ను చూస్తే చాలా ఆశ్చర్యపోయి ఉండేవాడు' అంటుందామె తండ్రి విజయ్ ఖాతును తలుచుకుని. ఎందుకంటే తండ్రి జీవించి ఉండగా ఆమె ఎప్పుడూ ఆయన వర్క్‌షాప్‌లోకి పెద్దగా అడుగు పెట్టేది కాదు. ఇవాళ ఆ వర్క్‌షాప్‌కు ఆమే సర్వస్వం. 'ముంబైలోనే కాదు దేశ విదేశాల్లోనే మా నాన్న విజయ్ ఖాతు చాలా ప్రఖ్యాతుడు. ఇవాళ మనం చూస్తున్న గణేశ్ విగ్రహాల భిన్న రూపాలకు ఆయనే ఆద్యుడు. గతంలో గణేశుడు విగ్రహం అంటే అందరూ కూర్చుని ఉన్న మూర్తే తయారు చేసేవారు. మా నాన్న గణేశుడి చేతులకు, కాళ్లకు కదలికలు తెచ్చాడు' అంటుంది రేష్మ. 2017లో విజయ్ ఖాతు మరణించాక ఆయన శిల్ప సామ్రాజ్యాన్ని రేష్మ సమర్థంగా నిర్వహిస్తోంది.

సినీ దర్శకురాలు అవుదామని

రేష్మ ఖాతు కుటుంబం తాతల కాలం నుంచి గణేశ్ విగ్రహాల తయారీలో ఉంది. ఆ శిల్పాల తయారీ రేష్మకు సర్వం తెలిసినా తాను మాత్రం సినీ దర్శకురాలు కావాలని ఆ కోర్సులు చేసింది. అయితే తండ్రి హఠాత్ మరణంతో మొత్తం కార్ఖానా స్తంభించింది. 'మా నాన్న చనిపోయాక ఆయన విలువ మరింత తెలిసింది. ఎందరో మండపాల నిర్వాహకులు నా దగ్గరకు వచ్చి ప్రతి ఏటా వినాయక చవితికి మీ దగ్గరే విగ్రహాలు తీసుకెళ్లేవాళ్లం... ఇక మీదట కూడా అలాగే చేస్తాం అని చెప్పేవారు. ముంబైలో ప్రఖ్యాతమైన లాల్‌బాగ్, ఖేత్‌వాడి, చందన్‌వాడి, తులసివాడి మంటపాల్లో ప్రతి ఏటా మేము తయారు చేసిన విగ్రహాలే పెడతారు. వీరందరినీ చిన్నబుచ్చడం నాకు నచ్చలేదు. మా మేనమామ నాతో– నువ్వు చేయగలవమ్మా అన్నాడు. ధైర్యంగా మా నాన్న సీట్‌లో కూచున్నాను' అంటుంది రేష్మ.

మగవాళ్లకు నచ్చలేదు

గత ఐదారేళ్లుగా రేష్మ విజయవంతంగా గణేశ్ విగ్రహాల తయారీని కొనసాగిస్తున్నా ఇంకా ఆ సంగతి మింగుడుపడని మగవారు ఉన్నారు. 'మా ఫ్యాక్టరీలో శిల్పులు, మౌల్డర్లు, మేనేజర్లు అందరూ నేను బాస్‌గా రావడం చూసి ఆశ్చర్యపోయారు. కొందరు చాలా ఏళ్లుగా మా నాన్న సీట్ మీద కన్నేసి ఉంచారు. వారంతా నేను రావడంతో సహాయ నిరాకరణ చేశారు. నేను శిల్పి కూతురిని. శిల్పం చేయడం నా జీన్స్‌లో ఉంది. నేనే రంగంలో దిగి కొత్త విగ్రహాలు ఎలా చేయాలో సూచనలు ఇస్తూ సరైన దారిలో కార్ఖానాను పెట్టేసరికి తల వొంచారు' అంటుంది రేష్మ.

పార్వతీదేవి చేతుల్లో గణేశుడు తయారైన చందాన ముంబైలో ఒక స్త్రీ చేతుల మీదుగా ప్రతి వినాయక చవితికి విగ్రహాలు తయారవుతాయి. పూజలు అందుకుంటాయి. గణేశుడి మూర్తుల తయారీలో ఒక స్త్రీ ఈ విధాన ముందుండటం తప్పక సంతోషపడాల్సిన విషయం.

ఖుష్ రేష్మ

స్ఫూర్తి

జై కొట్టాల్సిందే!

అస్సాంకు చెందిన కనిక భర్త అనారోగ్యంతో చనిపోయాడు. కనికకు భవిష్యత్ చీకటిగా కనిపించింది. తాను ఎలా బతకాలి? అనే ఆందోళన మొదలైంది. ధైర్యం ఉంటే అదే దారి చూపిస్తుంది అంటారు. డీలా పడకుండా ధైర్యంగా ఉండడం నేర్చుకుంది. అయిదు వందల రూపాయల పెట్టుబడితో వర్మికంపోస్ట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టిన కనిక ఇప్పుడు లక్షాధికారి అయింది...



● కనిక



● వర్మి కంపోస్ట్ తయారీలో...

పెళ్లయిన మూడు సంవత్సరాలకు అస్సాంలోని బోర్జాహర్ గ్రామానికి చెందిన కనికా తలుక్దార్‌కు బిడ్డ పుట్టింది. బిడ్డ మూడు నెలల వయసులో ఉన్నప్పుడు భర్త అనారోగ్యంతో చనిపోవడం కనికను విషాదసాగరంలోకి నెట్టింది. కళ్ల ముందు పసిపాపే కనిపిస్తుంది. భవిష్యత్ మాత్రం మసకబారిపోయింది.

ఆ సమయంలో వర్మికంపోస్ట్ రూపంలో ఒక వెలుగు కిరణం కనిపించింది.

కొన్ని సంవత్సరాల క్రితం కృషి విజ్ఞాన కేంద్ర(కేవీకే) నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో వర్మికంపోస్ట్, చేపల పెంపకం, కోళ్ల పెంపకం...మొదలైన వాటి గురించి తెలుసుకుంది కనిక. వర్క్‌షాప్ తాలూకు విషయాలు గుర్తు తెచ్చుకుంటున్నప్పుడు వర్మికంపోస్ట్ తయారీ సులభం అనిపించింది. ఎందుకంటే ఆవు పేడలాంటి ముడిసరుకులు సేకరించడానికి తాను పెద్దగా కష్టపడనక్కర్లేదు.

ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా తన చుట్టుపక్కల అందుబాటులో ఉన్న వనరులతోనే వర్మికంపోస్ట్ తయారు చేయవచ్చు.

2019లో నార్త్ ఈస్ట్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్ రెండు నెలల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం కనికకు ఎంతో ఉపకరించింది. శిక్షణలో భాగంగా వర్మివాష్‌ను తయారు చేయడం నేర్చుకుంది. ఇది వర్మికంపోస్ట్ నుంచి తయారుచేసే ద్రవసారం. సాధారణ వర్మికంపోస్ట్ కంటే ఎక్కువ నత్రజని, భాస్వరం..మొదలైనవి ఇందులో ఉంటాయి.

అయిదు వందల రూపాయల పెట్టుబడితో వ్యాపారంలోకి అడుగు పెట్టింది కనిక. కృషి విజ్ఞాన కేంద్ర ఉచితంగా వానపాములను అందించింది.

'జై వర్మికంపోస్ట్' బ్రాండ్‌తో వర్మికంపోస్ట్, వర్మివాష్ అమ్మకానికి రెడీ అయింది. తయారీ సంగతి సరే, మరి కొనేవారు ఎవరు? రసాయన ఎరువులకు అలవాటు పడిన రైతులకు వర్మికంపోస్ట్ నచ్చుతుందా?

అందుకే తన ఉత్పత్తికి తానే ప్రచారకర్తగా మారింది.

వర్మికంపోస్ట్ వాడకం వల్ల నేలకు జరిగే మేలు ఏమిటో ఊరూరా తిరుగుతూ ప్రచారం చేసింది. ఆమె శ్రమ వృథా పోలేదు. వ్యాపారం అడుగుల స్థాయి నుంచి పరుగుల స్థాయికి చేరుకుంది. పేడ కోసం మొదట రెండు ఆవులను కొన్న కనిక ఆ తరువాత నాలుగు ఆవులను ఒకేసారి కొనగలిగే స్థాయికి చేరింది.

ఒకప్పుడు 'జై' కంపెనీ ఒక సంవత్సరంలో 800 కిలోల వర్మికంపోస్ట్‌ను ఉత్పత్తి చేసేది. ప్రస్తుతం అది నెలకు 35 టన్నుల స్థాయికి చేరుకుంది. అస్సాం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌తో పాటు మేఘాలయా, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లో ఎన్నో నర్సరీలు జై ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి.

వ్యాపారంలో ఎలాంటి అనుభవం లేకపోయినా అద్భుత విజయం సాధించిన కనిక ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థుల కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (అస్సాం) ప్రతి నెల కనికతో అవగాహన తరగతులు నిర్వహిస్తోంది.

'ఇది కలలో కూడా ఊహించని విజయం. ఎలా బతకాలో అని భయపడిన నేను ఎంతో మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను. ఎలా బతకాలో తెలియక ఒకప్పుడు ధైర్యం కోల్పోయిన నేను ఇప్పుడు ఎంతోమందికి ధైర్యం చెబుతున్నాను. ఈ విశాలమైన ప్రపంచంలో మన కోసం ఎన్నో అవకాశాలు ఉంటాయి. వాటిలో ఒకటి అందిపుచ్చుకున్నా మన జీవితమే మారిపోతుంది' అంటుంది నలభై అయిదు సంవత్సరాల కనికా తలుక్దార్.

వంటిల్లు

ఎగ్ స్పెషల్



ఎన్నో పోషకాలున్న కోడి గుడ్డుకు కూరగాయ ముక్కలు, కాసింత మసాలా జోడించారంటే రుచి అమోఘంగా ఉంటుంది. అందుకే ఘుమ ఘుమలాడే గుడ్డు రుచులతో వచ్చేసింది ఈ వారం వంటిల్లు...


చికెన్ ఖీమా బుర్జి



కావలసినవి: చికెన్ ఖీమా – పావుకేజీ; గుడ్లు – మూడు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – రెండు; మిరియాల పొడి – టేబుల్ స్పూను; గరం మసాలా – టీస్పూను; పసుపు – అరటీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; ఆవాలు – టీస్పూను; మినప గుళ్లు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● చికెన్ ఖీమాను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. వేడెక్కిన నూనెలో ఆవాలు, మినపగుళ్లవేసి వేయించాలి ● ఇప్పుడు పచ్చిమిర్చి, ఉల్లిపాయను ముక్కలు తరగి వేయాలి ● ఉల్లిపాయ ముక్కలు వేగాక ఖీమా, కొద్దిగా ఉప్పువేసి మూత పెట్టి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి ● సగం ఉడికిన ఖీమాలో పసుపు, జీలకర్ర పొడి, గరం మసాలా, మిరియాల పొడి వేసి కలపాలి ● ఖీమా పూర్తిగా ఉడికేంత వరకు మూత పెట్టి మగ్గనివ్వాలి ● ఖీమా ఉడికిన తరువాత గుడ్లసొనను వేసి రెండు నిమిషాలు పెద్ద మంట మీద తిప్పుతూ వేయించాలి ● ఇప్పుడు రుచికి సరిపడా ఉప్పు, కరివేపాకు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● గుడ్ల సొన చక్కగా వేగి నూనె పైకి తేలుతున్నప్పుడు కొత్తిమీర చల్లుకుని దించేయాలి ● అన్నం, చపాతీ,రోటీలకు ఇది మంచి సైడ్ డిష్.

ఎగ్ పనియారం



కావలసినవి: గుడ్లు – నాలుగు; మిరియాలపొడి – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – ఒకటి; క్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; బంగాళ దుంప – ఒకటి; కారం – అరటీస్పూను; ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – చిటికెడు; గరంమసాలా – పావు టీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; నూనె – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● క్యారట్, పచ్చిమిర్చి, క్యాప్సికం, ఉల్లిపాయ, బంగాళ దుంపలను సన్నని ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో టేబుల్ స్పూను నూనె వేసి కాగనివ్వాలి. బాగా వేడెక్కిన నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి ● ఉల్లిపాయ వేగాక క్యారట్, బంగాళ దుంప ముక్కలు వేసి కలియబెట్టాలి. మూతపెట్టి ఐదు నిమిషాలు మగ్గాలి ● తరువాత క్యాప్సికం ముక్కలు వేసి 5 నిమిషాలు వేయించాలి ● ఇప్పుడు కారం, ధనియాలపొడి, పసుపు, గరంమసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి ● ముక్కలన్నీ చక్కగా మగ్గాక కొత్తిమీర తరుగు వేసి మరోసారి కలిపి దించేయాలి ● ఒకగిన్నెలో గుడ్లసొన, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● ఇప్పుడు చల్లారిన ముక్కల మిశ్రమం గుడ్లసొనలో వేసి కలపాలి ● పనియారం ప్లేటులో నూనెవేసి వేడెక్కనివ్వాలి. బాగా కాగిన నూనెలో గుడ్ల మిశ్రమం వేసి మూతపెట్టాలి ● సన్నని మంటమీద మూడు నిమిషాలు కాల్చాలి. తరువాత రెండోవైపు తిప్పి నిమిషం పాటు కాల్చితే వేడివేడి ఎగ్ పనియారం రెడీ.

ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా



కావలసినవి: ఉడికించిన గుడ్లు – ఆరు; మటన్ ఖీమా – అరకేజీ; కారం – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; మిరియాల పొడి – టీస్పూను; కొత్తిమీర తరుగు – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చిమర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; బ్రెడ్ ముక్కల పొడి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● శుభ్రంగా కడిగిన మటన్ ఖీమాను మిక్సీజార్‌లో వేయాలి ● దీనిలో ఉప్పు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, మిరియాల పొడి, పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, బ్రెడ్ ముక్కల పొడి, టేబుల్ స్పూను నూనె వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని ఒక మాదిరి పరిమాణంలో ఉండలుగా చుట్టుకోవాలి ● ఇప్పుడు ఉడికించిన గుడ్ల పెంకు తీసేయాలి ● ఖీమా ఉండను తెరిచి గుడ్డును లోపలపెట్టి ఖీమా మిశ్రమంతో కోఫ్తాలా వత్తుకోవాలి ● ఇలా ఆరు గుడ్లను కోఫ్తాలా తయారు చేసుకున్నాక, సన్నని మంటమీద డీప్‌ఫ్రైచేయాలి ● కోఫ్తా బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించితే ఎగ్‌మటన్ నర్గీసి కోఫ్తా రెడీ ● కోఫ్తాను మధ్యలో రెండు సగాలుగా కట్ చేసి నచ్చిన సాస్‌తో సర్వ్‌చేసుకోవాలి.

బ్రకోలి మఫిన్స్



కావలసినవి: బ్రకోలి తరుగు – కప్పు; ఎర్రక్యాప్సికం – ఒకటి; క్యారట్ – ఒకటి; ఉల్లిపాయ – ఒకటి; గుడ్లు – ఎనిమిది; ఛీజ్ – ముప్పావు కప్పు; ఉప్పు – టీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను;

తయారీ: ● క్యాప్సికం, ఉల్లిపాయ, క్యారట్‌ను సన్నగా తరగాలి ● పెద్ద గిన్నెలో బ్రకోలి తరుగు, క్యారట్, క్యాప్సికం, ఉల్లిపాయ ముక్కలను వేసి చక్కగా కలపాలి ● ఈ ముక్కలను మఫిన్ ట్రేలో సమానంగా వేసుకోవాలి ● ఇప్పుడు గుడ్లసొనను ఒకగిన్నెలో వేసి, ఉప్పు, మిరియాలపొడి పోసి నురగ వచ్చేంతవరకు కలుపుకోవాలి ● మఫిన్ ట్రేలో వేసిన బ్రకోలి మిశ్రమంపై గుడ్లసొనను పోసుకోవాలి ● అన్నింటిలో పోశాక ఇరవై నిమిషాలపాటు బేక్ చేస్తే బ్రకోలి మఫిన్స్ రెడీ.

బనానా ఆమ్లెట్



కావలసినవి: అరటి పండు – ఒకటి; గుడ్లు – రెండు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – టీస్పూను;కారం – అరటీస్పూను; నూనె – ఆమ్లెట్ వేయించడానికి సరిపడా.

తయారీ: ● అరటిపండును ముక్కలుగా తరగాలి ● మిక్సీజార్‌లో అరటిపండు ముక్కలు, గుడ్ల సొన, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి నురగ వచ్చేంత వరకు గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు పెనం మీద నూనె వేసి గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఆమ్లెట్‌లా పోసుకోవాలి ● సన్నని మంట మీద రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే బనానా ఆమ్లెట్ రెడీ.

పాలకూర చికెన్ ఎగ్ బైట్స్

కావలసినవి: పాలకూర – రెండు కప్పులు; గుడ్లు – పది; పాలు – ముప్పావు కప్పు; చీజ్ తరుగు – అరకప్పు; ఉడికించిన చికెన్ ముక్కలు – పది; ఉప్పు, మిరియాలపొడి – రుచికి సరిపడా.

తయారీ: ● పాలకూర, చికెన్ ముక్కలను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో గుడ్ల సొన వేయాలి. దీనిలో పాలు, చికెన్, పాలకూర ముక్కలు వేసి కలపాలి ● చివరిగా రుచికి సరిపడా, ఉప్పు, మిరియాల పొడి వేసి నురగ వచ్చేంత వరకు బాగా కలపాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్‌లతో మఫిన్ ట్రేలో వేసి అర టగంటపాటు బేక్ చేస్తే పాలకూర చికెన్ ఎగ్ బైట్స్ రెడీ.



సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 8-9-2023

యువర్స్

● ఇన్నోవేషన్


హర్షిత్ - అభిక్ సాహ

ది కింగ్ ఆఫ్ టెక్నో

విజయానికి తొలి మెట్టు పట్టుదల

స్కూల్ రోజుల్లో కంప్యూటర్ సైన్స్ యూనిట్ టెస్ట్‌లో ఫెయిలైన ఏకైక విద్యార్థికి సాంకేతికతపై పట్టు సాధించాలనే పట్టుదల పెరిగితే ఎలా ఉంటుంది? అచ్చం... అభిక్ సాహ లా ఉంటుంది. పశ్చిమబెంగాల్‌కు చెందిన అభిక్ సాహ పదిహేను సంవత్సరాల వయసులోనే దేశీ సెర్చ్ ఇంజిన్‌ను డెవలప్ చేసి భేష్ అనిపించుకున్నాడు. స్నేహితుడు హర్షిత్ జైన్‌తో కలిసి మొదలు పెట్టిన డీ సెంట్రలైజ్‌డ్ క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ గేమ్' విజయపథంలో దూసుకుపోతోంది.

కంప్యూటర్ సైన్స్ యూనిట్ టెస్ట్‌లో ఫెయిల్ అయిన ఏకైక విద్యార్థి అభిక్ సాహ. అది తనపై బలమైన ప్రభావం చూపించింది. సాంకేతికతపై పట్టు సాధించాలనే పట్టుదలను పెంచింది. కంప్యూటర్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవడాన్ని ఒకప్పుడు బోర్‌గా ఫీలైన సాహ ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు.

ఇంటర్నెట్‌ను విశ్వవిద్యాలయం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ట్యుటోరియల్ ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టాడు. బేసిక్ సాఫ్ట్‌వేర్ నుంచి వెబ్‌సైట్ బ్లాకింగ్ వరకు ఎన్నో విషయాలపై పట్టు సాధించాడు. పదమూడవ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి తనకు స్మార్ట్‌ఫోన్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. ప్రపంచ సాంకేతికతపై అవగాహన పెంచుకోవడానికి, రకరకాల మొబైల్ అప్లికేషన్‌లను క్రియేట్ చేయడానికి ఈ స్మార్ట్‌ఫోన్ ఉపయోగపడింది.

పదిహేను సంవత్సరాల వయసులో వినూత్నమైన దేశీ సెర్చ్ ఇంజిన్ 'ఒరిగాన్'ను డెవలప్ చేయడం ద్వారా వార్తల్లోకి వచ్చి 'భేష్' అనిపించుకున్నాడు అభిక్ సాహ. పశ్చిమ బెంగాల్‌లోని చల్స పట్టణానికి చెందిన సాహ హైస్కూల్ రోజుల్లోనే మొబైల్ అప్లికేషన్‌లు, వెబ్‌సైట్ బిల్డింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అండ్ డెవలపింగ్ లాంగ్వేజిలపై ఉచిత వీడియో ట్యుటోరియల్స్ నిర్వహించడంలో తలమునకలై ఉండేవాడు.

> కంప్యూటర్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవడాన్ని ఒకప్పుడు బోర్‌గా ఫీలైన సాహ ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు. ఇంటర్నెట్‌ను విశ్వవిద్యాలయం చేసుకున్నాడు. ఆన్‌లైన్ ట్యుటోరియల్ ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టాడు.

●●●

ఇండియన్ ఇ-స్పోర్ట్స్ వృద్ధిరేటు ఆశాజనకంగా, ఉత్సాహంగా ఉందని, 2027 కల్లా భారీ వృద్ధిరేటు కనిపిస్తుందని కంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) రిపోర్ట్ తెలియజేస్తుంది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రకరకాల టోర్నమెంట్స్‌ను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది వీక్షిస్తున్నారు. మన దేశంలో ఇ-గేమ్స్‌కు పెరుగుతున్న పాపులారిటీని గమనించి హర్షిత్ జైన్, అభిక్ సాహ డీసెంట్రలైజ్‌డ్ క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ ప్లే' ప్రారంభించారు.

దీన్ని 'నెక్స్ బిగ్ వోటీటీ' లక్ష్యంగా మొదలు పెట్టారు.

గేమ్ ఆడాలనే ఉత్సాహం ఒక కోణం అయితే ఖర్చును దృష్టిలో పెట్టుకొని దూరంగా ఉండడం మరో కోణం. పీసీ, కీబోర్డ్, హై-కంప్యూటింగ్ సీపీయూ సెటప్ వరకు ఎంతో ఖర్చు అవుతుంది. అయితే క్లౌడ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'వోర్లీ ప్లే'తో యూజర్‌లు మంత్లీ ప్లాన్ రూ.499 ద్వారా డిఫరెంట్ స్టోర్స్ నుంచి ఎన్నో టైటిల్స్‌తో యాక్సెస్ కావచ్చు. హై-ప్రాసెసింగ్ సీపీయూలాంటి అడ్వాన్స్‌డ్ గేమింగ్ ఎక్విప్‌మెంట్ అవసరం లేదు.

యూజర్స్ తమ దగ్గర ఉన్న ఏ డివైజ్ ద్వారా అయినా గేమ్స్‌తో యాక్సెస్ కావచ్చు.

'ఒక విధంగా చెప్పాలంటే ఇది సైబర్ కేఫ్‌లాంటిది అనుకోవచ్చు. నిర్ణీతమైన టైమ్‌కు కొంత డబ్బు చెల్లించి ఇంటర్నెట్‌తో యాక్సెస్ కావడంలాంటిది' అంటాడు కంపెనీ కో-ఫౌండర్, సీయివో హర్షిత్ జైన్.

బేరింగ్ క్యాపిటల్, ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ వెంచర్స్ 'వోర్లీ ప్లే'కు సీడ్ ఫండింగ్ చేశాయి. కునాల్ షా, సూరజ్ నళిన్, అమృత్ శ్రీవాస్తవ, జితేంద్ర గుప్తా ఏంజెల్ ఇన్వెస్టర్‌లు. గత నెలలలో అధికారికంగా లాంచ్ అయిన 'వన్ ప్లేయర్'కు 27,000 రిజిస్టర్డ్ యూజర్‌లు, 5,000 ప్లేయింగ్ సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'కేవలం గేమ్స్ ఆడడం మాత్రమే కాదు క్లౌడ్‌లో ప్రతీది చేయవచ్చు. ఉదాహరణకు 3డీ సాఫ్ట్‌వేర్‌ను రన్ చేయడం లాంటివి' అంటున్నాడు కంపెనీ కో-ఫౌండర్, సీటీవో అభిక్ సాహ.

● టెక్.. టాక్

గూగుల్ హై-క్వాలిటీ స్టిల్ ఇమేజ్ కాపీ ఫీచర్



క్రోమ్ బ్రౌజర్ కోసం గూగుల్ కొత్త ఫీచర్‌ను ప్రకటించింది. దీని ద్వారా యూజర్‌లు యూట్యూబ్, ఇతర సైట్‌ల నుంచి హై-క్వాలిటీ స్టిల్ ఇమేజ్‌లను కాపీ చేసుకోవచ్చు. స్టూడెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. ఈ ఫీచర్‌ని ఉపయోగించడానికి...

- వీడియోను పాజ్ చేసి....రైట్-క్లిక్
- మెనూ నుంచి 'కాపీ వీడియో ఫ్రేమ్' సెలెక్ట్ చేసుకోవాలి.
- కాపీడ్ ఫ్రేమ్ సోర్స్ వీడియోలాగే సేమ్ రిజల్యూషన్‌తో ఉంటుంది.

ఇన్‌ఫినిక్స్ జీరో 30

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు బరువు: 185 గ్రా.
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
మెమోరీ: 256జీబి 8జీబి/12జీబి ర్యామ్
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ



మోటోరోలా మోటో జీ84 5జీ



డిస్‌ప్లే: 6.55 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్ స్టోరేజ్: 12జీబి ర్యామ్ అండ్ 256జీబి రిజల్యూషన్: 2400×1080 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్ సపోర్ట్: 5జీ, జీపీఎస్, బ్లూటూత్, ఎన్ఎఫ్‌సీ, యుఎస్‌బి

రీల్ పరిమితి 3 నుంచి 10



మెటా వారి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ 'రీల్' పరిమితిని 3 లేదా 10 నిమిషాలకు పెంచడానికి సంబంధించి పరీక్షిస్తున్నారు. దీని ద్వారా ఎడ్యుకేషన్, స్కిట్స్, మేకప్ ట్యుటోరియల్, వంటలు... మొదలైన వాటికి సంబంధించి కంటెంట్ క్రియేటర్‌లకు ఉపయోగపడుతుంది. ఈ నెలలో ఇన్‌స్టాగ్రామ్ 'యాడ్ యూజర్స్ స్టిక్కర్'లాంటి ఫీచర్స్‌ని తీసుకువచ్చింది.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

బీ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ



ఏదైనా విషయంలో పొరబడడం, తప్పుగా అర్థం చేసుకోవడం, తప్పుదోవ పట్టడం...ఇలాంటి సందర్భంలో ఉపయోగించే మాట....

'బీ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ'

ఉదా: ఇఫ్ యూ ప్లాన్ టు బికమ్ ఏ రైటర్ బికాజ్ ఇట్ విల్ మేక్ యూ లాట్ ఆఫ్ మనీ, యూ ఆర్ బార్కింగ్ అప్ ది రాంగ్ ట్రీ

ఆకాశమే మృత్యుపాశమై...

రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ బాల్డర్స్ గేట్-3 విడుదల అయింది. 'బాల్డర్స్ గేట్' సిరీస్‌లో ఇది థర్డ్ మెయిన్ గేమ్. సింగిల్-ప్లేయర్ అండ్ కోఆపరేటివ్ మల్టీప్లేయర్ ఎలిమెంట్ ఉన్న ఈ గేమ్‌లో ప్లేయర్ ఒకటికి మించి క్యారెక్టర్లు సృష్టించవచ్చు. సిరీస్‌లో గత గేమ్‌లలాగే బాల్డర్స్ గేట్-3 టర్న్-బేస్‌డ్ కంబాట్ గేమ్. 'బాల్డర్స్ గేట్-2' తరువాత 120 సంవత్సరాలకు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సాగే ఆట ఇది.

జానర్స్: రోల్-ప్లేయింగ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్5, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

● గేమింగ్



● మ్యూజిక్ వరల్డ్

నీ గానం వెన్నెల వాన


రవీనా అరోర

టీనేజ్‌లో న్యూయార్క్‌కు వెళ్లిన రవీనా అరోరా సింగర్, సాంగ్ రైటర్‌గా మంచి పేరు తెచ్చుకుంది 'స్వీట్ టైమ్' 'టెంప్టేషన్' 'హనీ' పాటలతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. ఇక లైవ్ షోలలో పాశ్చాత్య ప్రేక్షకులను హిందీ సాంగ్స్‌తో అలరిస్తుంటుంది. స్టేజీ మీద ఉన్నట్టుండీ...'వుయ్ ఆర్ గోయింగ్ టు సింగ్ ఇన్ హిందీ నౌ' అని ప్రకటిస్తుంది. ఆడిటోరియమ్ కేకలతో నిండిపోతున్న సమయంలో 'ఏక్, దో, తీన్, చార్, చలోనా, మేరె సాత్' అంటూ హిందీ పాట అందుకుంటుంది. 60,70లలోని హిందీ చిత్రాల పాటలను పాడుతూ కూడా ఈతరం కుర్రకారును ఆకట్టుకుంటుంది.

'సంగీతంలో భిన్న ధోరణులను అన్వేషించడం ఇష్టం' అంటున్న అరోరాకు లతా మంగేష్కర్, ఆశా భోంస్లేలా స్వరం ఇష్టం. భావగర్భితమైన పాట ఇష్టం. రవీనా పాటలు 'ఆహా, ఒహో'లకు పరిమితమైన పసందైన పాటలు కాదు. ఎన్నో సామాజిక సమస్యలు ఆమె పాటలో భాగమై ఉంటాయి.

'ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా, తమను తాము ప్రేమించుకునేలా, తమను తాము స్పష్టంగా అర్థం చేసుకునేలా, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా నా పాట ఉండాలనుకుంటాను' అంటోంది రవీనా అరోరా.

సినిమా

చలో వియత్నామ్


● నిఖిల్

హీరో నిఖిల్ సిద్ధార్థ వియత్నామ్‌లో వాలిపోయారు. ఏదో వెకేషన్‌కి వెళ్లుంటారేమో అనుకుంటే పొరబడినట్టే. తన తాజా పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' కోసం నెల రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకునేందుకు వియత్నామ్ వెళ్లారాయన. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించనున్న మూవీ 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. యుద్ధం నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో యోధునిగా కనిపించనున్నారు నిఖిల్. ఈ పాత్రకు సంబంధించి ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారు. సైగాన్‌లోని కొంతమంది బిగ్గెస్ట్ స్టంట్ మాస్టర్‌లు 'స్వయంభూ' యూనిట్లో భాగంగా ఉండి యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం నిఖిల్‌కి శిక్షణ ఇస్తారు. నెల రోజుల పాటు శిక్షణ తీసుకోనున్నారు నిఖిల్. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: మనోజ్ పరమహంస, సహనిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.

చాలా బాగుందే...


● మాళ్వీ, రాజ్‌తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లు. మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చాలా బాగుందే...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, చైతు సత్సంగి, లిప్సిక పాడారు. ''పూర్తి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'తిరగబడర సామీ'. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రాలపై వచ్చే 'చాలా బాగుందే..' పాట మనసుని హత్తుకునే అద్భుతమైన మెలోడీగా సాగుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జవహర్ రెడ్డి యంఎన్.

యువత గెలవాలి

- సిద్ధార్థ్


● అభయ్ నవీన్, సిద్ధార్థ్

''రామన్న యూత్ టైటిల్ బాగుంది. అభయ్ నాకు ఇష్టమైన నటుడు. ఈ సినిమాలో ఒక కథను కాకుండా తన జీవితంలో చూసిన ఊరి అనుభవాలను తెరకెక్కించాడు. ట్రైలర్‌లో వినోదం, భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఎక్కడైనా యువత గెలవాలి.. అలా ఈ 'రామన్న యూత్' కూడా గెలవాలి'' అని హీరో సిద్ధార్థ్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సిద్ధార్థ్ విడుదల చేశారు. అభయ్ నవీన్ మాట్లాడుతూ– ''ఒక ఊరిలో రాజకీయ నాయకుడిగా ఎదగాలనుకుని రాజు అనే యువకుడు చేసిన ప్రయత్నాలు అతని జీవితాన్ని ఎలా మార్చాయి? అనేది సినిమాలో చూపిస్తున్నాం. గ్రామీణ నేపథ్యంలో సాగే పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కమ్రాన్, కెమెరా: ఫహాద్ అబ్దుల్ మజీద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ ఎంఎస్‌కే.

రుద్రంకోట నేపథ్యంలో...


● అనిల్, విభీష

అనిల్ ఆర్క కండవల్లి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'రుద్రంకోట'. నటి జయలలిత ఓ కీలక పాత్రలో నటించి, చిత్ర సమర్పకురాలిగా వ్యవహరించారు. రాము కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విభీష, రియా హీరోయిన్లు. ఏఆర్‌కె విజువల్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమాని ఈ నెల 22న స్కీన్ మాక్స్ పిక్చర్స్ సంస్థ ద్వారా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హీరో, నిర్మాత అనిల్ ఆర్క కండవల్లి మాట్లాడుతూ– ''స్మశాన వాటికలో పెరిగిన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కోటిగారు మా చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఆదిమల్ల సంజీవ్, సంగీతం: సుభాష్ ఆనంద్, నిరంజన్.

నిర్మాత కావాలన్నదే లక్ష్యం


● నవీన్

''కృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలు చూసి హీరో అవుదామని ఇండస్ట్రీకి వచ్చాను. కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, అలీగార్ల స్ఫూర్తితో హాస్య నటుడిగా నాకంటూ గుర్తింపు తెచ్చుకున్నందుకు సంతోషంగా ఉంది. నిర్మాత కావాలన్నదే నా లక్ష్యం.. అలాగే ఒక సింగిల్ స్క్రీన్ థియేటర్ నిర్మించాలన్నది నా కల'' అని నటుడు గడ్డం నవీన్ అన్నారు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్', వెంకటేష్ 'సైంధవ్' చిత్రాలతో పాటు 'భైరవ కోన', 'మిస్టరీ, 'వృషభ', 'చూ మంతర్', 'భూతద్దం భాస్కర్' వంటి పలు సినిమాల్లో నటిస్తున్న ఆయన మాట్లాడుతూ– ''ఇప్పటి వరకూ 150 సినిమాలు చేస్తే, వాటిలో 90 చిత్రాల్లో మంచి పాత్రలొచ్చాయి. ఈ ఏడాది సంతృప్తికరమైన ప్రయాణం సాగుతోంది'' అన్నారు.

డైరెక్షన్.. యాక్షన్...

యాక్షన్ మాత్రమే కాదు.. కొందరు స్టార్స్‌లో డైరెక్షన్ చేసే టాలెంట్ కూడా ఉంటుంది. అయితే యాక్షన్ ఫ్రంట్ సీట్.. డైరెక్షన్ బ్యాక్ సీట్‌లో ఉంటుంది. అందుకే డైరెక్షన్‌కి గ్యాప్ ఇచ్చి, యాక్షన్‌కి మాత్రం నో గ్యాప్ అంటారు. అలా కొందరు హీరోలు డైరెక్షన్ సీట్‌కి చాలా సంవత్సరాలు గ్యాప్ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ మెగాఫోన్ పట్టుకుని 'స్టార్ట్ కెమెరా.. యాక్షన్' అంటున్నారు. కొందరు స్టార్స్ ఇటు కెమెరా వెనకాల డైరెక్షన్ చేస్తూ అటు కెమెరా ముందు యాక్షన్ చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● సుదీప్ ● ధనుష్ ● ఉపేంద్ర

ఆరేళ్లకు...

కెరీర్‌లో 50వ సినిమా అంటే ఏ ఆర్టిస్టుకైనా ప్రత్యేకమే. కోలీవుడ్ హీరో ధనుష్ కూడా తన 50వ సినిమాని చాలా స్పెషల్ అనుకున్నారు. అందుకే తన హాఫ్ సెంచరీ సినిమాలో తానే నటిస్తూ, దర్శకత్వం కూడా వహిస్తున్నారు. హీరోగా దాదాపు 30 సినిమాల్లో నటించిన తర్వాత 'పా. పాండి' (2017) చిత్రం కోసం తొలిసారి ధనుష్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టారు. ధనుష్ నటించి, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి చెప్పుకోదగ్గ ఆదరణ లభించింది. దీంతో 2019లో దర్శకుడుగా ధనుష్ మరో మూవీని తెరకెక్కించాలనుకున్నారు. కానీ ఎందుకో కుదర్లేదు. అయితే ఈ ఏడాది జూలైలో తన దర్శకత్వంలోని రెండో చిత్రం సెట్స్‌పైకి వెళ్లినట్లుగా ధనుష్ వెల్లడించారు. ఇలా దాదాపు ఆరేళ్ల తర్వాత దర్శకుడిగా మరోసారి మెగాఫోన్ పట్టారు. ఇక నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో సందీప్ కిషన్ ఓ కీ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రంలో అనిఖా సురేంద్రన్, ఎస్‌జే సూర్య, విష్ణు విశాల్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారని టాక్.

ఏడేళ్ల తర్వాత...

యాక్టర్‌గా తెలుగు ప్రేక్షకుల్లో కన్నడ స్టార్ ఉపేంద్రకు ఎంత పాపులారిటీ ఉందో, ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలకూ అంతే క్రేజ్ ఉంది. 'ష్..! (1993)', 'ఓం (1995)', 'ఉపేంద్ర (1999)' వంటి సినిమాల్లో నటించి, దర్శకత్వం వహించారు ఉపేంద్ర. కన్నడంలో ఆయన దర్శకత్వంలో రూపొందిన కొన్ని సినిమాలు తెలుగులో అనువాదమై, ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే 2015లో వచ్చిన 'ఉప్పి 2' తర్వాత దర్శకుడిగా ఉపేంద్ర గ్యాప్ తీసుకున్నారు. ఏడేళ్ల తర్వాత 2022లో 'యూఐ' సినిమా వర్క్స్‌ను మొదలు పెట్టారు ఉపేంద్ర. ఆయన నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా ఉపేంద్ర అండ్ టీమ్ పేర్కొంది. కన్నడ, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

పదేళ్లకు...

కన్నడ స్టార్ హీరోల్లో ఒకరైన సుదీప్ దర్శకుడిగా ఆరు సినిమాలను తెరకెక్కించారు. కానీ ఈ ఆరూ రీమేక్ చిత్రాలే కావడం విశేషం. తమిళ 'ఆటోగ్రాఫ్'ని కన్నడంలో 'మై ఆటోగ్రాఫ్' (2006)గా రీమేక్ చేసి, నటించారు సుదీప్. అలాగే దర్శకుడిగా తెలుగు హిట్ ఫిల్మ్ 'మిర్చి (2013)' కన్నడ రీమేక్ 'మాణిక్య (2014)'లో టైటిల్ రోల్ చేసి, ఈ సినిమాకు దర్శకత్వం వహించారు సుదీప్. ఈ సినిమా తర్వాత సుదీప్ మళ్లీ మెగాఫోన్ పట్టలేదు. మళ్లీ దశాబ్దం తర్వాత అంటే... 2024లో సుదీప్ నటించి, దర్శకత్వం వహించనున్న 'కేకే' (వర్కింగ్ టైటిల్) సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'దేవుడు క్షమిస్తాడు.. నేను కాదు...!' అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే కథతో సాగనున్నట్లుగా తెలుస్తోంది. ఇక దర్శకుడిగా ఇప్పటివరకూ రీమేక్ చిత్రాలే చేసిన సుదీప్.. ఈ ఏడవ సినిమాని స్ట్రయిట్ కథతో తీయనున్నారా లేక రీమేకా? అనేది తెలియాల్సి ఉంది. ఇక 'ఈగ', 'బాహుబలి: ది బిగినింగ్', 'సైరా: నరసింహారెడ్డి' చిత్రాలతో సుదీప్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే.


● ఫర్హాన్ అక్తర్

పుష్కర కాలం తర్వాత...

'దిల్ చాహ్‌తా హై' (2001) చిత్రంతో రచయితగా, దర్శకుడిగా కెరీర్ ఆరంభించారు ఫర్హాన్ అక్తర్. 'డాన్: ది చేజ్ బిగిన్స్', 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' చిత్రాలతో దర్శకుడిగా తనదైన పేరు సంపాదించారు. అయితే 2011లో వచ్చిన 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్' చిత్రం తర్వాత నటుడిగా కాస్త బిజీ అయిన ఫర్హాన్ మరో సినిమాకు దర్శకత్వం వహించలేదు. పదేళ్ల తర్వాత 2021 ఆగస్టులో 'జీ లే జరా' చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ఫర్హాన్ వెల్లడించారు. ఆలియా భట్, ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ లీడ్ రోల్స్ చేయనున్న ఈ సినిమా షూటింగ్ కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. దీంతో తన డైరెక్షన్‌లోనే 'డాన్ 3' సినిమాను ప్రకటించారు ఫర్హాన్. అయితే ఈ సినిమాలో ఆయన నటించడం లేదు. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇలా ఫర్హాన్ దర్శకత్వంలోని మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి పుష్కరకాలం అంటే పన్నెండేళ్లు పట్టిందని చెప్పొచ్చు. 'డాన్ 3' చిత్రం 2025లో విడుదల కానుంది.

ఇలా కొంత విరామం తర్వాత దర్శకులుగా మెగాఫోన్ పట్టిన స్టార్స్ ఇంకొందరు ఉన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
385	116
66,266	19,727

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,738	▽	135
డోజోన్స్	34,520	△	77
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,442	△	16
డాక్స్	15,719	▽	23
షాంఘై	3,122	▽	36
నికాయ్	32,991	▽	249

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,329	△	27
బంగారం (99.5 స్వచ్ఛత)	59,091	△	27
వెండి (కేజీ)	72,065	△	166

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.35	84.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.31	105.72
€	యూరో	ఎస్‌బీఐ	87.69	90.81
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.50	57.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.92	54.91
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.04	61.95
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.76	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.31

అయిదో రోజూ లాభాల జోరు

- 66 వేల పైకి సెన్సెక్స్
- 19,700 ఎగువకు నిఫ్టీ
- క్రూడ్ ధరలు తగ్గిన నేపథ్యం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో అయిదో రోజూ లాభాల జోరు కొనసాగింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ షేర్లు 2% రాణించాయి. ఇటీవల పది నెలల గరిష్టానికి ఎగబాకిన క్రూడాయిల్ ధరలు దిగివచ్చాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా వారాంతపు ఎక్స్‌పైరీ ముగింపు రోజైన గురువారం సెన్సెక్స్ 385 పాయింట్లు బలపడి 66,000 స్థాయి పైన 66,266 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 65,672 వద్ద కనిష్టాన్ని, 66,297 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 19,700 స్థాయి ఎగువన 19,727 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల దృష్ట్యా ఉదయం సెషన్‌లో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే ద్వితీయార్థంలో క్యాపిటల్ గూడ్స్, బ్యాంకులు, విద్యుత్, రియల్టీ రంగాల షేర్లు డిమాండ్ లభించడంతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.759 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.28 కోట్ల ఈక్విటీలు కొన్నారు. రూపాయి విలువ పది పైసలు పతనమై జీవితకాల కనిష్టం 83.23 స్థాయి వద్ద స్థిరపడింది.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ 5 రోజుల్లో 1,434 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.9.50 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.319.10 లక్షల కోట్లకు చేరింది.
- నిఫ్టీ 50 సూచీలో కోల్ ఇండియా(7%), ,ఎల్ అండ్‌టీ(4%), టెక్ మహీంద్రా(2%), హెచ్‌సీఎల్(1.50%), ఎన్‌టీపీసీ(1%) షేర్లు ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఏడాది గరిష్టాన్ని అందుకున్నాయి.
- బ్లాక్ డీల్ ద్వారా 12 లక్షల ఈక్విటీలు చేతులు మారడంతో బీఎస్‌ఈలో జొమాటో షేరు 2% లాభపడి రూ.100 వద్ద స్థిరపడింది.
- బస్తా ధరల పెంపుతో ఇటీవల ర్యాలీ చేసిన సిమెంట్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

విజయవాడలో కార్స్24 హబ్

- 2025 నాటికి తొలి స్థానం
- లగ్జరీ విభాగంలోకి ఎంట్రీ
- కంపెనీ కో–ఫౌండర్ గజేంద్ర



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోటెక్ కంపెనీ కార్స్24 వచ్చే నెలలో విజయవాడలో హబ్‌ను ప్రారంభిస్తోంది. 200 కార్లు పార్క్ చేయగలిగే సామర్థ్యంతో ఈ కేంద్రం రానుందని కార్స్24 కో–ఫౌండర్ గజేంద్ర జంగిడ్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'దేశవ్యాప్తంగా పాత కార్ల క్రయవిక్రయాల్లో 8 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్–తెలంగాణ మార్కెట్ 8వ స్థానంలో ఉంది. కార్స్24 వ్యాపారంలో ఢిల్లీ రాజధాని ప్రాంతం, మహారాష్ట్ర, కర్ణాటక తర్వాత తెలుగు రాష్ట్రాలు 15 శాతం వాటాతో నాల్గవ స్థానంలో ఉన్నాయి. కొత్త కార్లకు రుణం సులభంగా లభిస్తుంది. పాత కార్ల విషయంలో రుణ లభ్యత అంత సులువు కాదు. యూజ్డ్ కార్ల రంగంలో విలువ ఉందని గ్రహించాం. సులభ వాయిదాల్లో వినియోగదార్లకు రుణం అందించాలన్న ధ్యేయంతో 2019లో నాన్‌–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్స్ దక్కించుకున్నాం. కంపెనీ కస్టమర్లలో దేశవ్యాప్తంగా 55 శాతం మంది రుణం ద్వారా కార్లు కొనుగోలు చేస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఈ సంఖ్య 65 శాతం ఉంది' అని వివరించారు.

కంపెనీ వృద్ధి 50 శాతం..

ఏడాది వారంటీతో సర్టిఫైడ్ కార్లను మాత్రమే విక్రయిస్తున్నామని గజేంద్ర తెలిపారు. 'కారుకు 140 క్వాలిటీ చెక్ పాయింట్ల ద్వారా మరమ్మతులు చేపడతాం. కారు నచ్చకపోతే ఏడు రోజుల్లో వెనక్కి ఇవ్వొచ్చు. అర్హత కలిగిన వినియోగదార్లకు జీరో డౌన్ పేమెంట్ సౌకర్యమూ ఉంది. కస్టమర్లలో 15% మహిళలు ఉన్నారు. పరిశ్రమ 15 శాతం వృద్ధి చెందితే, కార్స్24 ఏకంగా 50% నమోదు చేస్తోంది. వ్యవస్థీకృత రంగంలో రెండవ స్థానంలో ఉన్నాం. 2025 నాటికి తొలి స్థానం లక్ష్యంగా చేసుకున్నాం. ప్రస్తుతం యూజ్డ్ కార్స్ విపణిలో 5% వాటా సొంతం చేసుకున్నాం. వచ్చే ఏడాది రూ.30–50 లక్షల ధరల శ్రేణి విభాగంలోకి ఎంట్రీ ఇస్తాం. ఇప్పటి వరకు భారత్‌లో 8 లక్షల కార్లు విక్రయించాం. 2022–23లో ఈ సంఖ్య 2.5 లక్షల యూనిట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30% వృద్ధి ఆశిస్తున్నాం' అని వెల్లడించారు.

- ఆర్‌ఆర్ కేబుల్స్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ ఈ నెల 13న మొదలు కానుంది. తాజా ఈక్విటీ జారీని రూ.225 కోట్ల నుంచి రూ.180 కోట్లకు కంపెనీ తగ్గించుకుంది. ఇష్యూ 15న ముగుస్తుంది. ఈక్విటీ జారీ ద్వారా వచ్చే మొత్తం నుంచి రూ.136 కోట్లను రుణ భారం తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌–నెక్ / 100కు రూ.లలో)

8-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
7-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455–00
వరంగల్	457–00

నజారాలో ఎస్‌బీఐ ఎంఎఫ్ రూ.410 కోట్ల పెట్టుబడి

ముంబై: ప్రముఖ గేమింగ్, ఈ స్పోర్ట్స్ సేవల కంపెనీ నజారా టెక్నాలజీస్‌లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ భారీ పెట్టుబడులు పెట్టనుంది. నజారా టెక్నాలజీస్ ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్‌లో పాల్గొని రూ.410 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. నజారా టెక్నాలజీస్ రూ.4 ముఖ విలువ కలిగిన 57,42,296 షేర్లను, ఒక్కోటి రూ.714 చొప్పున జారీ చేయనుంది. ఈ విలువ రూ.409.90 కోట్లు, ఎస్‌బీఐ మల్టీక్యాప్ ఫండ్, ఎస్‌బీఐ మాగ్నమ్ గ్లోబల్ ఫండ్, ఎస్‌బీఐ టెక్నాలజీస్ అపార్చునిటీస్ ఫండ్ ద్వారా ఎస్‌బీఐ ఫండ్ ఈ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ నెల 4న జెరోదా వ్యవస్థాపకులైన నితిన్, నిఖిల్ కామత్ సోదరులు సైతం ఒక్కో షేరుకు ఇదే ధరపై రూ.100 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం.

భారత్‌లో ఫాక్స్‌కాన్ ఈవీ ప్లాంట్!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తైవాన్‌కు చెందిన చిప్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ భావిస్తోంది. అయితే ఫాక్స్‌కాన్ ఇతర ఈవీ కంపెనీల కోసం కాంట్రాక్ట్ తయారీ చేపడుతుందా లేదా సొంత బ్రాండ్ కింద మోడళ్లను విక్రయించబోతోందా అనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి తమిళనాడును తమ స్థావరంగా ఉపయోగించుకోవాలని ఫాక్స్‌కాన్ చైర్మన్ చర్చించినట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ మాతృ సంస్థ హాన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యంగ్ లేయో యూఎస్‌లోని ఓహియోతోపాటు థాయ్‌లాండ్‌లో ఈవీ ప్లాంటు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అలాగే అతి త్వరలో భారత్‌లో కూడా ఈవీ ఫ్యాక్టరీని నిర్మిస్తాం అని తెలిపారు.

బ్యాంక్‌లు మారాలి.. లేదంటే మూత: కేవీ కామత్



ముంబై: బ్యాంక్‌లు ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవాలని.. విధానాలు, పని నమూనాలను కాలానికి అనుగుణంగా పనిచేసేలా చూసుకోవాలని వెటరన్ బ్యాంకర్ కేవీ కామత్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా చేయలేని బ్యాంక్‌లు వాటి దుకాణాలను మూతేసుకోవాల్సి వస్తుందని కొంత హెచ్చరికగా పేర్కొన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంక్‌లు నూతనతరం ఫిన్‌టెక్ కంపెనీలతో కలిసి పనిచేయాలన్నారు.

జనాదరణ పథకాలకు ఆర్‌బీఐ డబ్బు

- రూ.3 లక్షల కోట్ల బదిలీకి కేంద్రంలో కొందరి విఫల యత్నం
- 2018 సార్వత్రిక ఎన్నికల ముందు విషయాన్ని బయటపెట్టిన మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ డిప్యూటీ గవర్నర్ విరాల్ వి. ఆచార్య తన పుస్తకం కొత్త ఎడిషన్ 'ముందు మాట'గా రాసిన కొన్ని అంశాలు తాజాగా ఆసక్తికరంగా మారాయి. '' 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు 2018లో ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ నుంచి జనాదరణ పథకాల వ్యయాలకు రూ. 2 నుంచి 3 లక్షల కోట్లను పొందాలని కేంద్ర ప్రభుత్వంలోకి కొందరు చేసిన ప్లాన్ (రైడ్)ను సెంట్రల్ బ్యాంక్ ప్రతిఘటించింది. ఇది స్పష్టంగా ప్రభుత్వం– ఆర్‌బీఐ మధ్య విభేదాలకు దారితీసింది. సెంట్రల్ బ్యాంక్‌కు సంబంధిత ఆదేశాలు జారీ చేయడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టంలోని ఎన్నడూ ఉపయోగించని సెక్షన్ 7ను అమలు చేయాలని ఆలోచించే స్థాయికి పరిస్థితి వెళ్లింది'' అని రాసిన అంశాలు ఆసక్తికరంగా మారాయి.'క్వెస్ట్ ఫర్ రీస్టోరింగ్ ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఇన్ ఇండియా' శీర్షికతో ప్రజల ముందు ఉంచిన తన పుస్తకం తాజా ఎడిషన్ ముందు మాటలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''కేంద్ర ఆర్థిక లోటు భర్తీకి బ్యాక్‌డోర్ మానిటైజేషన్'' అని ఆయన ఈ వ్యవహారాన్ని అభివర్ణించడం గమనార్హం. 2017 జనవరి 20వ తేదీ నుంచి 2019 జూన్ వరకూ దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు విరాల్ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో ఆయన డిప్యూటీ గవర్నర్‌గా మానిటరీ పాలసీ, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఫైనాన్షియల్ స్థిరత్వం–రిసెర్చ్ విభాగం ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఆరు నెలల ముందుగానే ఆయన అప్పట్లో రాజీనామా చేశారు.

విరాల్ రాసిన అంశాల్లో కొన్ని...

- ఆర్‌బీఐ ప్రతి సంవత్సరం తన లాభంలో కొంత భాగాన్ని ప్రభుత్వానికి అందజేస్తుంది. 2016 డిమోనిటైజేషన్‌కు ముందు మూడేళ్లలో ప్రభుత్వానికి రికార్డు లాభాలను బదిలీ చేసింది.
- నోట్ల రద్దు సంవత్సరంలో కరెన్సీ ముద్రణకు అయ్యే ఖర్చును కేంద్రానికి చేసిన బదిలీల నుంచి మినహాయించింది. ఫలితంగా 2019 ఎన్నికలకు ముందు ప్రభుత్వ నిధుల అవసరాలు మరింత పెరిగాయి. ఈ మొత్తాలను ఆర్‌బీఐ నుంచి పొందాలని బ్యూరోక్రాట్లు కొందరు ప్రయత్నించారు.
- స్వల్పకాలిక ప్రజాకర్షక వ్యయాల కోసం సెంట్రల్ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌పై దాడి చేసే ప్రణాళికలను పదేపదే ప్రతిపాదించినప్పుడు.. సహేతుకమైన సంస్థలతో కూడిన ప్రజాస్వామ్యయుతంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌ను కలిగి ఉన్న దేశంలోని ఏ ప్రభుత్వమైనా బలీయమైన ప్రతిఘటనను ఎదుర్కొనకుండా ముందుకు సాగలేదు. ఇలాంటి సందర్భాలే ఒక సహేతుక వ్యవస్థ ఏర్పాటుకు దారితీస్తాయి. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ల నుండి ప్రభుత్వానికి భవిష్యత్తులో బదిలీల కోసం సహేతుకమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి మాజీ గవర్నర్ బిమల్ జలాన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు కావడం ఇలాంటిదే. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ నుంచి భారీ నిధులు పొందాలని భావించిన వ్యక్తుల్లో పలువురిని ప్రభుత్వం పక్కన బెట్టడం కూడా జరిగింది.

2018లోనే 'విరాల్' వెల్లడి..

నిజానికి 2018 అక్టోబర్ 26న ఏడీ ష్రాఫ్ స్మారక ఉపన్యాసం సందర్భంగానే విరాల్ 'కేంద్రం– ఆర్‌బీఐ మధ్య విభేదాల విభేదాల అంశాన్ని మొదటిసారి సూచనప్రాయంగా ప్రస్తావించారు. తాజాగా అందుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించారు. ''కేంద్ర బ్యాంకు స్వాతంత్ర్యాన్ని గౌరవించని ప్రభుత్వాలు తక్షణం లేదా అటు తరువాత ఆర్థిక మార్కెట్ల ఆగ్రహానికి గురవడం ఖాయం. ఆయా పరిణామాలు ఆర్థిక అనిశ్చితికి, రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ దెబ్బతినే ప్రమాదానికి దారితీస్తాయి'' అని ఆయన అప్పట్లో పేర్కొన్నారు.

ఉర్జిత్ పటేల్ రాజీనామా ఇందుకేనా..?

తాజా అంశాలను విశ్లేషిస్తే...సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా 2018 డిసెంబర్‌లో ఉర్జిత్ పటేల్ రాజీనామాకు.. తాజాగా విరాల్ లేవనెత్తిన అంశానికీ ఏదైనా సంబంధం ఉందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అప్పట్లో ఉర్జిత్ పటేల్ ''వ్యక్తిగత కారణాలతో'' సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ బాధ్యతలకు రాజీనామా చేశారు. అప్పట్లో కేంద్రం–ఆర్‌బీఐ మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయన్న వార్తలు గుప్పుమన్నప్పటికీ దీనికి స్పష్టమైన కారణాలు తెలియలేదు. మూడేళ్ల పదవీ కాలం ముగిసేలోగా తన బాధ్యతలను మధ్యలోనే వదిలేసిన గవర్నర్‌గా పనిచేసిన అరుదైన సందర్భం ఆయనది.



ఫైనల్లో ఆకాశ్ కుమార్

ముస్తఫా హజ్రులాహోవిచ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ ఆకాశ్ కుమార్ (57 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బోస్నియా అండ్ హెర్జెగోవినా రాజధాని సారాయెవోలో జరుగుతున్న ఈ టోర్నీ సెమీఫైనల్లో ఆకాశ్ 5–0తో పాలస్తీనాకు చెందిన వసీమ్ అబుసాల్‌ను ఓడించాడు. భారత్‌కే చెందిన మనీశ్ కౌశిక్ (63.5 కేజీలు), మంజు రాణి (50 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

'బలోన్ డోర్' అవార్డు రేసులో మెస్సీ



ప్రతియేటా అత్యుత్తమ ఫుట్‌బాలర్లకు ఇచ్చే 'బలోన్ డోర్' పురస్కారం రేసులో అర్జెంటీనా స్టార్ మెస్సీ, ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాపెతో సహా 30 మంది ఉన్నారు. 2003 తర్వాత తొలిసారి పోర్చుగల్ స్టార్ ప్లేయర్ రొనాల్డో ఈ అవార్డు రేసులో లేకపోవడం గమనార్హం. అక్టోబర్ 30న విజేతను ప్రకటిస్తారు.

నెదర్లాండ్స్ ప్రపంచకప్ జట్టులో తేజ నిడమనూరు



అమ్‌స్టర్‌డామ్: భారత్ వేదికగా వచ్చే నెలలో జరిగే వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనే నెదర్లాండ్స్ క్రికెట్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే నెదర్లాండ్స్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 29 ఏళ్ల తేజ 1994లో విజయవాడలో పుట్టాడు. విద్యాభ్యాసం కోసం న్యూజిలాండ్ వెళ్లి అక్కడ కొన్నాళ్లు క్లబ్ క్రికెట్ ఆడాడు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా నెదర్లాండ్స్‌కు వెళ్లిన అతను జాతీయ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు తేజ నెదర్లాండ్స్ తరఫున 20 వన్డేలు ఆడి ఒక సెంచరీ సహాయంతో 511 పరుగులు చేశాడు. ఆరు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు కూడా ఆడాడు. ఐదోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న నెదర్లాండ్స్ గతంలో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. నెదర్లాండ్స్ తొలి రెండు మ్యాచ్‌లను హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో (అక్టోబర్ 6న పాకిస్తాన్‌తో; అక్టోబర్ 9న న్యూజిలాండ్‌తో) ఆడనుంది.

నెదర్లాండ్స్ జట్టు: స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), మాక్స్ ఒడౌడ్, బస్ డె లీడి, విక్రమ్ సింగ్, తేజ నిడమనూరు, ఆర్యన్ దత్, మీకెరెన్, అకెర్‌మన్, వాన్ డెర్ మెర్వ్, లొగాన్ వాన్ బీక్, రియాన్ క్లెయిన్, వెస్లీ బారెసి, సాకిబ్, షారిజ్ అహ్మద్, ఎంగెల్‌బ్రెచ్ట్.

శ్రీజకు నిరాశ



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో రెండో రౌండ్‌ను దాటలేకపోయింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 5–11, 6–11, 9–11తో ఇటో మిమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్‌లో తొలి రౌండ్‌లో 'బై' పొందిన శ్రీజ–దియా (భారత్) జోడీ రెండో రౌండ్‌లో 7–11, 6–11, 6–11తో సన్ యింగ్షా–వాంగ్ యిది (చైనా) జంట చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ–హర్మీత్ జోడీ 6–11, 7–11, 8–11తో తొమొకాజు–హినా హయాటా (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

అల్‌కరాజ్ అలవోకగా...

- వరుస సెట్‌లలో జ్వెరెవ్‌పై విజయం
- సెమీస్‌లో మాజీ విజేత మెద్వెదెవ్‌తో 'ఢీ'
- యూఎస్ ఓపెన్ టోర్నీ



అల్‌కరాజ్



మెద్వెదెవ్

న్యూయార్క్: గత పదిహేనేళ్లుగా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో వరుసగా రెండేళ్లు ఒకే ప్లేయర్‌కు టైటిల్ దక్కలేదు. ఈ ఘనత సాధించేందుకు ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ చేరువయ్యాడు. సీజన్ నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఈ స్పెయిన్ స్టార్ అలవోక విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. 12వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 2 గంటల 30 నిమిషాల్లో 6–3, 6–2, 6–4తో గెలుపొందాడు. మూడు ఏస్‌లు సంధించిన అల్‌కరాజ్ మూడు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేశాడు. నెట్‌వద్దకు 35 సార్లు దూసుకొచ్చిన అతను 28 సార్లు పాయింట్లు గెలిచాడు. నాలుగుసార్లు జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోలేదు. 2020లో ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన జ్వెరెవ్ నాలుగు డబుల్ ఫాల్ట్‌లు, 35 అనవసర తప్పిదాలు చేశాడు. మరో క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6–4, 6–3, 6–4తో ఎనిమిదో సీడ్, తన దేశానికే చెందిన ఆంద్రీ రుబ్లెవ్‌ను ఓడించి ఈ టోర్నీలో నాలుగోసారి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఫైనల్లో చోటు కోసం డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్‌తో మెద్వెదెవ్ తలపడతాడు. 2021లో చాంపియన్‌గా నిలిచిన మెద్వెదెవ్... 2020లో సెమీఫైనల్లో, 2019లో ఫైనల్లో ఓడిపోయాడు.

వొంద్రుసోవాకు కీస్ షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, ఈ ఏడాది వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) పోరాటం ముగిసింది. 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6–1, 6–4తో వొంద్రుసోవాను బోల్తా కొట్టించి ఈ టోర్నీలో 2018 తర్వాత మళ్లీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 86 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో కీస్ మూడుసార్లు వొంద్రుసోవా సర్వీస్‌ను బ్రేక్ చేసింది. సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్)తో కీస్; ముకోవా (చెక్ రిపబ్లిక్)తో కోకో గాఫ్ (అమెరికా) తలపడతారు.



రోహన్ బోపన్న మాథ్యూ ఎబ్డెన్

ఫైనల్లోకి ప్రవేశించి బోపన్న రికార్డు

పురుషుల డబుల్స్ విభాగంలో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7–6 (7/3), 6–2తో పియరీ హ్యూజ్ హెర్బర్ట్–నికోలస్ మహుట్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ తన ప్రత్యర్థి జంట సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. రాజీవ్ రామ్ (అమెరికా)–సాలిస్‌బరీ (బ్రిటన్); ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)–ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో బోపన్న జంట తలపడుతుంది. తాజా ఫలితంతో 43 ఏళ్ల బోపన్న ఓపెన్ శకంలో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. తన కెరీర్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో బోపన్న గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరడం ఇది రెండోసారి మాత్రమే. 2010లో ఐజామ్ ఖురేషి (పాకిస్తాన్)తో జతకట్టి యూఎస్ ఓపెన్‌లోనే ఫైనల్ చేరిన బోపన్న తుది పోరులో బాబ్ బ్రయాన్–మైక్ బ్రయాన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ ర్యాపిడ్ ఓపెన్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానంద, అలెగ్జాండర్ గ్రిషుక్ (రష్యా), విదిత్ సంతోష్ గుజరాతి (భారత్) ఐదు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. ప్రజ్ఞానందకు మూడో ర్యాంక్, గ్రిషుక్‌కు నాలుగో ర్యాంక్, విదిత్‌కు ఐదో ర్యాంక్ లభించాయి. గురువారం జరిగిన చివరి మూడు రౌండ్‌లలో 18 ఏళ్ల ప్రజ్ఞానంద సహచరులు విదిత్, ఇరిగేశి అర్జున్‌లపై గెలిచి భారత నంబర్‌వన్ దొమ్మరాజు గుకేశ్ చేతిలో ఓడిపోయాడు. 4.5 పాయింట్లతో గుకేశ్ ఆరో స్థానంలో నిలిచాడు. 3 పాయింట్లతో అర్జున్ తొమ్మిదో స్థానంలో, పెంటేల హరికృష్ణ 2.5 పాయింట్లతో చివరిదైన పదో స్థానంలో నిలిచారు. 7 పాయింట్లతో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమి వచీర్ లాగ్రెవ్ చాంపియన్‌గా అవతరించగా... 5.5 పాయింట్లతో తైమూర్ రజబోవ్ (అజర్‌బైజాన్) రన్నరప్‌గా నిలిచాడు. నేడు, రేపు బ్లిట్జ్ ఫార్మాట్‌లో టోర్నీ జరుగుతుంది.

'షూటౌట్'లో భారత్ ఓటమి



చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): కింగ్స్ కప్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు మూడో స్థానం కోసం పోటీపడనుంది. ఇరాక్ జట్టుతో గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 'పెనాల్టీ షూటౌట్'లో 4–5 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. టోర్నీ నిబంధనల ప్రకారం అదనపు సమయం ఆడించకుండా నేరుగా 'షూటౌట్' ద్వారా ఫలితాన్ని నిర్ణయించారు. 'షూటౌట్'లో తొలి షాట్‌ను భారత ప్లేయర్ బ్రాండన్ ఫెర్నాండెజ్ గోల్ పోస్ట్‌కు కొట్టాడు. ఆ తర్వాత సందేశ్ జింగాన్, సురేశ్, అన్వర్ అలీ, రహీమ్ అలీ గోల్స్ చేశారు. ఇరాక్ తరఫున ఐదుగురు ఆటగాళ్లు గోల్స్ సాధించడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు భారత్ తరఫున మహేశ్ 16వ నిమిషంలో తొలి గోల్ చేశాడు. 28వ నిమిషంలో కరీమ్ అలీ గోల్‌తో ఇరాక్ స్కోరును 1–1తో సమం చేసింది. 51వ నిమిషంలో ఇరాక్ కెప్టెన్ జలాల్ హసన్ సెల్ఫ్ గోల్‌తో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. 79వ నిమిషంలో అయ్‌మెన్ గోల్‌తో ఇరాక్ 2–2తో స్కోరును సమం చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 70వ స్థానంలో ఉన్న ఇరాక్‌పై భారత్ ఏనాడూ గెలవలేదు. ఇప్పటి వరకు రెండు జట్లు ఏడుసార్లు తలపడ్డాయి. ఆరు మ్యాచ్‌ల్లో ఇరాక్ నెగ్గగా, మరో మ్యాచ్ 'డ్రా' అయింది. లెబనాన్, థాయ్‌లాండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ పరాజిత జట్టుతో మూడో స్థానం కోసం భారత్ తలపడుతుంది.

ఈనెల 21 నుంచి ఐఎస్‌ఎల్

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) 2023–2024 సీజన్‌కు ఈ నెల 21న తెర లేవనుంది. కొచ్చిలో కేరళ బ్లాస్టర్స్, బెంగళూరు ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్‌తో ఐఎస్‌ఎల్ పదో సీజన్ మొదలవుతుంది. డిసెంబర్ 29 వరకు తొలి అర్ధభాగం మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మొత్తం 12 జట్లు బరిలో ఉన్నాయి. అయితే ఆసియా క్రీడలు జరిగే సమయంలోనే ఈ లీగ్ జరుగుతుండగా... ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న 22 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో ఐఎస్‌ఎల్‌లోని 10 క్లబ్‌లకు చెందిన ఆటగాళ్లు ఉన్నారు. ఆసియా క్రీడల కోసం తమ ఆటగాళ్లను విడుదల చేసేందుకు కొన్ని క్లబ్‌లు విముఖత వ్యక్తం చేస్తున్నాయని తెలిసింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23న మొదలవుతున్నా... ఫుట్‌బాల్ మ్యాచ్‌లు మాత్రం సెప్టెంబర్ 19 నుంచి జరుగుతాయి. భారత్ తమ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లను సెప్టెంబర్ 19న చైనాతో, 21న బంగ్లాదేశ్‌తో, 24న మయన్మార్‌తో ఆడుతుంది.

చిక్కిన మరో చిరుత



- తిరుమలలో గత రెండు నెలల్లో బోనులో చిక్కిన 5 చిరుతలు
- మరో 2 చిరుతలు సంచరిస్తున్నట్లు టీటీడీ అధికారుల వెల్లడి


తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడవ మైలు వద్ద నరసింహస్వామి ఆలయం సమీపంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో మరో చిరుత చిక్కింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత రాత్రి పన్నెండు, ఒంటి గంట మధ్య ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఆయన టీటీడీ అధికారులతో కలిసి చిరుత చిక్కిన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అటవీశాఖ అధికారుల సహకారంతో 300 మంది అటవీ సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో అలుపెరగకుండా ఆపరేషన్ చిరుత కొనసాగిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా టీటీడీ ఈవో ధర్మారెడ్డి నేతృత్వంలో నిరంతర కృషి జరుగుతోందని, ఈ కారణంగానే ఐదో చిరుతను పట్టుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వెళ్లే భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, భక్తుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. డీఎఫ్‌వో సతీష్ రెడ్డి మాట్లాడుతూ..గతంలో 4 చిరుతలను బంధించామని తాజాగా చిక్కినది ఐదో చిరుత అని చెప్పారు. చిన్నారి లక్షితపై దాడి చేసిన చిరుతను గుర్తించేందుకు శాంపిల్స్ పంపామని, నివేదిక వచ్చిన తర్వాత నిర్ధారిస్తామన్నారు. కాగా, తిరుమలలోని స్పెషల్ టైప్ కాటేజీ సమీపంలో, నరసింహ స్వామి ఆలయం సమీపంలో చిరుతలు సంచరిస్తున్నాయి. పై రెండు ప్రాంతాల్లో 2 చిరుతలు సంచరిస్తున్నట్లు ట్రాప్ కెమెరాల ద్వారా అధికారులు గుర్తించారు.

సూట్‌కేసుల్లో కోబ్రాలు.. కోతులు



బెంగళూరు విమానాశ్రయంలో పట్టివేత

సాక్షి బెంగళూరు: బ్యాంకాక్ నుంచి బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దిగిన ప్రయాణికుని లగేజ్ బ్యాగ్‌లో 78 ప్రాణులు లభించాయి, ఇందులో 20 వరకు విషపూరిత కింగ్ కోబ్రాలు కూడా ఉండటంతో విమానాశ్రయ సిబ్బంది భయపడిపోయారు. వివరాలివీ.. ఈ నెల 6న రాత్రి 10.30 గంటలకు బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఏసియా విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి సూట్‌కేసులను తనిఖీ చేశారు. వాటిలో ప్రాణంతో ఉన్న 20 కింగ్ కోబ్రా పాములు కనిపించాయి. వీటితో పాటు 55 ఇతర పాములు, ఆరు కోతులు ఉన్నాయి. మొత్తం 78 ప్రాణులను ఆ ప్రయాణికుడు అక్రమంగా బ్యాంకాంక్ నుంచి బెంగళూరుకు తరలిస్తూ కస్టమ్స్ అధికారులకు పట్టుబట్టాడు. నిందితుణ్ణి అరెస్ట్ చేసి ప్రాణులను సంరక్షణ కేంద్రానికి తరలించారు. కాగా, బెంగళూరు విమానాశ్రయం కేంద్రంగా వన్యజీవుల స్మగ్లింగ్ ముఠాలు నిషిద్ధ జంతువులను చేరవేస్తున్నట్లు అనుమానాలున్నాయి. గత నెలలో 230కి పైగా బల్లులు, పాములు, ఒక కంగారూ పిల్ల తదితరాలతో కూడిన లగేజీ పట్టుబడింది.



గైనిక్ సర్జరీల్లోనూ రోబోలు

- లేపరోస్కోపీ సర్జరీలతో పోలిస్తే రోగికి తక్కువ నొప్పి, ఇన్ఫెక్షన్ ముప్పు
- త్రీడీ విజన్ వల్ల కచ్చితత్వం, శస్త్ర పరికరాలను అన్ని కోణాల్లో తిప్పే వీలు
- రోగి శరీరంలోని సంక్లిష్టమైన ప్రదేశాలనూ చేరుకోవచ్చు

హైదరాబాద్‌లోనూ అత్యాధునిక చికిత్సా విధానం అందుబాటులోకి..
అపోలో ఆసుపత్రి డాక్టర్ అనురాధా పాండా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొబోటిక్ సర్జరీలు హైదరాబాద్‌లోనూ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పేరొందిన దాదాపు ప్రతి ఆసుపత్రీ ఈ శస్త్రచికిత్సా విధానాన్ని ఉపయోగిస్తోంది. చికిత్సా వ్యయం ఎక్కువైనప్పటికీ ఎక్కువ మంది రోగులకు నప్పే అనేక ప్రయోజనాల వల్ల రానురానూ రొబోటిక్ సర్జరీల ఎంపిక కూడా పెరుగుతోంది. విభిన్న రకాల శస్త్రచికిత్సల్లో దోహదపడుతున్న రొబోటిక్ సర్జరీ గైనకాలజీ విభాగంలోనూ ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో గైనకాలజీ శస్త్రచికిత్సల్లో రోబోల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అపోలో ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిషియన్ అండ్ గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధా పాండా మరిన్ని వివరాలు తెలియజేశారు. అవి ఏమిటంటే...

మరింత కచ్చితత్వం...

''గైనకాలజీలో రోబో అసిస్టెడ్ కీహోల్ సర్జరీని కొత్త ఆవిష్కరణగా చెప్పొచ్చు. సాధారణ లేపరోస్కోపిక్ సర్జరీలతో పోలిస్తే రోబో సాయంతో చేసే సర్జరీల్లో త్రీడీ విజన్ (త్రిమితీయ ఆకారం) ఎక్కువ కచ్చితత్వాన్ని అందిస్తుంది. శస్త్ర చికిత్సలకు ఉపయోగించే పరికరాలను 360 డిగ్రీల కోణంలో తిప్పడానికి వీలుండటం వల్ల శరీరంలో సంక్లిష్టమైన ప్రదేశాలను సైతం చేరుకోవచ్చు. ఈ శస్త్రచికిత్సా విధానంలో తక్కువ రక్త నష్టంతో పాటు నొప్పి, ఇన్ఫెక్షన్ ముప్పు కూడా తక్కువగా ఉంటుంది. తద్వారా రోగులు ఆసుపత్రిలో ఉండాల్సిన వ్యవధి కూడా తగ్గుతుంది. ఈ శస్త్రచికిత్సల్లో సర్జన్ ఒక కంప్యూటర్ కన్సోల్ నుంచి పనిచేస్తారు. తన చేతి కదలికలతో రొబోటిక్ చేతులను కదిలిస్తూ ఆపరేషన్ నిర్వహిస్తారు.



"క్లిష్టమైన హిస్టెరెక్టమీ (గర్భాశయం తొలగింపు) ఆపరేషన్లకు రోబో సాయాన్ని ఉపయోగించవచ్చు. ప్రత్యేకించి ఊబకాయంతో ఉన్న రోగి పొత్తికడుపుపై పలు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. కచ్చితత్వం, తక్కువ నొప్పితోపాటు చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్స చేయడానికి ఈ విధానం వీలు కల్పిస్తుంది"అని డాక్టర్ అనురాధా పాండా వివరించారు.

గైనిక్ రొబోటిక్ సర్జరీలతో ప్రయోజనాలు...

మయోమెక్టమీ అనేది గర్భాశయ కండరాల గోడ (ఫైబ్రాయిడ్) నుంచి నిరపాయకరమైన కణుతులను తొలగించడానికి ఉపయోగించే ఒక ప్రక్రియ. రొబోటిక్ సర్జరీ ఫైబ్రాయిడ్ కుట్టు తొలగింపునకు కూడా వీలు కల్పిస్తుంది.

ఎండోమెట్రియోసిస్ అనేది గర్భాశయం వెలుపల గర్భాశయ లైనింగ్ వంటి కణజాలాలు పెరిగే పరిస్థితి. ఈ కణజాలాలు హార్మోన్లకు ప్రతిస్పందిస్తాయి. పీరియడ్స్ సమయంలో రక్తస్రావం, నొప్పి ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ఒక సవాలు వంటిది. దీనికోసం పెల్విస్, పెల్విక్ సైడ్ వాల్స్‌లో లోతుగా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. రోబో అసిస్టెడ్ ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ద్వారా మరింత కచ్చితమైన రీతిలో అండాశయ తిత్తిని తొలగించడం సాధ్యపడుతుంది.


పేగు, మూత్రాశయం, మూత్ర నాళానికి అతుక్కొని ఉండే డీప్ ఇన్‌ఫిల్ట్రేటింగ్ ఎండోమెట్రియోసిస్ వ్యాధి చికిత్సలోనూ రొబోటిక్ సర్జరీ తక్కువ సంక్లిష్టతతో కూడుకుంటున్నదని పలు అధ్యయనాలు తెలిపాయి.

హిస్టెరెక్టమీ సర్జరీ తర్వాత కొందరిలో తలెత్తే వాల్ట్ ప్రోలాప్స్ అనే పరిస్థితిని సరిదిద్దడంలోనూ రొబోటిక్ సర్జరీ ఉపకరిస్తుంది.

ఊబకాయ రోగుల్లో శస్త్రచికిత్సలకు లేపరోస్కోపీతో పోలిస్తే రొబోటిక్ సర్జరీ వారి అనారోగ్యాన్ని, ఆసుపత్రిలో ఉండే వ్యవధిని తగ్గిస్తుంది.

లేపరోస్కోపీతో పోల్చినప్పుడు రొబోటిక్ శస్త్రచికిత్స ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. అయితే భవిష్యత్తులో ఈ చికిత్సా విధానం వాడకం మరింత విస్తృతమైతే ఈ సర్జరీల ధరలు తగ్గే అవకాశం ఉంది.

టుడేస్ గ్రాఫిక్...



ఎల్ సాల్వడార్	1,086
క్యూబా	794
రువాండా	621
తుర్క్‌మెనిస్తాన్	576
అమెరికన్ సమోవా (యూఎస్ఏ)	538
యూఎస్ఏ	531
పనామా	499
గ్వామ్(యూఎస్ఏ)	475
పలావ్	428
ఉరుగ్వే	424

ప్రపంచంలో జైళ్లలో ఉన్నవారి శాతం ఎల్ సాల్వడార్‌లో ఎక్కువట. ప్రపంచంలో జైళ్ల పరిస్థితిపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రైం అండ్ జస్టిస్ పాలసీ రీసెర్చ్(ఐసీపీఆర్) గణాంకాల ప్రకారం ఈ దేశంలోని ప్రతి లక్ష మందిలో 1,086 మంది జైల్లో శిక్ష అనుభవిస్తున్నారట. ఈ మేరకు దేశాల జాబితాను ఐసీపీఆర్ విడుదల చేసింది. ఒక విధంగా అమెరికా పేరు టాప్-10 జాబితాలో మూడుసార్లు వచ్చింది. ఎలాగంటే.. అమెరికా పరిధిలోనే ప్రత్యేక ప్రాంతాలుగా ఉన్న.. అమెరికన్ సమోవా, గ్వామ్ కూడా ఇందులో ఉన్నాయి. భారత్ 205వ స్థానంలో ఉంది. మన దేశంలో ప్రతి లక్ష మందిలో 40 మంది జైల్లో ఉన్నారు.



రిజిస్ట్రార్ ఆఫీసులో కుమార్తె పల్లవి, అల్లుడు పవన్‌తో ఎమ్మెల్యే రాచమల్లు

కుమార్తెకు ఆదర్శ వివాహం చేసిన ఏపీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తన పెద్ద కుమార్తె పల్లవికి ఆదర్శ వివాహం చేశారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుమార్తె పల్లవి, కమ్మర లీలా గోపి పవన్‌కుమార్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు అయినప్పటికీ వారి పెళ్లికి ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పలేదు. ఆయనే స్వయంగా పల్లవి, పవన్‌కుమార్‌లను గురువారం స్థానిక బొల్లవరంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకువెళ్లి సంప్రదాయం ప్రకారం పెళ్లి చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారికి రిజిస్టర్ మ్యారేజీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె ఎంబీఏ చదివేటప్పుడు పవన్‌కుమార్‌ను ప్రేమించిందని తెలిపారు. కుమార్తె ఇష్ట ప్రకారం మనస్ఫూర్తిగా ప్రేమ వివాహం చేశానని చెప్పారు. పవన్‌కుమార్ తండ్రి ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తున్నారని, ఇష్టపడిన అబ్బాయితో కుమార్తె వివాహం చేశానన్న తృప్తి తనకుందన్నారు. వివాహాన్ని ఘనంగా చేయాలని భావించానని, కానీ తన కుమార్తె అంగీకరించకపోవడంతో నిరాడంబరంగా జరిపించానని ఎమ్మెల్యే తెలిపారు. పవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడని చెప్పారు. కుమార్తెకు ఆదర్శ వివాహం జరిపించిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు.

బ్రాండ్ బాబులు



- ఆర్థిక ఎదుగుదలకు అనుగుణంగా మారుతున్న భారతీయుల అభిరుచులు
- 'రెడ్‌సీర్' తాజా నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం వివిధ రంగాల్లో విజయం సాధించి, ఆర్థికంగా మరో మెట్టు పైకెదుగుతున్న భారతీయుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా వారి అభిరుచులు, ఇష్టాలు మారుతున్నాయి. తదనుగుణంగా ఉన్నత శ్రేణి, అధిక నాణ్యత గల వస్తువులు లేదా అధిక ధరలు కలిగిన ఉత్పత్తుల (ప్రీమియం కన్జమ్షన్) కొనుగోలు వైపు వారు మొగ్గు చూపుతున్నారని, అలాంటి వాటిపై వారి ఆసక్తి పెరుగుతోందని వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థికంగా ఎదుగుతున్న భారతీయులు చేస్తున్న వ్యయం, ఇతర అంశాలను పరిశీలిస్తే ప్రీమియం కన్జమ్షన్ వైపు వారి ప్రాధాన్యతలు మారుతున్నట్టుగా అవగతమవుతోందని పేర్కొంటున్నాయి. 2019 నుంచి వ్యక్తిగత వినియోగం (ప్రైవేట్ కన్జమ్షన్) అనేది అంతకంతకు (కోవిడ్ మహమ్మారి వ్యాప్తి, తదనంతర పరిణామాల కారణంగా కొంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనా) వృద్ధి చెందుతోందని, వివిధ కేటగిరీల్లో ఎక్కువగా వ్యయం చేయడం వ్యక్తుల ఆర్థిక పురోభివృద్ధిని సూచిస్తున్నాయని స్ట్రాటజీ కన్సల్టెంట్స్ 'రెడ్‌సీర్' తాజా నివేదిక వెల్లడించింది.

సంపద పెరుగుదలను సూచిస్తున్న వినియోగ ధోరణులు

"భారతీయుల దీర్ఘకాలిక వినియోగ ధోరణులు క్రమంగా సంపద పెరుగుదలను ప్రతిబింబిస్తున్నాయి. వినియోగదారుల ప్రవర్తన, వ్యవహారశైలి (కన్జ్యూమర్ బిహేవియర్) చూస్తుంటే అన్ని విషయాల్లోనూ ఉన్నత శ్రేణి కేటగిరీల వైపు మొగ్గు చూపుతున్నట్టు స్పష్టమౌతోంది. ఇండియా డిజిటల్‌గా ఎదగడంతో పాటు దేశంలో మౌలిక సదుపాయాలు కూడా మెరుగైనందున ఈ దశాబ్దంలో ఈ ప్రత్యేక ప్రయాణం మరింత ముందుకు సాగనుంది.

- మృగాంక్ గుట్‌గుటియా, రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్

మరికొన్ని ముఖ్యాంశాలు

- ఆర్థికంగా ఎదుగుతున్న వర్గాలు.. ట్రావెల్-టూరిజం, ఫైనాన్షియల్ సర్వీసెస్, రిక్రియేషన్, ఇన్సూరెన్స్ తదితరాలపై చేసే వ్యయంలో పెరుగుదల చోటు చేసుకుంది.
- నాణ్యమైన విద్య, వ్యక్తిగత వాహనాలు, పర్సనల్ కేర్ వస్తువులు, ఆహారం, వివిధ రకాల బ్రాండెడ్ వస్తువుల కొనుగోళ్లపై ఆసక్తి పెరిగింది.
- ఏప్రిల్, మే, జూన్‌లతో ముగిసిన ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో క్రెడిట్ కార్డుల ద్వారా చేసిన చెల్లింపులు, చేసిన విమాన ప్రయాణాలు, వివిధ రకాల హైఎండ్ వాహనాల కొనుగోళ్లు ప్రైవేట్ కన్జమ్షన్ తీరును తెలియజేస్తున్నాయి

ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ గుర్తింపు

జైవిక్ అవార్డు అందుకున్న ఏపీ మంత్రి కాకాణి



సాక్షి, అమరావతి: ఇంటర్నేషనల్ క్యాపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2023 సంవత్సరానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ 'జైవిక్ ఇండియా' పోటీల్లో ప్రథమ స్థానం పొందిన ఆంధ్రప్రదేశ్‌కు అవార్డును ప్రదానం చేశారు. గురువారం రాత్రి నోయిడాలో బయోఫాక్ ఇండియా నేచురల్స్ ఎక్స్‌పోలో జరిగిన వేడుకలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు కేటగిరీలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిమటావారి పాలేనికి గన్నిశెట్టి పద్మజ, ఉత్తమ ఎఫ్‌పీఓ కేటగిరీలో పల్నాడు జిల్లా అత్తలూరు గ్రామానికి చెందిన అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ తరపున పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎఫ్‌పీఓ ఎండీ సురేంద్రబాబు అవార్డులను అందుకున్నారు.

ఏపీ విద్యాసంస్కరణలు అద్భుతం

ప్రశంసించిన నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ క్రేమెర్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మైకెల్ రాబర్ట్ క్రెమర్ ప్రశంసించారు. ఆయన గురువారం షికాగో యూనివర్సిటీలోని డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎమిలీ క్యుపిటో బృందంతో కలిసి రాష్ట్రానికి వచ్చారు. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్సనలైజ్డ్ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలలను ఈ బృందం పరిశీలించనుంది. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన ఈ బృందం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుతో విద్యాసంబంధ అంశాలపై చర్చించింది. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ఆ బృందానికి వివరించారు. ఈ బృందం మూడురోజుల పాటు ఏలూరు జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించనుంది.

రాష్ట్రానికి డెంగీ ముప్పే

- ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో 961 కేసులు నమోదు.. ఆగస్టు నెలలో రోజుకు సరాసరి వంద కేసులు
- రాష్ట్రంలోని 28 ఆసుపత్రుల్లో డెంగీపై సర్వైలెన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డెంగీ పంజా విసురుతోంది. రోజురోజుకూ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో అంటే జూలై వరకు రాష్ట్రంలో 961 డెంగీ కేసులు నమోదు కాగా, ఆగస్టు నెలలో సరాసరి రోజుకు వంద మందికి పైగా డెంగీ బారిన పడినట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంచనా వేశాయి. ఇక ఈనెల సెప్టెంబర్ మూడు నాలుగు వారాల్లో డెంగీ కేసులు ఇంకా ఎక్కువ సంఖ్యలో నమోదయ్యే అవకాశం ఉందనీ, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డెంగీ కారక దోమ వృద్ధి చెందుతోందని చెబుతున్నారు. ప్రజలు పగటి పూట దోమ కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోకుంటే డెంగీ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

28 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగీపై సర్వైలెన్స్

డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో 28 ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్వైలెన్స్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా ఆసుపత్రుల్లో డెంగీపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తారు. ఆసుపత్రుల పరిధిలోని ప్రాంతాల్లో రక్త నమూనాలు సేకరించి వాటిని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖకు పంపిస్తారు. దీనివల్ల దేశంలో ఎక్కడెక్కడ డెంగీ తీవ్రత ఉందో అంచనా వేస్తారు. ఆ మేరకు చర్యలు చేపడతారు.

విధిగా ఐజీఎం పరీక్ష చేయించాలి

డెంగీ నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. విధిగా అందుబాటులో ఉండే ఐజీఎం పరీక్ష చేయించాలని స్పష్టం చేస్తోంది. ప్లేట్‌లెట్లు 50 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరంగా భావిస్తారు. 15 వేల కన్నా తగ్గితే కొన్నిసార్లు డెంగీ మరణాలు సంభవిస్తాయి. డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్, పళ్లరసాలు రోగికి ఇవ్వాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు అదుపులోకి వస్తాయి. ఇంకా తగ్గకుంటే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తోంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.